www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 45 పుటలు : 52

# జాగృతి

వెల : ₹20/-

కలి 5127-శ్రీ విశ్వావసు భాద్రపద శుద్ధ నవమి

01-07 సెప్టెంబర్ 2025











# హిందూ ద్వేషుల ‘శవ’ పంచాయితీ







జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావు స్మారక

# కథల పోటీ

**జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు స్మారక 'కథల పోటీ - 2025' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..**



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

## నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.
8. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.



**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 10 సెప్టెంబర్, 2025**

# జాగృత 'సంఘ శతాబ్ది'

- ప్రతి దీపావళికి మీ ముంగిట చేరే విశిష్ట అక్షరదీపం-జాగృతి ప్రత్యేక సంచిక.
- భారతీయత, ఆచార వ్యవహారాలు, ధార్మిక చింతనలతో మట్టివాసనతో వ్యాసాలు, కథలతో దీపావళి సంచిక తనదైన ప్రత్యేకతలతో వెలువడుతూ ఉంటుంది.
- విశ్వావసు దీపావళి సంచిక మరింత ప్రత్యేకం.
- ఇది సంఘ శతాబ్ది సందర్భంగా వెలువడుతున్న సంచిక.
- సంఘటిత హిందూ సమాజ విజయ వేదిక.
- హిందూ ఐక్యతే ధ్యేయంగా అప్రతిహతంగా, అఖండంగా సాగిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శతాబ్ది సందర్భమిది.
- సంఘం పుట్టుకే చరిత్రాత్మకం. ఈ నూరేళ్ల చరిత్ర అసమానం. సేవ, దేశభక్తి ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా సాగుతున్న సంఘ ప్రస్థానం నిరుపమానం.
- ధర్మరక్షణ కోసం జరిపిన పోరాటం మహోన్నతం.
- ఈ అంశాలను గుర్తు చేస్తూ సంఘ పెద్దలు, ప్రముఖుల వ్యాసాలతో ఈ దీపావళి సంచిక ముస్తాబవుతున్నది.
- ఇంకా కథలు, కార్టూన్లు అదనపు ఆకర్షణ.

త్వరపడండి!

**సంచిక తేదీ : అక్టోబర్ 20, 2025**



అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 06లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : 300**
**వెల : 150/-**

- 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


**మై**సూరు దసరా ఉత్సవాలకు ప్రపంచ ప్రసిద్ధి ఉంది. తొమ్మిది రోజులు అత్యంత నిష్ఠతో హిందువులు పూజలు చేస్తారు. పూర్తిగా హిందూ తాత్త్వికతతో కూడిన దేవతను తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రూపాలతో కొలుస్తారు. ఈ సంవత్సరం మైసూరు దసరా ఉత్సవాలను ప్రముఖ కన్నడ రచయిత్రి, బుకర్ బహుమతి గ్రహీత బాను ముస్తాక్ ప్రారంభిస్తారని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎదెయ హనతెగె (హృదయ దీపం) అన్న కథా సంకలనంతో ఆమె బుకర్ గెలుచుకున్నారు. అందుకు ఆమెను తప్పక అభినందించాలి. ఆ పురస్కారం గెలుచుకోవడం ఆమెకే కాదు, కన్నడ సాహిత్య రంగానికే గౌరవం కూడా. కానీ ఆమె మత విశ్వాసం వేరు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి, అందునా కర్ణాటక రాష్ట్ర సామాజిక వాతావరణం, ప్రభుత్వ వైఖరిని బట్టి ఆమెను ఆహ్వానించాలన్న నిర్ణయం క్షణాలలోనే వివాదాస్పదంగా మారిపోయింది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన సామాజిక మాధ్యమాలను మోత మోగించింది. మైసూరు దసరా ఉత్సవాలను (నాడ హబ్బ) ప్రారంభించాలని కోరుతూ బాను ముస్తాక్‌ను లాంఛనంగా ఆహ్వానించాం అన్నది ఆ ప్రకటన సారాంశం. అయితే, ఒక ప్రపంచ ప్రఖ్యాత హిందూ ఉత్సవాలను ఒక ముస్లిం మహిళ చేత ప్రారంభింప చేసి, ప్రపంచ ప్రజలకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నది?

బాను ప్రగతిశీల భావాలున్న రచయిత్రి అని, కర్ణాటకలో జరిగిన ఉద్యమాలతో, రైతాంగ, దళిత ఉద్యమాలతో మమేకమైన వారని, ఆమె సేవలకు గుర్తింపుగా మైసూరు ఉత్సవాలలో పెద్దపీట వేసి గౌరవించే అవకాశం వచ్చినందుకు ప్రభుత్వం గర్విస్తున్నదని కూడా సిద్ధరామయ్య పరవశంతో వ్యాఖ్యానించారు. ఇలాంటి బుజ్జగింపు ధోరణిని చూసి, మాటలు విని మోసపోయే స్థితిలో ఇప్పుడు హిందువులు లేరు. అందుకే వెను వెంటనే నిరసన ప్రారంభమైంది. ఈ ఉత్సవానికి ముస్లిం బానును ఆహ్వానించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన ఇద్దరి మీద అప్పుడే కేసులు కూడా నమోదయ్యాయి. అసలు ఇంత మంచి నిర్ణయం తీసుకుంటే దీనిని వ్యతిరేకించడం ఏ మాత్రం సరైనది కాదంటూ హోంమంత్రి జి.

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు భాద్రపద శుద్ధ నవమి**

## లోపలి పేజీలలో...





ముఖపత్ర కథనం

**హిందూ ద్వేషుల 'శవ' పంచాయతీ** 6లో

ప్రత్యేక వ్యాసం

**వామనఘట్టంలో మహోన్నత సందేశం** 13లో





కొత్త ధారావాహిక నవల

**గణపతిదేవుడు**

– మత్తి భానుమూర్తి 20లో




# జాగృతి

## సంపాదకీయం

పరమేశ్వరన్ హితవు చెబుతున్నారు. మరొక మంత్రి హెచ్‌కే పాటిల్ అయితే దసరా అంటే అందరి కోసం ప్రభుత్వం నిర్వహించే ఉత్సవమన్నాడు. ఇందులో అసలు రాజకీయమే లేదట. దీనిని బీజేపీ వ్యతిరేకించక తప్పదు. అదే చేసింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యది టిప్పు సుల్తాన్ మనస్తత్వమని, హిందూధర్మాన్ని భ్రష్టు పట్టించడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ ఎమ్మెల్యే అశోక విమర్శించారు.

ఈ ఉత్సవాలలో కీలకంగా ఉండే మైసూరు వడయార్ వంశీకుడు, బీజేపీ ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్ చాలా హుందాగా ఒక వ్యాఖ్య చేశారు. ఆ ఉత్సవాలు మైసూరులోనే ప్రముఖ చాముండేశ్వరి అమ్మవారి ఆలయం

## టిప్పు మనస్తత్వం

వద్ద ప్రారంభమవుతాయి. ఆ అమ్మవారి ప్రతిమను కనుక గౌరవిస్తే బాను ముస్తాక్ ఉత్సవాలను ప్రారంభించడానికి నాకు అభ్యంతరం లేదని అన్నారాయన. హిందూ పురాణాలు, గ్రంథాలు ఈ ఉత్సవం గురించి ప్రస్తావిస్తాయి. వాటి వారసత్వం ఇందులో ఉంది. కాబట్టి బాను మొదట భువనేశ్వరి, చాముండేశ్వరి అమ్మవార్ల పట్ల గౌరవం ప్రదర్శించి, అప్పుడు ఉత్సవాలు ప్రారంభించాలని ఆయన సూచించారు. మాజీ ఎంపీ (బీజేపీ) ప్రతాపసింహ బాను అఖిల భారత సాహిత్య సమ్మేళనాన్ని ప్రారంభించడం సబబు కాని, దసరా ఉత్సవాలు కాదని అన్నారు. ఆఖరికి మైసూరు ఉత్సవాలలో సాహిత్య కార్యక్రమం ఏర్పాటు చేసి, దానిని ఆమె చేత ప్రారంభింప చేసినా అభ్యంతరం లేదని కొందరు చెబుతున్నారు. ఇదంతా బీజేపీ అభ్యంతరం మాత్రమే అనుకునేవారు అర్థం చేసుకోవాల్సిన అంశం– బీజేపీ బహిష్కృతులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. బాను మాత్రం ఇది రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన అపూర్వ అవకాశమని బయలుదేరడానికి సిద్ధపడుతున్నారు.

వీరంతా వ్యక్తిగతంగా, రచయితగా బానును వ్యతిరేకించడం లేదు. హిందూ సంప్రదాయాన్ని బుజ్జగింపు ధోరణితో కాంగ్రెస్ ఉల్లంఘించడం గురించే ప్రశ్నిస్తున్నారు. మైసూరు దసరా ఉత్సవాలు చాముండేశ్వరి పూజతో మొదలవుతాయి. కానీ ముస్లిం వర్గం నుంచి వచ్చిన బానుకు ఆ అమ్మవారి మీద విశ్వాసం ఉందా? అన్నది కూడా ప్రశ్న. అలాగే అమ్మవారిని పూజించడానికి పాటించే ఆచార వ్యవహారాలను ఆమె గౌరవిస్తారా? ఇదొక ప్రశ్న. అలాగే అమ్మవారి దగ్గర దీపం వెలిగించాలి. అది బాను స్వమతానికి వ్యతిరేకం కదా అనేవారు కూడా తక్కువేమీ కాదు. ఒకే దైవం, ఒకే పవిత్రగ్రంథం అన్న పాత విశ్వాసాన్ని ఆమె ఆపై కూడా కొనసాగిస్తారా అన్న ప్రశ్న కూడా ఉంది. దసరా సంబరాల వద్ద బాను ప్రవేశాన్ని ఎవరూ నిరాకరించడం లేదు. వాటిని ప్రారంభించడం గురించే వివాదమంతా.

హిందువులు, ముస్లింల పట్ల ఒక నిరంతర సంఘర్షణను కొనసాగించడమే తమ విజయానికి దోహదం చేస్తుందని సిద్ధరామయ్య మొదటి నుంచి నమ్ముతున్నట్టు కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ విధానమే ఇది. టిప్పు సుల్తాన్ జయంతి కార్యక్రమాన్ని అలాగే ప్రవేశపెట్టారు. దీనిని బీజేపీ, హిందువులు వ్యతిరేకించవలసి వచ్చింది. టిప్పు సుల్తాన్ ముమ్మాటికి హిందూ ద్రోహి. మేల్కోటే గ్రామంలో అతడు చేసిన ఘాతుకం చరిత్ర మరచిపోదు. పతన దశకు చేరుకున్న తరువాత హిందూ దేవతామూర్తుల బొమ్మలతో నాణేలు ముద్రించాడు. అది అతడి వాస్తవిక చిత్రం కాదు. అలాంటి టిప్పు భజన ద్వారా ఓట్లు దండుకుంటున్న పార్టీ కాంగ్రెస్. తరువాత వక్ఫ్ బోర్డులకు హద్దులు లేని అధికారాలు ఇచ్చి, తరువాత నాలుక్కరుచుకుంది. బానును మరొక విధంగా తప్పక గౌరవించుకుందాం. ప్రస్తుత నిర్ణయాన్ని కర్ణాటక ప్రభుత్వం మార్చుకోవడమే మేలు. ★

01 సెప్టెంబర్ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**కలకానిది విలువైనది**

– జె. రమాదేవి




స్థానిక ఎన్నికలకు ప్రభుత్వ వ్యూహాలు (తెలంగాణ) - 14
ప్రత్యామ్నాయాల లేమి.. సంక్షోభంలో రైతులోకం (ఆంధ్రప్రదేశ్) - 16
... రసాయనిక ఆయుధం ఫెంటానిల్ (అంతర్జాతీయం) - 18
మార్వాడీ గో బ్యాక్! (వివాదం) - 24
పరోక్షంగా భారత్‌కు సహకరిస్తున్న ట్రంప్! (అంతర్జాతీయం) - 26
మార్క్సిజం–శ్రీరామరాజ్యం–1 - 29
నాటి వ్యవస్థకు కేంద్రం దేవాలయం (గళమెత్తిన గతం) - 30
జనజీవనీ! ఉపాధ్యాయినీ! (మహిళ) - 36
ఆటలు భారీ ఆర్జనకు బాటలు (క్రీడ) - 43
మహిళా చిత్రాలకు కాలం చెల్లిందా!? (సినిమా) - 50

ధర్మస్థల-దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాత హిందూ పుణ్యక్షేత్రం. అక్కడ మంజునాథేశ్వరుడు కొలువై ఉన్నాడు. అంటే శివుని రూపమే. బెంగళూరు నగరానికి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ మహా పుణ్యక్షేత్రాన్ని నిత్యం వేలాది మంది హిందువులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు. అలాంటి పవిత్ర క్షేత్రంలో కొన్ని దుష్టశక్తులు, జాతి విద్రోహశక్తులు 'శవ' పంచాయతీ పెట్టి అపవిత్రం చేయాలని చూశాయి. శవ రాజకీయాలు చేసి అప్రతిష్ట పాల్జేయడానికి యత్నించాయి. హిందూత్వం మీద ద్వేషంతో ఎంత నీచానికయినా దిగజారే ఇలాంటి వాళ్లెవరికీ నీతినియామాలు లేవు. రాజకీయం కోసం వీళ్లంతా సృష్టించిన "గుట్టల కొద్దీ" శవాల మీద కొన్ని యూట్యూబ్ చానళ్లు పేలాలు ఏరుకుతిన్నాయి. సామూహిక ఖననాలు జరిగాయంటూ అమ్ముడు పోయిన ఒక వ్యక్తి చేత చెప్పించారు. ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రం పవిత్రత మీద, హిందువుల విశ్వాసాల మీద దొంగదాడి చేయడమే లక్ష్యంగా ధర్మస్థల వివాదం నడిపించారు. దీనికి కాంగ్రెస్, సామాజిక కార్యకర్తల ముసుగులో ఉండే

# హిందూ 'శవ' ...



ధర్మస్థల చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో వందలాది యువతుల శవాలను పూడ్చిపెట్టారని, అవన్నీ లైంగిక అత్యాచారాలకు గురైన వారివేనని ఒక వ్యక్తి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెప్పడంతో దేశం నిర్ఘాంతపోయింది. తన చేతులతోనే డెబ్బయ్ ఎనభయ్ భౌతికకాయాలను అటవీ ప్రాంతంలో పాతి పెట్టానని అతడు చెప్పడం తీవ్ర సంచలనం సృష్టించింది. అక్కడ ఉన్న నేత్రావతి నదీతీరంలో ఈ ఘోరం జరిగిందని అతడు చెప్పుకొచ్చాడు. దాదాపు నెలరోజుల పాటు అత్యంత ఉత్కంఠను నింపిన ఈ ఉదంతం చివరికి పెద్ద అబద్ధమని తేలిపోయింది. ఇది హిందూ బంధువుల గుండెల మీద బరువు దిగినట్టు తాత్కాలికంగా అనిపించవచ్చు. కానీ దీని వెనుక ఉన్న ఆ భారీ కుట్ర మన ధర్మం, పుణ్యక్షేత్రాల భవిష్యత్తు గురించిన ప్రశ్నల బరువును ఎంతో పెంచింది. అమ్ముడుపోయిన కొందరు వ్యక్తులు చెప్పిన మాటలు పట్టుకుని కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఎందుకు ఆదరాబాదరాగా నియమించింది? వేలాది శవాలను పాతిపెట్టానని ఒక తాగుబోతు అంటే, ఆ మాట ఆధారంగా పోలీసు యంత్రాంగం తక్షణమే ఎందుకు రంగంలో దిగిపోయింది?

**కుట్రకు ఆరంభం**

జూన్ 22న ఇద్దరు న్యాయవాదులు సామాజిక మాధ్యమాలలో పెట్టిన ఒక లేఖతో గొడవ మొదలయింది. నిజానికి పాత రగడకు ఊపిరి పోసినట్టయింది. ఓజస్వి గౌడ, సచిన్ ఎస్ దేశ్‌పాండే అనే ఆ ఇద్దరు ధర్మస్థలలో వందలాది శవాలను సామూహిక ఖననం చేశారని లేఖలో ఆరోపించారు. దీనికి బలం చేకూర్చుతూ, దేశం దృష్టి అటు మళ్లించేటట్టు చేసే పరిణామం జూలై 4న జరిగింది. నఖశిఖ పర్యంతం ముసుగు ధరించి వచ్చి, ముసుగు మనిషి పేరుతో మాధ్యమాలలో ప్రసిద్ధుడైన, ఇంతకాలం హిందువుల మనసులను బాధపెట్టిన వ్యక్తి ఆరోజున పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొత్త దగా ఆరంభమైంది. సీఎన్ చెన్నయ్య అన్న ఆ ముసుగు మనిషి పేరు బయటపడడానికి కొన్ని వారాలే పట్టింది. కేవలం ముసుగు మనిషి అంటూ మీడియా రాసేది. అతడి ప్రాణాలకు అంత ముప్పు ఉందని ఉత్కంఠ పెంచారు. జూలై 10న ఇతడే ఒక మానవ కపాలం పట్టుకుని ధర్మస్థలలోనే బెల్తంగాడీ కోర్టుకు వచ్చాడు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయ్యమన్నట్టే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జూలై 19న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించారు. ఆ కిరాయి మనిషి మాటల ఆధారంగా నేత్రావతి తీరంలో, ఆలయం సమీపంలోని అడవిలోని 13 ప్రదేశాలను ఎంపిక చేసి తవ్వకాలు మొదలు పెట్టారు. అక్కడే తాను శవాలను పాతి పెట్టానని అతడు అడ్డంగా అబద్ధమాడాడు.

కమ్యూనిస్టులు, అర్బన్ నక్సల్స్, ఒక ముస్లిం యూట్యూబర్ తమ వంతు సాయం చేశారు. పరమ జుగుప్సాకరమైన తమాషా చూపించాలని అనుకున్నారు. ఒక ప్రఖ్యాత హిందూ దేవాలయం ఖ్యాతిని మసక పరిచే ప్రయత్నంలో కోట్లాదిమంది హిందువుల మనోభావాల మీద సమ్మెటతో మోదారు. ఆ ఆలయాన్ని ప్రతిష్టాత్మకంగా, గొప్ప సేవా దృక్పథంతో శతాబ్దాలుగా నిర్వహిస్తున్న జైనబంట్ కుటుంబాన్ని వీధి పాల్జేయాలన్న దురుద్దేశంతోనే ఇదంతా చేశారని చివరికి బయటపడిపోయింది.

చివరికి ధర్మస్థలలో ధర్మానిదే పైచేయి అయింది. శవాల గుట్టు బయటపడిపోయింది. అంతా కుట్ర అని తేలింది. బీజేపీ మీద రాజకీయ పోరాటం పేరుతో హిందూధర్మం మీద యథేచ్ఛగా సాగిపోతున్న దాడిలో ఇదొక భాగం మాత్రమేనని స్పష్టమైంది. ఇప్పుడు కర్ణాటక పోలీస్ వ్యవస్థ పరువు, కర్ణాటక ప్రభుత్వ ప్రతిష్ట మొత్తం కుళ్లిన శవం కంటే జుగుప్సాకరంగా ఉందంటే తొందరపాటు కాదు.


వీరేంద్ర హెగ్గడ

# ద్వేషుల పంచాయతీ


ధర్మస్థల మంజునాథ ఆలయం, ఇన్‌సెట్‌లో మంజునాథుడు

తానే కాకుండా దేవస్థానంలో పనిచేసే మరొక ఐదారుగురు కూడా ఈ పని చేశారని చెప్పాడు. ఆలయ సిబ్బందే తమకు శవాల సంగతి తెలియ చేసేవారని, తాము వాటిని తీసుకెళ్లి సమీపంలోని కొండలలో, అడవిలో పాతిపెట్టేవాళ్లమని వెల్లడించాడు. ఇంతకీ ఆరో నెంబర్ స్థలంలో ఒక మానవ కంకాళం కనిపించింది. తరువాత మరొక కంకాళం 11వ నెంబర్ స్థలంలో దొరికింది. ఇవి పురుషులవే కావడం విశేషం. ఆ దగాకోరు చెప్పినట్టు అవి యువతలవి కావు. ఒక నెల పాటు సాగిన ఈ సుదీర్ఘ దగా తరువాత సిట్ కూడా ఆ పారిశుద్ధ్య కార్మికుడు చెప్పిన మాటలను రుజువు చేసే సరైన ఆధారాలే లేవని నిర్ధారణకు వచ్చింది. కోర్టును కూడా మోసం చేసేందుకు అతడు ప్రయత్నించాడు. కోర్టుకు అతడు తెచ్చి చూపించిన అస్థికలన్నీ పురుషులవే. తరువాత నిస్సిగ్గుగా, నిష్పూచీగా, తాను చూపించిన ఏ ప్రదేశం లోను మానవ కంకాళాలు దొరకని మాట నిజమేనని, అందుకు కారణం, ప్రకృతిలో వచ్చే పరిణామంతో భూమి కొట్టుకుపోవడమేనని అతడు చెప్పడం విశేషం. యంత్రాలే ఈ విషయం గమనించలేక పోయాయి. ఇక మానవమాత్రుడినైన నేనెంత అని కూడా అన్నాడు. పెద్దల ఆదేశాల మేరకు 70 నుంచి 80 శవాలను పాతి పెట్టినట్టు ఆ ముసుగు మనిషి చూపిన స్థలంలో (13 నెంబర్ స్థలం) సిట్ గ్రౌండ్ పెనిట్రేషన్ రాడార్‌ను ఉపయోగించింది. అక్కడ 20 నుంచి 40 అడుగుల లోతుకు సిట్ తవ్వించింది. యంత్రం విఫలమైనదంటూ చెన్నయ్య వ్యాఖ్యానించినది ఈ ఫలితాలతోనే. ఖననం చేసిన స్త్రీలు మొదట లైంగిక అత్యాచారానికి గురయ్యారని, హింసించి చంపారని ఎలా గమనించావని సిట్ బృందం ప్రశ్నిస్తే, తాను గుర్తించలేదని, ఆ మృతదేహాలను చూస్తే తనకు అలా అనిపించిందని చెప్పాడు. అలాంటివి ఉంటే డాక్టర్లు మాత్రమే చెప్పగలరని, తాను చెప్పలేనని కూడా అన్నాడు. తాను ఖననం



ముసుగు మనిషి.. చెన్నయ్య

చేసిన శవాలలో 13 ఏళ్ల బాలికది కూడా ఉందని అతడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ శవాన్ని ఖననం చేసిన స్థలం వద్ద తవ్వినా అందుకు సంబంధించి ఏవీ ఆ ప్రదేశంలో దొరకలేదు. ఇంతకీ ఇంతకాలం తరువాత ఈ శవాల సామూహిక ఖననం అతడికి ఎందుకు గుర్తుకు వచ్చింది? చేసిన పాపాలకు పరిహారం చెల్లించుకోవడానికే తాను తిరిగి వచ్చానని, ఎలాంటి లాంఛనాలు లేకుండా అంత్యక్రియలు జరిగిన వీరికి ఏదో మంచి చేయడమే తన ఉద్దేశమని అతడు చెప్పాడు. ఈ చావుల గురించి అప్పుడు మీడియాలో రాకపోవడం, ఎవరికీ తెలియకపోవడం వల్ల దగ్గరివారు ఎవరూ రాలేదని కూడా చెప్పాడు. సిట్ బృందం, దాని నాయకుడు ప్రణబ్ మహంతి అతడిని విచారించారు. చెన్నయ్య కోర్టులో చెప్పిన దానిని సిట్ బృందం నమ్మలేకపోయింది. ఇప్పటిదాకా చేసిన తవ్వకాలలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అతడు చెప్పిందంతా అబద్ధమని నిర్ధారించారు. ఇవి ఎలాంటి అబద్ధాలంటే, పోలీసులైనా తట్టుకోవడం కష్టమే. అందుకే ఇతడిని ఆగస్ట్ 23న అరెస్టు చేశారు.

ఇతడు కోర్టులోను, పోలీసుల దగ్గర ఒక పథకం మేరకు శిక్షణతోనే సమాచారం వెల్లడించినట్టు అర్థమవుతుంది.'చాలామంది మహిళల మృతదేహాల మీద దుస్తులు లేదా లోదుస్తులు లేవు. కొందరి మృతదేహాల మీద హింస, లైంగిక అత్యాచారాలకు సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా ఉన్నాయి. గొంతు నులిమి చంపినట్టుగా గాయాలు ఉన్నాయి. కొందరు విద్యార్థినులు సహా వందమందికి పైగా లైంగిక అత్యాచారాలకు గురయ్యారు. తరువాత చంపి పాతిపెట్టారు.' జూన్ 3, 4 తేదీలలో చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు ఇవి. కొన్ని మానవ కంకాళాల ఫోటోలు సహా ఈ ఫిర్యాదు ఇచ్చాడతడు. తరువాత పోలీసు బందోబస్తు మధ్య బెల్తంగడి కోర్టుకు హాజరయ్యాడు. కళ్ల మీద పారదర్శ కంగా ఉండే గుడ్డ మినహా, మిగిలిన శరీరమంతా కప్పుకుని అతడు కోర్టుకు వచ్చాడు. ఆ మృతులలో వందమందిని తన చేత బలవంతంగా పాతి పెట్టించా రంటూ తన ఫిర్యాదులో పేర్కొన్న విషయాన్ని న్యాయ మూర్తి ఎదుట చెప్పడానికి అతడిని తీసుకువచ్చారు. ఆ దురాగతాలు, లేదా లైంగిక అత్యాచారాలన్నీ 1998–2014 మధ్య జరిగాయని అతడు చెప్పాడు. ఎంత విషాదమంటే, ఆ రోజున వర్షంలోను కొందరు కోర్టు వద్ద ప్లకార్డులు పట్టుకుని నిలబడ్డారు. ధర్మస్థలలో చనిపోయినట్టు చెబుతున్న తమ కుటుంబ సభ్యుల అవశేషాలను ఇవ్వాలని వారంతా కోరారు.

ఇంతకీ, రాజు (వైద్యనాథపుర), చెన్నయ్య ధర్మస్థల దేవస్థానంలో పారిశుద్ధ్య కార్మికులుగా పదేళ్ల క్రితం కలసి పనిచేశారు. ఒక పుణ్యక్షేత్రాన్ని, దానిని నిర్వహిస్తున్న వారిని అపఖ్యాతి పాలు చేయడానికి ఇంత దారుణానికి ఒడిగట్టడం దారుణమని రాజు చెప్పాడు. ఇతడిని కూడా సిట్ అరగంట పాటు విచారించింది. మంజునాథ ఆలయానికి సమీపంలో నదీతీరంలో బాహుబలి బెట్టా రేవు వద్ద తామిద్దరం విధులు నిర్వహించేవారమని, మేం ఇరుగు పొరుగు కూడానని, దేవస్థానం వారు మంచి జీతం, మంచి భోజనం కూడా ఇచ్చేవారని సిట్ ఎదుట చెప్పాడు రాజు. కొన్ని కుళ్లిన శవాలను చూశామని, చెట్లకు ఉరి వేసుకుని మరణించినవారిని కిందికి దించామే తప్ప వాటిని ఎప్పుడూ తాము పూడ్చి పెట్టలేదని రాజు చెప్పాడు. ఆ శవాలను అంబులెన్స్ లలో తీసుకుపోయేవారని తెలియచేశాడు. ఎవరివో శవాలు తీసుకెళ్లి ఖననం చేయమని తమను ఎవరూ ఏనాడూ ఆదేశించలేదని, తాము ఖననం చేసినవన్నీ పోలీసుల సమక్షంలోనేనని కూడా చెప్పాడు. మరి పోలీసులు ప్రదర్శించిన ఈ అత్యుత్సాహానికి అర్థం ఏమిటి?

**ఎవరీ చెన్నయ్య?**

ఇంతకీ ఈ ముసుగు మనిషి లేదా చెన్నయ్య ఎవరు? ఇతడు కర్ణాటకలోని మాండ్యాకు చెందిన వాడు. నిజానికి తమిళుడు. ఆ రాష్ట్రంలోనే 1980లో పుట్టాడు. మాండ్యాలో 1987 నుంచి 1995 వరకు చదువుకున్నాడని రికార్డులు చెబుతున్నాయి. ధర్మస్థలకు సమీపంలోని ఉజిరేలో ఉన్న తన సోదరుడి ద్వారా ఇతడు దేవస్థానంలో ఉద్యోగం తెచ్చుకున్నాడు. తరువాత తమిళనాడులో కూడా పారిశుద్ధ్య పనులు చేశాడు. కానీ ధర్మస్థలలోను, తమిళనాడులోను కూడా ఆరోపణల కారణంగా తొలగించారు. ఇతడెంత అబద్ధాలకోరో మాండ్యాలో అందరికీ తెలుసు. తెలియనది పోలీసులకే. ఇతడి గతం కూడా అంతో ఇంతో నేరపూరితమైనదే. ఇతడు చేసిన ఒక ఆరోపణను పట్టుకుని కొండను తవ్వారు. వందల శవాలు ఖననం చేశానన్నాడు చెన్నయ్య. తానే 70కి పైగా పాతిపెట్టా నన్నాడు. అన్నీ కలిపి పాతిక ముప్పయ్‌కి మించి కూడా ఎముకలు దొరకలేదు. అయితే ఇతడి తల్లిదండ్రులకి అతడి వర్గంలో మంచి పేరు ఉంది. గౌరవనీయులన్న ఖ్యాతి ఉంది. చెన్నయ్య మూడో తరగతి చదివాడు. ధర్మస్థల నుంచి 2014లో మళ్లీ స్వగ్రామం వెళ్లాడు, మూడో భార్యతో. అక్కడ ఉన్న ఒక సంవత్సరంలో ప్రభుత్వ స్థలంలో గ్రామ పంచాయతీ నిర్మించిన షెడ్ తనదని స్థానికులతో గొడవకు దిగడంతో అక్కడ నుంచి వెళ్లిపోవలసి వచ్చింది. గ్రామస్థులు ఎవరు ధర్మస్థలకు వెళ్లినా వారిని గుడిలోపలి వరకు తీసుకుపోయేవాడు. ఒకసారి గ్రామంలో చీరలు పంచిపెట్టాడు. అవి వీరేంద్ర హెగ్గడ ఇచ్చారని చెప్పాడు. అలాగే మరొక దారుణం విషయం, శవాల మీద ఉండే చిన్న చిన్న ఆభరణాలు ఇతడు దొంగిలించేవాడని ఆ గ్రామస్థులు చెప్పారు. ఇతడు ధర్మస్థల గురించి అలాంటి ప్రకటన చేసి ఉండవలసింది కాదు. కానీ డబ్బు కోసం ఇతడు ఎంతకయినా దిగజారతాడని వారు చెప్పారు.

**మొదటి భార్య ఆరోపణ**

చెన్నయ్య మొదటి భార్య కూడా అతడు శుద్ధ అబద్ధాలకోరనే చెప్పింది. తాను 25 ఏళ్ల క్రితం అతడిని పెళ్లి చేసుకున్నానని, కుమార్తె, కొడుకు ఉన్నారని, తనను నిరంతరం తిట్టడం కొట్టడంతో విడాకులు తీసుకుని నాగమంగళలోని పుట్టింటికి చేరుకున్నానని మీడియాతో చెప్పారు. ఇతడికి ధర్మస్థలలో వీరేంద్ర హెగ్గడ ఒక ఇల్లు ఇచ్చి, రూ 3000 జీతం ఇచ్చేవారని చెప్పింది. నేత్రావతి నదిలో కొట్టుకు వచ్చిన అనాథ శవాలను పూడ్చి పెడతానని చెప్పి రాత్రిళ్లు వెళ్లేవాడని, ఏం చేసేవాడో తెలియదని అన్నారు. ఇతడి అబద్ధాల మీద పూర్తిగా దర్యాప్తు

జరిపించాలని కూడా ఆమె కోరారు. మొదటి భార్య విడాకులు తీసుకున్న తరువాత మరొక పెళ్లి చేసుకున్నాడు. ఆమె సత్యమంగళలోని బన్నారికి చెందినది. ఆమె ఏం చెప్పారంటే, తనతో పెళ్లి జరిగినా ఇతడు మరొక స్త్రీని తీసుకుని వెళ్లిపోయాడు. దీనితో తాను పరిహారం కోరానని, ఆ డబ్బు కోసం ఈ పని చేసి ఉంటాడని అన్నారు. చెన్నయ్య సహోద్యోగి, వైద్యనాథపురకు చెందిన రాజు కూడా చెన్నయ్య గతం గురించి ఇదే చెప్పాడు. అతడి జీవితమంతా అబద్ధాలతోనే నిండి ఉంది. ధర్మస్థలను అపఖ్యాతి పాల్జేయాలన్న ఉద్దేశం ఉన్న ఆ ముఠాతో ఇతడు కలవడానికి ముందు వరకు తమిళనాడులోనే ఉన్నాడు. ఆ వాస్తవాలు కూడా త్వరలోనే బయట పడతాయని అనుకోవచ్చు. తమిళనాడులోనే ఈ కుట్రకు పునాదులు పడ్డాయని ఇప్పటికైతే భావిస్తున్నారు.

**సమీర్ వీడియో**

జూలై 10న చెన్నయ్య ఒక మానవ కపాలం పట్టుకుని ధర్మస్థలలోనే బెల్తంగాడీ కోర్టుకు వచ్చి సంచలనం సృష్టించిన ఒక రోజు తరువాత భయానకమైన వీడియో బయటకు వచ్చింది. 'దూత' యూట్యూబ్ చానల్ దీనిని లోకం మీదకు వదిలింది. 23 నిమిషాల 52 సెకెండ్లు ఉన్న ఆ వీడియో పేరు 'హూ ఆర్ సీరియల్ కిల్లర్స్ ఆఫ్ ధర్మస్థల' (ధర్మస్థల వరస హత్యలు ఎవరు చేశారు?). ఆ చానెల్‌ను నడుపుతున్న వివాదాస్పద సమీర్ మహమ్మద్ అనే యూ ట్యూబర్ జూలై 12, 2025న దీనిని అప్‌లోడ్ చేశాడు. దీనిని 31 లక్షల మంది చూశారట. ధర్మస్థల ఆలయం చుట్టూ ఉన్న అడవులలో వందలాది మృతదేహాలను పూడ్చి పెట్టారంటూ చెన్నయ్య చేసిన ఆరోపణల ఆధారంగా తయారు చేసిన వీడియో ఇది. కానీ చెన్నయ్య కథనానికి సమీర్ సొంత పైత్యాన్ని కూడా రంగరించి వదిలి పెట్టాడు. చెన్నయ్య రెండు చెబితే సమీర్ ఇరవై రాశాడు. ఈ విషయం పోలీసులే చెప్పారు. వివాదాలు సృష్టించడం సమీర్ మహమ్మద్‌కు కొత్తేమీ కాదు. 2008 నాటి ఒక విద్యార్థిని హత్యమీద ఇతడు పెట్టిన వీడియోకు సంబంధించి పది కోట్ల రూపాయల పరువు నష్టం కేసులో ఈ ఏప్రిల్‌లోనే కోర్టు సమన్స్ పంపింది. అది కూడా ధర్మస్థలకు చెందినదే. శ్రీక్షేత్ర ధర్మస్థల ప్రతినిధి డి. హర్షేంద్రకుమార్, నిశ్చల్ డి ఈ కేసు వేశారు. సమీర్ హిందూ ధార్మిక కేంద్రాలను అపఖ్యాతి పాలు చేయడమే పనిగా పెట్టుకున్నాడని ఆనాటి పిటిషన్‌లోనే వారు కోర్టుకు ఫిర్యాదు చేశారు. తరువాత అదే హిందూ పుణ్యక్షేత్రం మీద చెన్నయ్య ఆరోపణలు చేయడంతో కేసుకు కొత్త జీవం వచ్చింది. ఇంతకీ ఈ వీడియో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించినది. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు దక్షిణ కన్నడ పోలీసులు ఇతడికి వారెంట్ జారీ చేశారు. ఇలాంటి కుళ్లిన సమా చారంతో మన తెలుగు అర్బన్‌నక్సల్స్ కూడా వీడియోలో వదిలిపెట్టారు. అందులో ఒకదాని పేరు 'తవ్విన కొద్దీ ఘోరాలు'. ఏవీ ఘోరాలు? ఏవీ శవాలు? రుజువులేవీ సామూహిక ఖననాలకి! అయినా ఇప్పటికీ ఈ బాపతు యూట్యూబర్లు అక్కడ శవాల గుట్టలు ఉన్నాయంటూ నమ్మించడానికే చూస్తున్నారు?

**తౌసిఫ్ ఇంక్ యూట్యూబ్ కథనం**

కనిపించకుండా పోయిన వారి ఆచూకీ తెలుసుకుని అందించడం, ఉత్కంఠలు ఛేదించడం మా ప్రత్యేకత అంటూ ఈ చానల్ చెప్పుకున్నది. ధర్మస్థలలో కనిపించకుండా పోయారంటూ చాలా మంది పేర్లు ఇచ్చింది. తప్పిపోయిన వారి కథనాలు ఎక్కడెక్కడివో జరిగినవి ఇచ్చాం. ఇప్పుడు ధర్మస్థలలో జరిగినదేమిటో చెబుతాం అంటూ ఈ పేర్లు ఇచ్చింది. ధర్మస్థల పశ్చిమ కనుమలలో ఉంది. నేత్రావతి నదికి సమీపంగా ఉన్న ఈ ఆలయానికి ఏటా లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. అక్కడ వేలాది మందికి



మహేశ్‌శెట్టి

ఉచితంగా భోజనాలు పెడతారు. తమదైన ప్రత్యేక న్యాయవ్యవస్థతో వివాదాలు పరిష్కరిస్తారు. అది ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఆలయం. అయితే దీనికే మరొక చీకటి కోణం ఉందంటూ ఈ కథనం వండి వార్చింది. 1998 నుంచి 2013 వరకు ఇక్కడ 400 మంది కనిపించకుండా పోయారని ఈ చానల్ చెప్పింది. మరొక 463 మంది అసహజంగా మరణించారని కూడా వెల్లడించింది. జూలై 22, 2025న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఛేదించడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందని కూడా ఇది చెప్పింది. ఆలయ పరిసరాలలోని అడవులు, నేత్రావతి నదిలో, అతిథి గృహాలలో గుర్తు తెలియని వారి శవాలు చాలా కనిపిస్తాయని, కానీ ఎలాంటి విచారణ లేకుండానే అవన్నీ ఆత్మహత్య లేనని రూఢి చేసేస్తారని కూడా తెలియచేసింది. స్థానికులు కూడా ఈ బలవన్మరణాల గురించి, ప్రధానంగా మహిళలు, బాలికల గురించి గుసగుసలాడుకుంటూనే ఉంటారట. వీళ్ల మీద కూడా లేచివచ్చి ఆత్మహత్య చేసుకున్నవారిగా, ప్రమాదాలలో మరణించిన వారిగా ముద్ర వేస్తారని చెప్పుకుంటారని కూడా తేల్చేసింది. గడచిన 20 ఏళ్లుగా ఇలా బయట పడిన శవాల వివరాలు ఇవ్వవలసిందిగా ఇప్పుడు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ దక్షిణ కన్నడ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని నివేదిక కోరిందని కూడా ఈ చానల్ తెలియచేసింది. దీనికి గురించి సామాజిక కార్యకర్తలు ఏం చెబుతారో అంటూ ఈ చానల్ చేసిన వ్యాఖ్య మనకి చాలా సందేహాలు తెస్తుంది. ధర్మస్థల ఏకాంతంగా ఉంటుందని, ఇక్కడ ఆలయం కారణంగా ఆ బలవన్మరణాల గురించి వివరాలు తెలియకుండా ఉండిపోయే అవకాశం ఉందని అంటారట. కానీ నవేద్దు నిల్లాదిద్దారే వంటి సంస్థలు వాటిపై దర్యాప్తు చేయించాలని గతంలో ఉద్యమాలు చేశాయట. జూలై 3న ముసుగు మనిషి ఇచ్చిన వాఙ్మూలం కారణంగా ఇక్కడకు వచ్చి కనిపించకుండా పోయిన తమ కుటుంబికుల అస్థికలు ఇస్తే సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించుకుంటామంటూ అనేక మంది వచ్చారని కూడా తెలియచేసింది. 1979లో వేదవల్లి అనే ఆమె ఈ ఆలయం వద్ద కనిపించకుండా పోయిందంటూ జాబితా మొదలుపెట్టి 2018లో 15 ఏళ్ల వయసు విద్యార్థి శవం దొరకడం వరకు పలువురి పేర్లు ఈ




సమీర్ విడుదల చేసిన వీడియో..

వెబ్‌సైట్ ఇచ్చింది. ఇందులో సౌజన్య కేసు ప్రత్యేకమైనది (అనన్య కేసు కల్పితం, ఈ సంగతి ఆమె తల్లిగా చెప్పుకున్న సుజాతా భట్ అంగీకరించింది). సౌజన్య మృతదేహం అక్టోబర్ 9, 2012లో దొరికింది. ఆలయం నిర్వహించే ఒక ఆసుపత్రి వద్ద అడవికి సమీపంలో దొరికిన ఈ యువతి దేహం మీద లైంగిక అత్యాచారం జాడలు కనిపించాయని చెబుతారు. జస్టిస్ ఫర్ సౌజన్య పేరుతో మహేశ్ శెట్టి తిమెరోడి ఉద్యమం మొదలు పెట్టాడు. ఇతడు బీజేపీ మీద ధ్వజమెత్తి, ఆ పార్టీ ప్రముఖుడు బీఎల్ సంతోష్ మీద అవాకులూ చెవాకులూ పేలినందుకు అరెస్టయ్యాడు. బెయిల్ మీద వచ్చాడు.

సిట్ జరుపుతున్న దర్యాప్తు గురించి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు మంజునాథ్ ఎన్ అనే న్యాయవాదిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ పాతిపెట్టిన శవాలకు పరీక్షలు జరుపుతున్నారంటూ ఈ న్యాయవాది జూలై 30న ఒక పత్రికా ప్రకటన విడుదల చేశాడు. దీనిమీదే ధర్మస్థలలోని బెల్తంగడి ప్రాంత వాసి రఘురామ్ శెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### అనన్య ఎవరు?

ధర్మస్థల సామూహిక ఖననాల కథనానికి ఊపు, అదనపు ఆకర్షణ తెచ్చిన పేరు అనన్య. ఈ వివాదం చెలరేగి, చెన్నయ్య పోలీసు స్టేషన్‌లో, న్యాయస్థానంలో స్వైర విహారం చేస్తున్న సమయంలోనే తెర మీదకు వచ్చిన మరొక కిరాయి పాత్ర సుజాతా భట్. మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న తన కుమార్తె అనన్య ధర్మస్థలలోనే మాయమైందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమె తరఫు న్యాయవాదే మంజునాథ్ ఎన్. మణిపాల్‌లో చదువుతున్న అనన్య 2003లో మిత్రులతో కలసి ఇక్కడికి వచ్చి మళ్లీ కనిపించలేదని సుజాతా భట్ చెప్పింది. అది పచ్చి అబద్ధం. 2003 నాటికి తాను సీబీఐ కోల్‌కొతా కార్యాలయంలో స్టెనోగా పనిచేసేదానినని, అప్పుడు ధర్మస్థలకు రైలు మీద వచ్చానని చెప్పింది. నాటి ఆలయ ధర్మాధికారి వద్దకు వెళ్లి అనన్య కనిపించకుండా పోయిన సంగతి చెప్పానని, అందుకు ఆయన ఎవరితోనో లేచిపోయి ఉంటుందని అవమానకరంగా మాట్లాడారని కూడా సుజాతాభట్ కథనం. అప్పుడే తనను ముగ్గురు వ్యక్తులు వెంబడించారని, అనన్య ఆచూకీ తమకు తెలుసునంటూ తనను తీసుకువెళ్లి చేతులు కట్టేశారని, మరునాడు 'వేకువన నీకు బతుకు మీద ఆశ ఉంటే ఈ ఊరి నుంచి వెంటనే వెళ్లిపోవాల'ని ఆదేశించారని కూడా చెప్పింది. అందుకు తాను నిరాకరించడంతో తల మీద కొట్టారని, ఆ దెబ్బతో కోమాలోకి వెళ్లపోయిన తాను మూడు మాసాల తరువాత మేలుకొన్నానని చెప్పింది. తీరా మంగళూరులోని తమ ఇంటి వచ్చి చూస్తే అంతా చిందరవందరగా ఉందని, పత్రాలు, ఫోటోలు అన్నీ పట్టుకుపోయారని అందుకే అనన్య ఫోటో ఇవ్వలేకపోయానని చెప్పింది. కానీ సుజాత చెప్పిన సంవత్సరాలలో మణిపాల్ వైద్య కళాశాలలో అనన్య అనే అమ్మాయి ఎవరూ చదవలేదని యాజమాన్యం తెలియచేసింది. కేసు బట్టబయలయిన తరువాత అసలు అనన్య భట్ అనే యువతి లేనేలేదని సుజాతా భట్ ఒక యూట్యూబర్ దగ్గర నోరు జారారు. కొందరి బలవంతం వల్లనే తాను ఆ అబద్ధం చెప్పానని కూడా అంగీకరించారు. వీరిలో సుజాతా భట్ ఆడిన

## మంజునాథుడి కొలువు

శ్రీక్షేత్ర ధర్మస్థల దక్షిణ భారతదేశంలోనే ఎంతో ప్రసిద్ధి కలిగిన ఆలయం. 800 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో మంజునాథేశ్వరుడు కొలువై ఉన్నాడు. శివుడినే మంజునాథేశ్వరుడు (ఆయన అవతారం) అని పిలుచుకుంటారు. ఈ ఆలయం ప్రత్యేక ఏమిటంటే ఇది శైవ ఆరాధన ఆలయమయినా, వైష్ణవ అర్చకులు ఉంటారు. నిర్వాహకులు జైనులు. పేరుకు తగ్గట్టు ఇది ధర్మభూమిగా నమ్ముతారు. భారతీయత ప్రకారం ధర్మమే అత్యున్నత జీవన విలువ. ఇక్కడ ఇంకా ధర్మదైవం, అమ్మవారి విగ్రహాలు కూడా ఉంటాయి. కాలరాహు, కాలర్కయి, కుమారస్వామి, కన్యాకుమారి విగ్రహాలు కూడా ఇక్కడ ప్రతిష్ఠించారు. ఈ ఆలయం బెల్తంగడిలోని కుడుమ అనే చిన్న గ్రామంలో నిర్మించారు. ఇదే ధర్మస్థలగా స్థిరపడింది. అంటే ధర్మస్థల అసలు పేరు కుడుమ. నేత్రావతి నదికి సమీపంగా ఈ ఆలయం ఉంది. జైన మతానికి చెందిన బిర్మన్న ప్రెగ్గడే, ఆయన భార్య అమ్ము బల్లాలతి ఆ గ్రామంలోనే నివాసం ఉండేవారు. ఒకరోజు ధర్మదేవుడు, నలుగురు దేవతలు మానవరూపంలో వారి ఇంటికి వచ్చారు. ధర్మానువర్తనులైన ఆ జైన దంపతులు దేవతలను ఆహ్వానించారు. ధర్మ ప్రచారం కోసం ఈ ఇల్లు కావాలని దేవతలు కోరడంతో, వీరు ఆనందంగా అంగీకరించారని పురాణం. నలుగురు ధర్మదైవాలను ఇంటిలో ప్రతిష్టించిన తరువాత జైన బిర్మన్న పూజాదికాల కోసం ఒక అర్చకుడిని తీసుకువచ్చాడు. ఆయన శివలింగం కూడా ప్రతిష్ఠించమని సలహా ఇచ్చాడు. అలా మంజునాథేశ్వరుడు వెలిశాడు. ఇప్పటికి బిర్మన్న ప్రెగడ వారసులే ధర్మాధికారులుగా కొనసాగుతున్నారు.



శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-


Visit Youtube Link:
• Agriculture Implements at low cost - Rythu Nestham
• Low Cost agriculture machines to farmers - HMTV
Contact Number : 9849140465

నాటకం మామూలుది కాదు. ఈమెకు అసలు కూతురే లేదు. ఇంతకీ ధర్మస్థల మీద ఈవిడకు వ్యక్తిగత కక్ష ఎందుకట! కథో, వాస్తవమో తరువాత తెలుస్తుంది. అదేమిటో చూద్దాం! ఈమె తాతగారు తన ఆస్తిని ధర్మస్థల దేవస్థానానికి అమ్మేశారు. అందులో తనను వాటాదారుగా చేర్చడానికి ఆలయ యాజమాన్యం అంగీకరించలేదు. అప్పటి నుంచి ఆమె ఆలయం మీద కక్ష పెంచు కుంది. అబద్ధాల మధ్య ఇంకొ అబద్ధం కూడా చెప్పిందీమె. ఒక హిందూ దేవాలయ యాజమాన్యం జైనుల అధీనంలో ఉండడం ఆమెకు బాధగా ఉందట. అంతిమంగా అనన్య గురించి తాను చెప్పిన దంతా అబద్ధమేనని ఒప్పుకుంది. తన కుమార్తెగా చెప్పిన అనన్య తప్పిపోయిందంటూ ఈ జూలై 15న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే లేని అనన్య తప్పిపోయినది 2003లో. ఫిర్యాదును అప్పుడు తీసుకోలేదు కాబట్టి ఇప్పుడు ఇచ్చింది. ఈ అబద్ధం ఆడితే గుడి నుంచి తన ఆస్తి తనకు అప్పగించేటట్టు చేస్తామని సామాజిక కార్యకర్తలు ఆశ పెడితేనే తాను అబద్ధం ఆడానని సుజాతా భట్ బయటపెట్టింది. గిరీశ్ మట్టన్నావర్, టి.జయంతి అనే వారు చెప్పమన్నట్టే సుజాతా భట్ చెప్పింది. ఇదంతా నేను డబ్బు కోసమైతే చేయలేదు. కాబట్టి యావత్ దేశం నన్ను క్షమించాలని కూడా కోరింది.

**నాలుగు దశాబ్దాల కుట్ర**

ధర్మస్థల మీద, ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగ్గడ మీద బురద జల్లే కార్యక్రమం ఈనాటిది కాదు. చెన్నయ్య ద్వారా ఈ భారీ కుట్రకు అనుకోకుండా ముగింపు తప్పలేదు. కానీ దీని వెనుక హిందూ హక్కుల నాయకునిగా చెలామణి అవుతున్న మహేశ్‌శెట్టి తిమరోడితో పాటు అర్బన్ నక్సల్స్ కూడా ఉన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ కుట్ర సాగుతోంది. ఈ కుట్ర వెనుక లక్ష్యం ఎవరంటే– రాష్ట్రంలోనే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు. ధర్మస్థల ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వీరేంద్ర హెగ్గడ. ఆయన బీజేపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేవస్థానంలో ప్రధాన పాలనాధికారి లేదా ధర్మాధికారి హోదాలో ఉన్నారు. ధర్మస్థల కేవలం ఆధ్యాత్మిక కేంద్రం కాదు. ప్రజానీకానికి విద్య, వైద్యం ఇతర సహాయాలు అందిస్తున్న సామాజిక సేవాకేంద్రం కూడా.

శ్రీక్షేత్ర ధర్మస్థల ఆధ్వర్యంలో 30 విద్యా సంస్థలు ఉన్నాయి. ఇందులో పది ఉన్నత పాఠశాలలు. రెండు ప్రీయూనివర్సిటీ సంస్థలు. ఒక న్యాయశాస్త్ర కళాశాల. ఆరు వైద్య విద్యాసంస్థలు. మూడు మేనేజ్‌మెంట్ కళాశాలలు. ఐదు సాంకేతిక విద్యా కళాశాలలు ఉన్నాయి. ఇవన్నీ శ్రీధర్మస్థల మంజునాథేశ్వర పేరుతోనే ఉంటాయి. ఆయుర్వేదం, ఫిజియోథెరపీ, యోగ, డెంటల్ కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ నిత్యం

# సూత్రధారి సెంథిల్?

ఇంత పెద్ద కుట్రతో, ఇన్ని పాత్రలతో నడిపించిన ధర్మస్థల వివాదం వెనుక కీలక పాత్రధారి ఎవరు? అన్న ప్రశ్నకు ఇప్పుడు అందరి చూపు అతడివైపు తిరుగుతున్నాయి. తమిళనాడులోని తిరువళ్లువర్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న శశికాంత్ సెంథిల్ ప్రమేయం ధర్మస్థల రగడ నిండా ఉందని బీజేపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి ఆరోపించారు. సెంథిల్ ఐఏఎస్ అధికారి. దక్షిణ కన్నడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశాడు. వేలాది మృతదేహాల సామూహిక ఖననం హారర్ కథనం ఇతడి సృష్టేనని జనార్దనరెడ్డి ఆరోపించారు. ఈ కుట్ర కేవలం ఇక్కడి వారిదే అనుకోరాదని, దీని వెనుక చాలా విస్తృత పరిధి ఉందని, దుర్మార్గపు రాజకీయాలు ఉన్నాయని అన్నారు. నిజానికి ముసుగు మనిషి లేదా చెన్నయ్య తమిళనాడు వ్యక్తేనని, ఎన్నో ఏళ్లు అక్కడే ఉన్నాడని, చెన్నయ్యకి సెంథిల్‌కి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని కూడా రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానంతో సాన్నిహిత్యం ఉన్న సెంథిల్ ఒత్తిడితోనే ఆదరాబాదరాగా సిట్‌ను కర్ణాటక ప్రభుత్వం నియమించదని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలే సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని ఈ దుస్థితికి తీసుకువచ్చాయని వ్యాఖ్యానించారు. బళ్లారి కేంద్రంగా పనిచేసే ఒక యూట్యూబర్, వామపక్ష సంబంధాలు ఉన్న మరొక ముగ్గురు ఈ కథంతా నడిపించారని, దీనికి దర్శకుడు కూడా సెంథిల్ అని అన్నారు.

సెంథిల్ మీద ఇలాంటి ఆరోపణలు ఎవరు చేసినా అవి కొట్టి పారేయవలసినవి కాలేవు. 2023లో ఇతడు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ వ్యూహకర్తగా పనిచేశాడు. 2024 ఎన్నికలలో తమిళనాడు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. అంటే డీఎంకే సహాయంతో. కాబట్టి ఇందులో డీఎంకే పాత్రను కూడా తేలిగ్గా తీసేయడానికి లేదు. 2024 లోక్‌సభ ఎన్నికలకు కాస్త ముందు ఇతడు తమిళనాడులో కాంగ్రెస్ దళిత ప్రముఖుడిగా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కావచ్చునన్న ఊహాగానాలు కూడా వచ్చాయి. ఇతడి ప్రస్తావనకి కొసమెరుపు వంటి ఒక పరిణామం ఉంది. ఇతడు 2019లో ఐఏఎస్ హోదాకు రాజీనామా ఇచ్చాడు. కారణం– కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసినందుకు నిరసన. తరువాత తిరవళ్లువర్ లోక్‌సభ నియోజక వర్గం నుంచి 5,72,165 ఓట్ల ఆధిక్యతతో గెలిచాడు. అప్పుడు తమిళనాడులో ఏ ఇతర ఎంపీకి ఇన్ని ఓట్లు రాలేదు. ఇవి చాలు, ఇతడి నేపథ్యం ఏదో తెలియడానికి! నిజానికి ఇతడు డీప్‌స్టేట్ అడుగుజాడలలో నడిచే మనిషి. దక్షిణ కన్నడ డిప్యూటీ కమిషనర్‌గా రాజీనామా చేసినప్పుడే, దేశంలో ప్రజాస్వామిక మూలాలు కనీవినీ ఎరుగని తీరులో రాజీపడుతున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు రాజీనామా లేఖలోనే ఇతడు పేర్కొన్నాడు. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ అని కూడా విమర్శించాడు. దీనితోనే అనంతకుమార్ హెగ్డే (బీజేపీ ఎంపీ) ఈ మనిషికి ఈ దేశంలో ఏం పని? పాకిస్తాన్ వెళ్లిపోతే మంచిది అని తీవ్ర విమర్శలు గుప్పించారు. తరువాతే సెంథిల్ కాంగ్రెస్‌లో చేరి అనతికాలంలోనే వార్ రూమ్ ఇన్‌చార్జ్ అయ్యాడు. ఇతడు లోక్‌సభకు పోటీ చేసినప్పుడు ప్రచారమంతా మెజారిటేరియనిజం, ప్రజాస్వామ్య పరిరక్షణ వంటి మాటలే అన్నాడు. బీజేపీ దేశాన్ని చీలుస్తుందని చెప్పాడు. ఒక్కసారి కులగణన చేస్తే హిందూరాష్ట్ర భావన మిథ్యగా మిగులుతుందని ఏప్రిల్ 16, 2024న డెక్కన్ హెరాల్డ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. ఐఏఎస్ హోదాకు రాజీనామా ఇచ్చిన తరువాత ఎన్ఆర్‌సీ, సీఏఏలకు వ్యతిరేకంగా జరిగిన అనేక కార్యక్రమాలలో సెంథిల్ పాల్గొన్నాడు. కాంగ్రెస్ తనకు తగిన వేదిక అని కూడా ప్రకటించాడు. ఒక విధంగా చూస్తే తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై తమిళనాడుకు చెందిన కర్ణాటక కేడర్ ఐపీఎస్. సెంథిల్ తమిళనాడుకు చెందిన కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి. అన్నామలై రాజీనామా చేసి బీజేపీలో చేరిన కొద్ది కాలానికే సెంథిల్ రాజకీయాలలోకి వచ్చాడు. ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మస్థలిని అపఖ్యాతి పాల్జేయడానికే ఇలాంటి ఆరోపణలు తెచ్చారనడం సరికాదని తమిళనాడులోని తిరువళ్లువర్ లోక్‌సభ నియోజక వర్గ కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ ప్రకటించడం విశేషం. సెంథిల్ కర్ణాటక కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి. అలాంటి వాదనలన్నీ నిరాధారాలని కూడా అన్నాడు. కానీ గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్న తీరులోనే ఇతడి ప్రకటన ఉంది. ఇలాంటి ఆరోపణను ఇంకా ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవలసి ఉంటుందని బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిని ఆయన హెచ్చరించాడు.


జనార్దనరెడ్డి


సెంథిల్



సుజాతాభట్, అసలు జన్మించని ఆమె కూతురు అనన్య ఫోటో (?)

15,000 మంది భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదం అందుతుంది. రెండు పూటలా ఉచిత ప్రసాదం స్వీకరించవచ్చు.

ఇదంతా అక్కడి క్రైస్తవ సంస్థలకు, కమ్యూనిస్టులకు, నక్సల్ అభిమానులకు కన్నెర్ర అయింది. ఆనాటి ప్రయత్నంలోను ఈ ముఠా ఓడిపోయింది. ధర్మస్థలలో అబలలు మరణిస్తున్నారంటూ గతంలో బాగా అల్లరి చేస్తూ, అందుకు వీరేంద్ర హెగ్గడను బాధ్యులను చేయడానికి చూశారు. వారిమీద నోటికి వచ్చినట్టు పేలవద్దని సుప్రీంకోర్టు 2022లోనే సోమనాథ్ నాయక్ అనేవాడికి గడ్డి పెట్టింది. ఇతడు నాగరిక సేవా ట్రస్ట్ పేరుతో ధర్మస్థల దేవస్థానానికి పోటీ సేవ ప్రారంభించాడు. అంతకు ముందు బెల్తంగడి న్యాయస్థానం నాయక్, మరో ఐదుగురిని కూడా ఇదే విధంగా హెచ్చరించింది. అయితే న్యాయస్థానాలను వాడుకోవడమే కానీ, గౌరవించే సంస్కృతి తెలియని ఈ అర్బన్ నక్సల్స్ సామాజిక మాధ్యమాలలో వీరేంద్ర హెగ్గడ మీద అవాకులూ చెవాకులూ ఆపలేదు. దీనితో బెల్తంగడి న్యాయస్థానం నాయక్‌కు మూడు నెలలు జైలు శిక్ష, రూ.4.5 లక్షల జరిమానా కూడా విధించింది. దీనిని సుప్రీంకోర్టు సమర్థించింది. సౌజన్య అనే యువతి హత్య (అక్టోబర్ 9, 2012)లో ధర్మస్థల నిర్వాహకుల కుటుంబం ప్రమేయం ఉందని మహేశ్ శెట్టి తిమరోడి ఆరోపించడం కూడా ఇలాంటిదే. సౌజన్య ఉదంతం మీద మహమ్మద్ సమీర్ విడుదల చేసిన వీడియో కూడా నాడు వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో గిరీశ్ మట్టన్నవార్ అనే మరొక సామాజిక కార్యకర్త సమీర్‌కు వత్తాసు పలికాడు. అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులు కూడా వెనక్కి వెళ్లిపోయారు. గిరీశ్ మట్టన్నవార్ గతంలో పోలీసుశాఖలో పని చేసి సస్పెండయ్యాడు.

**దిశ మారిన దర్యాప్తు**

ధర్మస్థల ప్రతిష్టను మంట గలిపేందుకే ఇలాంటి భారీ కుట్ర చేశారని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్వయంగా శాసనసభలో వెల్లడించడం విశేషం. ఇదంతా ఒక కుట్రగానే కనిపిస్తున్నది. అందుకే సిట్ కూడా తన దర్యాప్తు దిశను మార్చు కుంది. కుట్ర సిద్ధాంతం ఆధారంగా దర్యాప్తును కొనసాగించే ప్రయత్నాలలో ఉంది. ధర్మస్థల దేవ స్థానానికి వ్యతిరేకంగా వ్యవహరించిన ఐదుగురుని దృష్టిలో ఉంచుకుంటే కుట్ర సిద్ధాంతమే నిజమని అనిపిస్తుంది. ఇందులో మొదటివాడు ముసుగు మనిషి లేదా చెన్నయ్య. మరొకడు మహేశ్ శెట్టి తిమరోడి, ఇంకొకడు యూట్యూబర్ మహ్మద్ సమీర్, సామాజిక కార్యకర్త గిరీశ్ మట్టన్నావర్ కనిపిస్తారు. చివరిగా వచ్చేది సుజాతా భట్. ఒక బృందం ఆడమన్నట్టే తాను అంతా ఆడానని అరెస్టయిన ఆగస్ట్ 23న పోలీసుల ఎదుట చెన్నయ్య అంగీకరించాడు. సుజాతా భట్ చెప్పింది కూడా ఇదే. యూట్యూబర్ చెప్పమన్నట్టే చెప్పానని అన్నారు. అంటే సమీర్ ఆడమన్నట్టు ఆడారు. చెన్నయ్య ఒక సంవత్సన్నర కాలంగా ధర్మస్థలకు సమీపంగా ఉండే ఉజిరే పట్టణానికి తరుచు వచ్చి వెళ్లినట్టు తెలిసింది. ఉజిరే పట్టణ పారిశుద్ధ్య సిబ్బందిలో ఒకడైన తానోసిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడు ముసుగు మనిషికి తమ్ముడే. ఇక మహేశ్ శెట్టిని 20వ తేదీన బ్రహ్మవర పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఇతడికి ఉడిపి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సామాజిక కార్యకర్తగా మారిన మాజీ పోలీసు ఉద్యోగి గిరీశ్ మట్టన్నావర్‌ను కూడా పోలీసులు ప్రశ్నించారు. ఇంతకీ ఇంత పెద్ద కుట్ర పన్నిన యూట్యూబర్ సమీర్ గురించి గాలిస్తున్నారు. ఇతడికి మంగళూరు కోర్టు బెయిల్ ఇచ్చింది. ఆపై ఆచూకీ లేదు.

సామూహిక ఖననం అంటూ వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమని తేలిందని, కేవలం హిందూ పవిత్ర క్షేత్రాన్ని అపఖ్యాతి పాలు చేయడానికి ఇంత కుట్ర పన్నారని వీరేంద్ర హెగ్గడ వ్యాఖ్యానించారు. ఇంతవరకు 17 చోట్ల తవ్వారని ఏమీ దొరకలేదని ఆయన తెలియచేశారు. హిందువులు మరింత జాగరూకతతో ఉండాలని, మన ధర్మాన్ని మనం మరింత జాగ్రత్తగా రక్షించుకోవడం అవసరమని ఆయన అన్నారు. ఒక పథకం ప్రకారం జరుగుతున్న ఇలాంటి దుష్ప్రచారం మీద ప్రభుత్వం లోతైన దర్యాప్తు చేయించాలని మాజీ ఎమ్మెల్యే అశోక్ కటావే ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ధర్మస్థల అంటే మన సంస్కృతికి, ఆధ్యాత్మిక చింతనకు కేంద్రమని ఆయన అన్నారు. హిందూత్వను అపఖ్యాతి పాలు చేయడానికే కాంగ్రెస్ ఇదంతా సాగించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆరోపించారు. ఇవాళ ధర్మస్థల దగ్గర చేశారు. రేపు మరొక హిందూ దేవాలయం వద్ద కూడా ఇదే తంతు నడిపిస్తారని ఆయన విమర్శించారు. దీనికి కమ్యూనిస్టుల సాయం కూడా ఉందని అన్నారాయన. ఈ వివాదాన్ని తెర మీదకు తెచ్చిన చెన్నయ్య (ముసుగు మనిషి), మరొక నాటకం ఆడిన సుజాతా భట్ ఇద్దరూ డబ్బులకు ఆశపడి, ఎవరివో ఆదేశాలతో ఇదంతా చేశారని బీజేపీ ఎమ్మెల్యే భరత్ శెట్టి ఆరోపించారు. చెన్నయ్యకు నార్కో అనాలిస్ చేయించాలని పోలీసులు భావిస్తుండగా, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించడం కూడా కొన్ని అనుమానాలకు దారి తీసేదని ఆయన అన్నారు. కాగా, ఈ పరిణామం నుంచి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తున్నదని రాష్ట్ర కాంగ్రెస్ ఎదురు ఆరోపణ చేసింది.

కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో హిందూధర్మం దయనీయ పరిస్థితులలో ఉంది. కర్ణాటకలో కాంగ్రెస్ ఉంది. తమిళనాడులో డీఎంకే ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ప్రాంతీయ పార్టీలు కూడా హిందూ ధర్మం మీద దాడి పట్ల ప్రేక్షక పాత్ర మాత్రమే వహించాయి. ఇప్పటికైనా హిందువులు మేల్కొనడం అవసరం. ధర్మస్థలలో జరిగినది కేవలం ఒక గొప్ప హిందూ పుణ్యక్షేత్రాన్ని భ్రష్టు పట్టించే ప్రయత్నమే. ఒక యూట్యూబర్. ఒక పారిశుద్ధ్య కార్మికుడు, ఒక మహిళ కలసి ప్రదర్శించిన ఈ తమాషా అత్యంత హేయం. హిందువులు ఇకనైనా కళ్లు తెరుస్తారా? ఉదారవాదం పేరుతో, సెక్యులరిజం పేరుతో మన ధర్మానికి జరుగుతున్న ఘోర అవమానాలను నిలువరించాలన్న ఆలోచనకు రాగలరా? కాంగ్రెస్, కమ్యూనిస్టులు, వైఎస్ఆర్‌సీపీ, బీఆర్ఎస్, డీఎంకే వంటి పార్టీలు భారతీయతకు ఎంత అన్యాయం చేస్తున్నాయో గమనించాలి. ధర్మస్థల పరిణామాలు హిందువులకు కనువిప్పు కలిగించాలి. హిందువులను దొంగలని, హిందూధర్మం కరోనా, డెంగ్యూ వంటిదని విమర్శిస్తున్నా హిందువులు మేల్కొనకపోవడం నిజంగా విడ్డూరం. యూట్యూబర్ల పేరుతో, సెక్యులరిస్టులు, స్టాండప్ కమేడియన్‌ల పేరుతో నిరంతరం మన ధర్మాన్ని అవహేళన చేస్తున్నా మనకు చీమ కుట్టినట్టయినా లేదెందుకు?

– జాగృతి డెస్క్



వామన-బలి ఘట్టంలో పౌరాణిక అంశాలతో పాటు వ్యక్తిత్వ వికాస పాఠమూ ఇమిడి ఉంది. త్రిలోకాధిపత్యం కోసం ఇంద్రుడిని ఓడించి అడవుల పాలుచేసిన బలిని దండించేందుకు దేవదేవుడు వామన రూపంలోనే రానవసరం లేదు. ధర్మం నశించి, అధర్మం పెచ్చరిల్లినప్పుడు దుష్టశిక్షణ,శిష్ట రక్షణ కోసం తననే తాను సృజించుకుంటానన్నాడు భగవానుడు. బలి విషయంలో 'దుష్టశిక్షణ' అనేది నప్పదు. ఆతని అహంకారాన్ని అణచి అనుగ్రహించడం, బలితో పాటు భవిష్యత్ మానవాళికి తత్వాన్ని బోధించడమే ఈ అవతార పరమార్థంగా భావించాలి. దీనిని కేవలం కథలా చూస్తే ... 'ఉన్నదానితోనే సంతృప్తిచెందాలి.. అవసరం మేరకే అర్థించి స్వీకరించాలి తప్ప వారి వద్ద ఉన్నది దోచుకోవాలన్న దుర్బుద్ధి కూడదు... ధర్మానికి కట్టుబడి ఇచ్చిన మాటను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలి' లాంటి అమూల్య సందేశాన్ని ఆస్వాదించగలం.

# వామనఘట్టంలో మహోన్నత సందేశం

బలి చక్రవర్తి విశ్వజిత్ యాగం ద్వారా ఇంద్రుడిని జయించి త్రిలోకాధిపత్యం కైవసం చేసుకొని అధికారదర్పం ప్రదర్శిస్తున్న వేళ దేవగణం కలవర పడింది. మాతృశ్రీ అదితికి మొరపెట్టుకుంది. వారిని ఆదుకునేందుకు, శ్రీమన్నారాయణుడిని ప్రసన్నం చేసుకొనేందుకు భర్త కశ్యపుడి సూచనపై పయోవ్రతం ఆచరించింది. ఫలితంగా, శ్రీహరి భాద్రపద శుద్ధ ద్వాదశి శ్రవణ నక్షత్రంలో అభిజిన్ముహూర్తంలో కశ్యప అదితి దంపతులకు వరపుత్రుడిగా ఉదయించాడు. ఆ రోజును వామన ద్వాదశి, బలి ద్వాదశి, దివ్య ద్వాదశి, విజయ ద్వాదశి, మహాద్వాదశి అని వ్యవహరిస్తారు.

బలి అశ్వమేధ యాగం చేస్తున్న నర్మద నదీ తీరంలోని 'భృగుకచ్ఛం' చేరాడు వామనమూర్తి. బలిని సమీపిస్తూనే, 'స్వస్తి జగత్రయీ భువన శాసనకర్తకు...' అని ఆశీర్వదించాడు. దానవేంద్రుడు అమితా నందంతో వటువును సాదరంగా ఆహ్వానించాడు. అర్ఘ్యపాద్యాదులు సమర్పించాడు. పాదజలాన్ని శిరస్సున చల్లుకున్నాడు.

బలి పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడి మనవడు. ఉత్తముడు, సత్యసంధుడు, అమిత శౌర్యపరాక్రమశాలి. ఆయన పాలన సుభిక్షమైనదని, సకాలంలో వానలు కురిసి ధనధాన్యాదులు సమృద్ధిగా ఉండేవని, అన్ని వర్గాల వారు సుఖశాంతులతో జీవించేవారని భాగవతం చెబుతోంది. కానీ అతను అహంకారాన్ని మాత్రం వీడలేకపోయాడు. తన జపతపాలకు మూడడుగుల భూమి చాలునన్న వామనుడి కోరికకు విస్తుపోయి, 'మడులు, మణులు, మాణిక్యాలు, రాజ్యం..ఇలా ఏదైనా, ఎంతైనా ఇవ్వగల నా దగ్గర ఇంత అ(స్వ)ల్ప కోరికా? గ్రహీత... దాత స్థాయినైనా పరిగణించాలి కదా?' అనడంలో దర్పం ధ్వనించింది. 'దాత ఎంతో ఇవ్వగలిగినా గ్రహీత అవసరం మేరకే స్వీకరించాలి. మనిషికి తృప్తి ప్రధానం. దానికి మించిన సంపదలేదు. ప్రాప్తం కొద్దీ దక్కిన దానితో తృప్తిపడని వారు ఏడు ద్వీపాలలోని భూమిని ఇచ్చినా ('ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచున్‌ దృప్తిం జెందని మనుజుడు సప్త ద్వీపములనైనన్‌జక్కంబడునే'...) అదే పరిస్థితి. నా కోరిక నీ దృష్టిలో అల్పం.. మేరు పర్వతం లాంటి నీ ముందు పరమాణువు కావచ్చు నాకు అది అనల్పం, అనంత సంపద' అని బదులిచ్చాడు.

వామన-బలి సంభాషణను ఆలకిస్తున్న రాక్షస గురువు శుక్రాచార్యుడు ఆ వటువును హరిగా గ్రహించి, దాన ప్రక్రియకు అభ్యంతరం తెలిపాడు. బలి వెనుకాడలేదు. 'దాతగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం ('తిరుగన్ నేరదు నాదు జిహ్వ'), ఆత్మాభిమానం కలవారు ఎన్ని కష్టాలు వచ్చినా, ఆఖరికి ప్రాణం పోయినా ఆడినమాట తప్పకపోవడం ('బ్రతుకవచ్చుఁగాక బహు బంధనములైన/ వచ్చుగాక లేమి వచ్చుఁగాక/జీవధనములైనఁ జెడుగాక పడుగాక/మాటఁదిరుగలేరు మానధనులు') ఒక కారణమైతే సాక్షాత్తు శ్రీకాంతుడి చేయి కిందయి, నా చేయి మీదవడం గర్వకారణం కాదా?' అని ప్రశ్నిస్తాడు. ఎందరో రాజులు, చక్రవర్తులు పుట్టిగిట్టారు కానీ యశస్సును తప్ప భౌతిక సంపదలను వెంట తీసుకువెళ్లలేదు కదా? (కారే రాజులు రాజ్యముల్ కలుగవే గర్వోతిన్ పొందరే....' అని) అనీ వాదించి, వారించాడు. గురువు శపించినా విచారించలేదు. మూడు అడుగులు ధారపోసే క్రమంలో త్రివిక్రముడి పాద ఘట్టంతో సుతల లోకానికి చేరాడు.

ఈ సంవాదంలో మానవాళికి ఉపకరించే ఎన్నో అంశాలు బోధ పడతాయి. ముఖ్యంగా అశాశ్వతమైన జీవితంలో అనంత సంపద కోసం వెంపర్లాట తగదనే హితవు దాగి ఉంది. సంపద, అధికారం శాశ్వతమని అహంకరిస్తే పతనం తప్పదు. కోరికలు అనంతం. తీరినకొద్దీ పుడుతూనే ఉంటాయి.ఎన్ని సద్గుణాలు ఉన్నా అహం ఏ రూపంలోనూ తగదనేందుకు బలిమర్దనమే ఉదాహరణ. గర్వం, అహం నశించిన వారికి జ్ఞానం కలుగుతుందని ఈ ఉదంతం చెబుతోంది. దానధర్మాలు చేస్తూనే అనుచిత కార్యాలకు పాల్పడడం సరికాదన్నది. 'అడిగినవన్నీ ఇవ్వగలను అనుకోవడం అజ్ఞానమైనట్లే, అవస రమైనంత వరకే స్వీకరించడం జ్ఞానం..' అనేది వామనావతార ఘట్టం పరమార్థం.

మనుషులు ఎంత ధర్మవర్తనులైనా పదవీ, ఐశ్వర్యాల విషయంలో వారి పట్ల దేవదేవుడి ఆలోచన మరోలా ఉంటుంది. 'అనేకులు సంపద్గర్వంతో లోకాన్ని లక్ష్యపెట్టరు. ఆ గర్వం అంతరిస్తే మనసు స్థిరంగా ఉంటుంది. అందుకే నేను అనుగ్రహించ దలచిన వారి సంపదను ముందుగా హరించి వేస్తాను.అయినా స్థిరచిత్తులే ఉత్తములు. అలాంటి వారిలో బలి శ్రేష్ఠుడు. రానున్న సావర్ణి మన్వంత రంలో ఇంద్రపదవి అధిష్ఠించ గలడు. అంతవరకు విశ్వకర్మ నిర్మిత సుతల లోకం సకల శుభశాంతులతో నివాసంగా ఉంటుంది' అని త్రివిక్రమూర్తి అనుగ్ర హించాడు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్




# స్థానిక ఎన్నికలకు

**రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు ఏడాదిన్నర క్రితం పూర్తికావలసి ఉండగా కారణాంతరాల వల్ల వాయిదాలు పడుతూన్నాయి. వెనుకబడి తరగతుల వారికి 42 శాతం అమలు, పోటీ చేయాలనుకునే వారికి సంతాన పరిమితి లాంటి అంశాలు ఈ జాప్యానికి కారణంగా చెబుతున్నారు. రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అడ్డంకిగా ఉన్న'ఇద్దరు పిల్లలు' నిబంధనను తొలగించాల్సి ఉంది. అందుకు కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది.**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఊరిస్తున్నాయి. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు వాయిదాల మీద వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ఎన్నికల నిర్వహణలో జాప్యంపై జోక్యం చేసుకొన్న న్యాయస్థానం, వీలైనంత తొందరగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం మాత్రం సందిగ్ధంలో నుంచి బయటకు రావడం లేదు. ఈ ఎన్నికలపై తనదైన ముద్ర వేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం తాపత్రయ పడుతోంది. పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన నిబంధనలు సడలించడం, ప్రత్యేకంగా బీసీలకు రిజర్వేషన్ల అమలు అనే ప్రధాన అంశాలపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించింది. ఆ బిల్లు అక్కడ పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్న పట్టుదలతో ప్రభుత్వం న్యాయ నిపుణులతో వరుసగా చర్చలు సాగిస్తోంది. ఢిల్లీ స్థాయిలోనూ న్యాయ కోవిదులతో భేటీలు నిర్వహిస్తోంది. ప్రభుత్వం పరంగా సాధ్యం కాకపోతే పార్టీ పరంగా అయినా ఈ రిజర్వేషన్లను అమలు చేయాలన్న సమాలోచనలు చేస్తోంది. అవసరమైతే ఈ అంశంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కూడా సిద్ధమవుతోంది.

రిజర్వేషన్ల అంశం పక్కన బెడితే మరో కీలక మార్కును సొంతం చేసుకోవాలనుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటి వరకూ ఇద్దరు పిల్లలు ఉన్న వాళ్లు మాత్రమే పోటీకి అర్హులు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఈ చట్టం ఇప్పటికీ కొనసాగుతోంది. 1994వ సంవత్సరంలో నాటి ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో ఈ నిబంధనను చేర్చింది. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా మున్సిపాలిటీ చట్ట సవరణ చేసింది. ఎంతమంది పిల్లలున్నా మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులుగా నిబంధనలు మార్చేసింది. ఇప్పుడు మిగతా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూడా ఇవే డిమాండ్లు చుట్టుముట్టడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇద్దరు సంతానం నిబంధనను ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందంటున్నారు. పై కారణాల వల్లే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలలో ఆలస్యమవుతోందని సర్కారు పెద్దలు చెప్పుకుంటున్నారు. కానీ, ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి ఎక్కడా ఆదరణ ఉండదని, ఆ పార్టీ బలపరిచే అభ్యర్థులు ఓడిపోతారన్న స్పష్టమైన సంకేతాలు ఉన్నాయని, అందుకే ఎన్నికల నిర్వహణను ప్రభుత్వం వాయిదా వేస్తోందని విపక్షాలు విమర్శలు అంటున్నాయి.

అయితే, సంతాన పరిమితి నిబంధనను ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వాస్తవానికి గత సంవత్సరమే 'ఇద్దరు పిల్లల' నిబంధనను ప్రభుత్వం తొలగిస్తుందని అందరూ ఎదురు చూశారు. ఇప్పుడు మాత్రం ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మేరకు, పిల్లల సంఖ్యతో ప్రమేయం లేకుండా పోటీ చేయవచ్చుననే నిబంధన అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టిందంటున్నారు. ఈ నిబంధనను రద్దు చేసేందుకు పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3)ని తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశాన్ని ఎజెండాగా పెట్టుకొని నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నిబంధనను ఎత్తివేసే ఆలోచన ఉందని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వెల్లడించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారట. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు త్వరలో ఎన్నికలు జరగబోతున్నందున ఇద్దరు పిల్లల నిబంధనపై ఎత్తివేతపై ప్రభుత్వం





# ప్రభుత్వ వ్యూహాలు



తీసుకునే ఈ కీలక నిర్ణయం కోసం అభ్యర్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు మిగిలిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంతాన పరిమితి నిబంధన తొలగింపు తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిబంధనను సవరించడం ద్వారా పార్టీ సానుభూతి పరులు ఎక్కువ మందిని గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహ రచన చేస్తోంది. గ్రామ స్థాయి నుంచి పటిష్ట నాయకత్వం ఉండేందుకు ఈ అంశం దోహదపడుతుందని భావించిన ప్రభుత్వం 2018 సెక్షన్ 21(3)ని తొలగించే చట్టసవరణకు డిసైడ్ అయ్యింది.

అధిక జనాభాను నియంత్రించే ఉద్దేశ్యంతో కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిబంధన 1995 మే 30 నుంచి అమల్లోకి వచ్చింది. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ పేజీలో 3వ అంశంగా ఈ నిబంధనను చేర్చింది. ఈ నిబంధన స్థానిక ఎన్నికల్లో పోటీకి చాలా మందికి అడ్డంకిగా మారింది. అయితే, ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చాలని, ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నిబంధనను మార్చేందుకు గతంలో ఒకసారి మంత్రివర్గ సమావేశంలో చేసిన ప్రతిపాదన ఆమోదం పొందలేదు. అయితే, ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించి ఇప్పుడు ఉన్న రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసేందుకు అవకాశం ఇస్తూ చేసిన చట్ట సవరణ సమయంలోనూ ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపునకు సంబంధించి పంచాయితీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని తొలగింపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇందుకు అవసరమైన చట్టసవరణకు కూడా ప్రయత్నించలేదు. అయితే.. పంచాయితీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని తొలగించే ప్రతిపాదనను త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టాలని మంత్రులు సైతం కోరడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ఈ పరిమితిని ఎత్తివేయడానికి ప్రస్తుతం ఎటువంటి ఇబ్బందులు లేవని మంత్రులు అంతా మద్దతు ఇచ్చారు. త్వరలో జరిగే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టసవరణను ఆర్డినెన్స్ ద్వారా ప్రవేశపెట్టాలా, లేదా బిల్లు ద్వారా ప్రవేశపెట్టాలా అనే విషయాన్ని తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్ణయించే అవకాశం ఉంది.

ఇద్దరు పిల్లల నిబంధనకు సంబంధించి ఈ చట్టం అమల్లోకి తీసుకు వచ్చిన సమయంలో కొన్ని ముఖ్యమైన అంశాలను చేర్చారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తేదీకి ముందు ఎంత మంది పిల్లలు ఉన్నా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు అవుతారని ఆ చట్టంలో నిబంధనలు రూపొందించారు. అయితే, చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా అంటే 1995 మే 29వ తేదీలోగా మూడో బిడ్డ పుట్టినా అనర్హులు కాకుండా మినహాయింపును ఇచ్చారు. 1995 మే 30వ తేదీ తర్వాత పుట్టిన పిల్లలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ 1994లో ఆ చట్టం చేశారు.

ఇక దీనిలో భాగంగా దత్తతకు సంబంధిం చిన పిల్లలు కూడా అసలు తల్లిదండ్రుల లెక్కలోనే ఉంటారు. ఈ మేరకు 2006లో హైకోర్టు కూడా తీర్పు వెలువరించింది. అంటే ఒక అభ్యర్థికి ముగ్గురు పిల్లలు ఉండి ఒకరిని దత్తత ఇచ్చేసినా వారు ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలులేదని పేర్కొంది.

ఇక.. అభ్యర్థి మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు, రెండో భార్య ద్వారా మరో బిడ్డ ఉంటే వారినీ అనర్హులుగానే ఆ చట్టం పరిగణించింది. నామినేషన్ వేసే నాటికి ముగ్గురు పిల్లలు ఉండి, పరిశీలన జరిగే రోజుకి అందులో ఒకరు చనిపోయినా వారు అర్హులు అవుతారని పేర్కొంది. ఇది ఇలా వుంటే గత ఏడాది చట్ట సవరణ ఆమోదించడంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలు ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాయి. పంచాయతీ రాజ్ చట్టం నుంచి ఈ నిబంధనను తొలగిస్తూ ఏపీలో కూటమి ప్రభుత్వం గత ఫిబ్రవరిలో సవరణ తెచ్చి ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి అమలులోకి తెస్తూ ఈ సవరణపై న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. దీంతో ఇక తెలంగాణలో కూడా ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ మార్పును ఆర్డినెన్స్ ద్వారా ప్రవేశపెట్టాలా లేదా బిల్లు ద్వారా ప్రవేశపెట్టాలా వద్దా అనే విషయాన్ని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయిస్తుంది. తెలంగాణ హైకోర్టు ఇంతకుముందు ఇద్దరు పిల్లల నిబంధనను సమర్థించింది, దీనిని తొలగించడం ప్రభుత్వమే నిర్ణయించాలని పేర్కొంది. పట్టణ మున్సిపల్ ఎన్నికల కోసం ఇప్పటికే ఈ నిబంధనను రద్దు చేసినందున, గ్రామీణ అభ్యర్థులపై ఈ నిబంధన వివక్ష చూపుతుందని పిటిషనర్లు వాదించారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రణాళిక నేపథ్యంలో ఈ మార్పు అత్యవసరమని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈ నిబంధనను తొలగించడం వల్ల రాజకీయ పార్టీలకు బీసీల నుండి మాత్రమే కాకుండా ఇతర వర్గాల నుండి కూడా అభ్యర్థులను ఎంపిక చేయడంలో ఎక్కువ వెసులుబాటు లభిస్తుందన్న చర్చ జరుగుతోంది.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



**రాష్ట్రంలో మామిడి, నిమ్మ, బ్లాక్ బర్లీ పొగాకు, ఆక్వా రైతులు ఈ ఏడాది నష్టాలపాలయ్యారు. ప్రత్యామ్నాయ మార్కెట్లు, నూతన పద్ధతులను అందిపుచ్చుకోలేకపోవడం, ప్రభుత్వ అలసత్వం ఈ సంక్షోభానికి కారణంగా కనిపిస్తోంది. మామిడి అధిక దిగుబడి సాధించినా, యుద్ధాల కారణంగా ఎగుమతులు నిలిచి, ఫ్యాక్టరీల సిండికేట్‌తో ధరలు పడిపోయాయి. టన్ను 5-6 వేల రూపాయలే పలకడం వల్ల లక్షల మంది రైతులు నష్టపోయారు. నిమ్మ కిలోకు రూ.70 నుంచి రూ.6కు ధర పడిపోవడంతో రైతులు పంటను పార బోస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో అధిక ఉత్పత్తి, నిల్వ సౌకర్యాల లోపం కారణంగా వారు నిరాశలో మునిగారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు 160 మిలియన్ కిలోల అధిక ఉత్పత్తితో కంపెనీలు కొనుగోలు నిరాకరించాయి.తేమ శాతం, అంతర్జాతీయ ధరల పతనం వల్ల తీవ్ర నష్టాలు మూటగట్టుకున్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా కంపెనీలు మాత్రం పూర్తిగా సహకరించడం లేదు. ఆక్వా రైతులు అమెరికా టారిఫ్‌లతో 40 శాతం ఎగుమతులు తగ్గి, వైరస్‌లు, ఫీడ్ ధరల పెరుగుదలతో నష్టపోతున్నారు. మొత్తంగా ఒకటి రెండు మార్కెట్‌లపై ఆధారపడటం, సరఫరా మిగులు ఈ సమస్యలకు మూల కారణాలుగా నిలుస్తున్నాయి.**

# ప్రత్యామ్నాయాల లేమి..

రాష్ట్రంలోని మామిడి రైతులు ఈ ఏడాది నష్టాలపాలయ్యారు. అధిక దిగుబడి వారికి ఆనందాన్ని కాకుండా కన్నీళ్లను మిగిల్చింది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ యుద్ధాల కారణంగా విదేశీ ఎగుమతులు నిలిచిపోవడాన్ని సాకుగా చూపి స్థానిక పల్ప్ ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయడానికి ప్రయత్నించాయి. గిట్టుబాటు ధర లభించకపోవడంతో, చాలా మంది రైతులు పంటను అమ్ముకోలేక నష్టపోయారు. రాష్ట్రంలో మామిడి సాగువిస్తీర్ణం 4.03 లక్షల హెక్టార్లు కాగా, ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నులు దిగబడి వస్తుంది. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, నెల్లూరు, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం, అనంతపురం, కర్నూలు వంటి జిల్లాలలో మామిడి సాగు జరుగుతుంది. లక్షలమంది రైతులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. చిత్తూరు జిల్లా మామిడి గుజ్జు పరిశ్రమకు ప్రసిద్ధి. ఇక్కడ దాదాపు 35కి పైగా గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు చిత్తూరు, మదనపల్లి, తిరుపతి ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. మన దేశంతో పాటు ఇతర దేశాలకు ఇక్కడి నుంచే ప్రాసెస్ చేసిన మామిడి గుజ్జు ఎగుమతి అవుతుంది.

ఈ ఏడాది సుమారు 60 లక్షల టన్నుల వరకు మామిడి ఉత్పత్తి పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఆ దిగుబడిని అమ్ముకుని అప్పులు తీర్చుకుందామనే ఆనందం ఫ్యాక్టరీలు సరకు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో ఆవిరైపోయింది. దాంతో ధరల పతనం ప్రారంభమైంది. గతంలో టన్ను 15 వేల నుంచి 20 వేల వరకు అమ్మింది ఇప్పుడు టన్ను రూ.5-6 వేలకు మించి కొనబోమని ఫ్యాక్టరీల యజమానులు చెప్పారు. 2023-2024 సంవత్సరాల్లో తయారుచేసిన పల్ప్ చిత్తూరు జిల్లాలోని ఫ్యాక్టరీల్లో సుమారు 40వేల టన్నులు అలాగే ఉండిపోయింది. 2023 నుంచి ఉత్పత్తిచేసిన మామిడి గుజ్జు నిల్వలు అలాగే ఉన్నాయని, ఇవి ఎగుమతి జరిగి ఉంటే రైతులకు మరింత మేలు జరిగి ఉండేదని నివేదికలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుజ్జు ఎగుమతులు ప్రారంభమైనా, గతే డాది పేరుకుపోయిన నిల్వల్లో కేవలం 15 శాతం మాత్రమే ఎగుమతి అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా మామిడి గుజ్జుకు డిమాండ్ తగ్గుతున్న సమయంలో, ఆంధ్రప్రదేశ్‌లో దిగుబడి పెరగడం సరఫరా మిగులుకు దారితీసింది. ఈ ఏడాది జూన్ ప్రారంభంలో, చిత్తూరు జిల్లాలో మామిడి ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ.7 వరకు పడిపోయాయి. రైతుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, కిలో మామిడికి రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఇందులో రూ.8 గుజ్జు పరిశ్రమలు చెల్లించగా, మిగిలిన రూ.4 ప్రభుత్వం భరించింది.

**నిమ్మ రైతుల నిరాశ**

ఆరుగాలం శ్రమించి.. ఆటుపోట్లను అధిగమించి నిమ్మ సాగు చేసిన రైతులు పంట చేతికొచ్చే సమయానికి ధర లేదని వాపోతున్నారు. రెండు నెలలు క్రితం కిలో రూ.70 పలికిన నిమ్మ ధర ప్రస్తుతం రూ.6కు పడిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఏపీలోని మెట్ట ప్రాంతాల్లో సుమారు 2 లక్షల హెక్టార్లలో నిమ్మ సాగు చేస్తున్నారు. ఈ పంట నాటిన తర్వాత మూడు, నాలుగేళ్లకు కాపు కొస్తుంది. ఏడాదిలో దసరా, చిత్తకాపు, సీజన్ ఇలా మూడు దశల్లో కాయలు కోస్తుంటారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 7-8 టన్నుల దిగుబడి వస్తుంది. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి పెరగడంతో ఇక్కడ కాయలకు డిమాండ్, ధర తగ్గింది. ప్రస్తుతం కిలో ధర రూ.6కు పడిపోయిందని, ఏ- గ్రేడ్ అయితే రూ. 8, 9 పలుకుతుందని రైతులు వాపోతున్నారు.





# ...సంక్షోభంలో రైతులోకం

పండు కాయలు గంప(25 కిలోలు) రూ.150 ధర పలుకుతుందన్నారు. అదే బయట కూరగాయల మార్కెట్, సంత బజార్లలో మూడుకాయలు రూ.10లకు విక్రయిస్తున్నారు. ఈసారి వాతావరణం అనుకూలించి నిమ్మ పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. అయితే, పెరిగిన దిగుబడే వారికి శాపంగా మారింది. మార్కెట్‌లో సరఫరా ఒక్కసారిగా పెరిగిపోవడంతో ధరలు దారుణంగా పడిపోయాయి. కనీసం కోత ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో దిక్కుతోచని రైతులు పంటను రోడ్ల పక్కన, చెత్తకుప్పల్లో పారబోశారు. నిమ్మనుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమలు గానీ, నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగుల సౌకర్యం గానీ అందుబాటులో లేకపోవడం ఈ నష్టానికి ప్రధాన కారణం.

**బ్లాక్ బర్లీ పొగాకు కష్టాలు**

వాణిజ్య పంట, బ్లాక్‌బర్లీ పొగాకు రైతులు సైతం ఇదే తరహా సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఈ పొగాకును ప్రధానంగా సిగార్ల తయారీలో ఉపయోగి స్తారు. సాధారణంగా, ఈ రకం పొగాకుకు మంచి డిమాండ్, ధర ఉండటంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపారు. అయితే, ఇటీవలి కాలంలో ఈ పంట సాగు, దిగుబడి, అమ్మకాల విషయంలో రైతులు తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును రాష్ట్రంలో ప్రధానంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని నల్లరేగడి నేలల్లో అధికంగా సాగు చేశారు. గతంలో మంచి ధర పలకడంతో, ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఈ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడి కూడా ఊహించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. అయితే, ఈ అధిక దిగుబడే రైతులకు శాపంగా మారింది. ఒప్పందం చేసుకున్న దానికంటే అధికంగా పంట పండించడం ప్రధాన కారణంగా కంపెనీలు పేర్కొన్నాయి. డిమాండ్‌కు మించి సరఫరా పెరగడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. 105 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా 160 మిలియన్ కిలోల ఉత్పత్తి అయింది. ఉత్తరాదిలో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. దాంతో కొనుగోలుదారులు ధరను తగ్గించేశారు. పంటలో తేమ శాతం ఎక్కువగా ఉందనే కారణంతో కూడా కొన్ని కంపెనీలు కొనుగోలు చేయడానికి నిరాకరించాయి. ఇది ధరల పతనానికి కారణంగా మారింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గడం కూడా దేశీయ కొనుగోళ్లపై ప్రభావం చూపింది. గతంలో ఐటీసీ, జీపీఐ, డెక్కన్ అలయన్స్ వంటి కంపెనీలు రైతులను ప్రోత్సహించినప్పటికీ, అధిక ఉత్పత్తి కారణంగా కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్న తరుణంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుండి నేరుగా బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. ఇందుకోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. పొగాకు కొనుగోలు చేసిన రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బు జమ చేసింది. సుమారు రూ. 273 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా, రాబోయే సంవత్సరానికి బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై 'క్రాప్ హాలిడే' ప్రకటించింది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించింది. ప్రభుత్వం పొగాకు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి, రైతుల నుండి వీలైనంత ఎక్కువ పంటను కొనుగోలు చేసేలా ఒత్తిడి తెచ్చింది. ఈ విధంగా, ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో బ్లాక్ బర్లీ రైతులు కొంతమేర నష్టాల నుండి గట్టెక్కగలిగారు. అయితే, ఈ సంఘటన వ్యవసాయంలో సరైన ప్రణాళిక డిమాండ్-సరఫరా అంచనాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది.

**ఆక్వా రంగంపై అమెరికా దెబ్బ**

రాష్ట్రంలోని ఆక్వా రంగానికి అమెరికా అతిపెద్ద మార్కెట్. అయితే, ఆ దేశం ట్రంప్ రొయ్యలు, చేపల ఉత్పత్తులపై 25 శాతం అధికంగా పన్నులు (టారిఫ్‌లు) విధించడంతో పరిస్థితి తలకిందులైంది. ఈ నిర్ణయంతో భారత ఉత్పత్తుల ధరలు అమెరికా మార్కెట్‌లో పెరిగిపోయి, మన ఎగుమతులు ఏకంగా 40 శాతం పడిపోయాయి.

రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేయని పక్షంలో పెనాల్టీ సుంకాలు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్ ఆక్వా ఉత్పత్తులపై 25 శాతం అదనపు పన్ను విధించడం, పక్కనే ఉన్న సాల్వెడార్‌కు ప్రోత్సాహకంగా పన్నులు భారీగా తగ్గించడంతో భారత ఆక్వా ఉత్పత్తుల దిగుమతులను అమెరికా తగ్గించింది. సాల్వెడార్ నుంచి ఎక్కువగా దిగుమతులు చేసుకుంటోంది. దానికి తోడు ఇటీవల వాతావరణంలో భారీ తేడాల వల్ల చెరువుల్లోని ఉష్ణోగ్రతల్లో తేడా వచ్చి రొయ్యలకు వైరస్‌లు సోకాయి. ఈ పరిమాణంతో రైతులను వెంటనే రొయ్యలను పట్టేసి అందినకాడికి అమ్ముకున్నారు. ఇక వర్షాకాలంలో వాతావరణం రొయ్యల పెంపకానికి అనుకూలం కాదు. అందువల్ల రొయ్యల పెంపకాన్ని ఆపి చేపల పెంపకాన్ని చేపట్టారు. చేపల పెంపకం 9 నెలల నుంచి 12 నెలల వరకు సాగుతుంది. అయితే దీనికి ఇచ్చే ఆహారం ధర కూడా 79 శాతం పెరిగింది. గతంలో 10 టన్నుల డీఓబీ (చేపల ఆహారం) లక్ష వరకు ధర ఉండగా ఇప్పుడు రూ.1.79 లక్షలకు పెరిగింది. కాని చేపల ధర మాత్రం పెరగలేదు. దాంతో చేపల పెంపకం కూడా నష్టాలను మిగుల్చుతుంది.

ఈ సంఘటనలన్నీ ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అది - ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో, నూతన మార్కెట్లను అందిపుచ్చుకోవడంలో మనం చూపుతున్న అలసత్వం. ఒకే మార్కెట్‌పై లేదా ఒకే కొనుగోలుదారుపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఈ సంక్షోభాలు గుణపాఠం నేర్పుతున్నాయి. ప్రభుత్వాలు, పరిశ్రమ వర్గాలు, రైతులు కలిసికట్టుగా ప్రత్యామ్నాయ మార్కెటింగ్ వ్యూహాలను, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిచో, మానవ వనరులు, ఆర్థిక శక్తి రూపంలో మనం భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**ఫెంటానిల్ పేరుకు నొప్పి నివారిణి అన్న మాటే కాని దాని వాడకం అమెరికా అంతటా విస్తరించింది. అక్కడి ట్రంప్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తోంది. ఇది మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి పెను సవాల్‌గా మారింది. అయితే అమెరికా ప్రభుత్వం ఫెంటానిల్‌ను ఒక సాముహిక విధ్వంసక ఆయుధం- డబ్ల్యూఎండీగా పరిగణించాలా లేక దీని ద్వారా రసాయన ఆయుధాల తయారీపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలా అనే సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడు తోంది. రష్యా మాత్రం ఫెంటానిల్‌తో రసాయనిక ఆయుధాల తయారీకి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. రష్యా ప్రయత్నాలకు బ్రిటన్ దేశం బాసటగా నిలవడం విశేషం. అయితే ఫెంటానిల్ రసాయనిక ఆయుధాలను భవిష్యత్తులో యుద్ధంలో కూడా వినియోగించే ప్రమాదం లేకపోలేదని ఆందోళన చెందుతున్న దేశాలు చాలానే ఉన్నాయి.**



# రష్యాకు ఇష్టం.. యూఎస్‌కు కష్టం..! రసాయనిక ఆయుధం

ఫెంటానిల్, దాని సారూప్యాలు సింథటిక్ నొప్పి నివారణులు లేదా మాదకద్రవ్యాలుగా ప్రాచుర్యంలో ఉన్నాయి. దీనిని మొదట 1959లో బెల్జియంలో పాల్ జాన్సెన్ సంశ్లేషణ చేశారు. దీనిని ఒక బాధానివారణిగా, మత్తుమందుగా కనుగొన్నారు. ఇది 1968లో అమెరికాలో వైద్యపరంగా వినియోగించడానికి ఆమోదం పొందింది. ఫెంటానిల్ కేన్సర్ బాధితులు, గాయపడిన సైనికులు, తీవ్రమైన నొప్పితో బాధపడేవారికి బాధానివారిణిగా ప్రముఖ పాత్ర పోషించింది. ఫెంటానిల్ పరిసర ఉష్ణోగ్రతల వద్ద ఒక ఘన పదార్థం(లవణం)గా ఉంటుంది. కానీ అది ద్రావకంలో ద్రవంగా కూడా వ్యాప్తి చెందగలదు. అంతేకాకుండా ఒక ద్రావకంతో కలిసిపోయి చర్మం ద్వారా గ్రహించబడుతుంది. ఫెంటానిల్ ఔషధ ఉత్పత్తుల్లో లాజెంజెస్, లాలీపాప్స్, టాబ్లెట్లు, ట్రాన్స్‌డెర్మల్ ప్యాచ్‌లు, స్ప్రేలు, ఇంజెక్షన్ చేయగల ఫార్ములేషన్లు ఉన్నాయి. రహస్యంగా తయారైన ఫెంటానిల్ పౌడర్ లేదా నకిలీ టాబ్లెట్ల రూపంలో లభిస్తుంది. ఫెంటానిల్‌ను విడిగా కూడా విక్రయిస్తారు. దీనిని కొకైన్, తదితర మాదక ద్రవ్యాలతో కలిపి అమ్ముతారు.



ఫెంటానిల్

ఫెంటానిల్, దాని సారూప్యాలు అమెరికాలో నియంత్రిత పదార్థాల చట్టానికి లోబడి ఉన్నాయి. ఫెంటానిల్, ఆల్ఫెంటానిల్, రెమిఫెంటినల్, కార్ఫెంటానిల్, సుఫెంటానిల్, థియాఫెంటినల్ చట్టబద్ధమైన వైద్య లేదా పశువైద్య ఉపయోగాలను కలిగి ఉన్నాయి. చట్టంలోని షెడ్యూల్ 2 కింద జాబితాకు నోచుకున్నాయి. అక్రమ ఫెంటానిల్ సారూప్యాలకు గుర్తింపు పొందిన చట్టబద్ధమైన ఉపయోగాలు లేవు. ఇవి చట్టంలో షెడ్యూల్ 1 కింద నియంత్రణలో ఉన్నాయి.

**ఫెంటానిల్ ఒక అక్రమ మాదక ద్రవ్యం**

ఫెంటానిల్ దశాబ్దాలుగా ఒక నిషేధిత మాదకద్రవ్యంగా దుర్వినియోగమవుతోంది. కానీ ఇటీవలి సంవత్సరాల్లో ఇది ఓ సంక్షోభంగా మారింది. ఇది హెరాయిన్ కంటే చాలా శక్తివంతమైనది. తక్కువ ధరకు దొరుకుతుంది. ఈ సౌలభ్యాలు దీనిని ఇతర నిషేధిత మాదక ద్రవ్యాలకు ఒక సాధారణ అనుబంధిత మాదక ద్రవ్యంగా మార్చాయి. బాధానివారణిని అధిక మోతాదులో తీసుకోవడం ద్వారా సంభవించే మరణాల సంఖ్యను గణనీయంగా పెంచాయి. అమెరికాలో అక్రమంగా వినియోగిస్తున్న ఫెంటానిల్, దాని సారూప్యాలలో ఎక్కువ భాగం చైనాలో ఉత్పత్తి అవుతాయి. అవి అక్కడి నుంచి నేరుగా లేకుంటే మెక్సికో లేదా కెనడా గుండా అమెరికాకు రవాణా అవుతాయి. అక్రమ మాదక ద్రవ్యాల చరిత్రను ఒకసారి పరికిస్తే ఎక్కడ గిరాకీ ఉంటే అక్కడ సరఫరా ఉంటుందని అది సూచిస్తోంది.

**అచేతనత్వానికి గురి చేసే ఏజెంటుగా ఫెంటానిల్**

అనేక దేశాలు ఫెంటానిల్, దాని సారూప్యాలపై పరిశోధన చేపట్టాయి. వాటిని అచేతనత్వానికి గురి చేసే ఏజెంట్లుగా నిర్ధారించాయి. అయితే ఈ విషయం పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు. 1990 దశకంలో అమెరికాకు చెందిన రక్షణ శాఖ-డీవోడీ, న్యాయశాఖ ఇదే తరహా పరిశోధనలు జరిపాయి. అమెరికా, విదేశాలలో సైనిక, సైనికేతర భద్రతా సంస్థలు రసాయనాలు సహా అంతగా ప్రాణాంతకం కాని వాటి తయారీపై చాలా కాలంగా ఆసక్తిని చూపిస్తున్నాయి. రసాయనిక ఆయుధాల ఒడంబడిక-సీడబ్ల్యూసీ కుదిరేంతవరకుకూడా ప్రపంచవ్యాప్తంగా అనేక సైనిక దళాలు అల్లర్ల నియంత్రణకు బాష్పవాయువును వినియోగిస్తుండేవి. డీవోడీ 1960 దశకం మొదట్లో అచేతనత్వానికి గురిచేసే ఒక రసాయనిక ఆయుధాన్ని ఉత్పత్తి చేసింది. ఆయుధం కోసమని సైకోయాక్టివ్ సమ్మేళనం బీజెడ్ (3-క్వినుక్లిడినిల్ బెంజిలేట్)ను వినియో గించింది. కానీ 1989 నాటికి దానిని ఉపసంహరించుకుంది. అచేతనత్వానికి గురి చేసే ఏజెంట్ కోసం చేసే పరిశోధనల్లో ఒక రసాయనం లేదా అంతకు మించిన రసాయనాల మిశ్రమాన్ని కనుగొంటారు. అది వైరి వర్గానికి చెందిన ఒక వ్యక్తి లేదా సమూహాన్ని అచేతనపరుస్తుంది. ముంచుకొస్తున్న ముప్పును అడ్డుకోవడానికి వీలైనంత వేగంగా లక్ష్యంపై దాడి చేస్తుంది. దాన్ని నిరాయుధీకరిస్తుంది. అది ఈ క్రమంలో ప్రత్యర్థికి ఏరకమైన శాశ్వత హానిని తలపెట్టదు. బాష్పవాయువు, బీజెడ్‌లు అచేతనత్వానికి గురిచేసే ఏజెంట్‌గా పనిచేయడంలో విఫలమైనాయి. బాష్పవాయువు ప్రత్యర్థిని పారిపోయేలా చేస్తుంది. బీజెడ్ అతడు లేదా ఆమెలో వింత ప్రవర్తనకు దారి తీస్తుంది.

డీవోడీ ప్రత్యర్థిని అచేతనపరచడంలో ఫెంటానిల్, దాని సారూప్యాలు లేదా అలాంటి రసాయనాల సమ్మేళనాల సామర్థ్యాన్ని గుర్తించింది. కానీ భద్రత ఏ మేరకు ఉంటుందనేది కనుక్కోలేకపోయింది.



# ఫెంటానిల్

దీంతో ఈ రసాయనిక ఆయుధ కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించేసింది. భద్రత ఏ మేరకు ఉంటుందనేది ప్రత్యర్థిని అచేతనపరచడానికి, ప్రత్యర్థిని చంపడానికి ఉపయోగించే రసాయనాల మోతాదులో వ్యత్యాసాన్ని సూచిస్తుంది. ఆ వ్యత్యాసం వ్యక్తిని బట్టి మారుతుంటుంది. అయితే భారీ మోతాదులో రసాయనాన్ని వినియోగించినప్పటికీ అది ఎక్కువ మందిని అచేతనపరుస్తుంది లేదా ఎక్కువ మందిని చంపేస్తుంది అని అనడానికి ఎలాంటి గ్యారంటీ లేదు. అయితే డీవోడీ ఎప్పుడూ కూడా ఫెంటానిల్ సమ్మేళనాలను ఆయుధీకరించలేదు. కానీ ఒక దేశం మాత్రం ఆ పని చేసింది. అక్టోబర్, 2002లో రష్యా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కోసమని ఫెంటానిల్ సారూప్యాలను వినియోగించింది. 40 మంది చెచెన్ ఉగ్రవాదులు మాస్కోలోని డుబ్రోవ్కా థియేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 800 మందికి పైగా సామాన్య పౌరులను బందీలుగా చేసుకున్నారు. థియేటర్ చుట్టూ పేలుడు పదార్థాలను అమర్చారు. రష్యా చెచెన్యాలో తన సైనిక చర్యను విరమించుకోని పక్షంలో థియేటర్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని, బందీలను చంపుతామని ఉగ్రవాదులు బెదిరించారు. ఇరు వర్గాల మధ్య అనేక రోజులు చర్చలు జరిగినప్పటికీ అవి ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో ఉగ్రవాదులు బందీలను వరుసపెట్టి చంపుతామని బెదిరించారు. ఈ నేపథ్యంలో రష్యా భద్రతా బలగాలు థియేటర్‌ను ముట్టించడానికి నిర్ణయించాయి. థియేటర్‌లో ఉన్నవారిని అచేతనంగా ఉంచడానికి రెండు ఫెంటానిల్ సారూప్యాల గాలి తుంపర మిశ్రమాన్ని థియేటర్‌లోకి పంపించాయి. ఈ ఘటనలో ఉగ్రవాదులు,బందీలను కలుపుకొని మొత్తం 130 మంది మరణించారు. మరణించిన బందీల్లో అత్యధికులు ఫెంటానిల్ సమ్మేళనాల ప్రాణాంతక మోతాదుకు గురయ్యారు(ఈ కథనంలో మొదట్లో ప్రస్తావించిన భద్రతా సమస్యను, మోతాదులో వ్యత్యాసాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని చదువరికి మనవి). రష్యా భద్రతా బలగాలు ఫెంటానిల్ రసాయన ఆయుధ ప్రయోగాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యవసర స్పందన బలగాలను, వైద్య సిబ్బందిని సిద్ధం చేసుకొని ఉండి ఉంటే బందీల మరణాల సంఖ్య వందకు పైగా ఉండేది కాదు. వారిలో కొంతమందినైనా కాపాడి ఉండేవారు. మత్తుమందుకు విరుగుడుగా పనిచేసే నలోక్సోన్, తదితర ఔషధాలు మోతాదుకు మించిన మత్తుమందు దుష్ప్రభావాన్ని ఏమాత్రం లేకుండా చేయగలిగేవి.

**రష్యాకు ప్రశంసలు.. రసాయనిక ఆయుధంపై ఆందోళనలు**

రష్యా బందీల సమస్యను పరిష్కరించడంలో రసాయనాలను వాడటంపై అంతర్జాతీయంగా మొదట్లో సానుకూలమైన ప్రతిస్పందన వచ్చింది. బ్రిటిష్ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ సంక్షోభ పరిష్కారంపై అభినందనలు తెలియజేయడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేశారు. సైన్యం, పోలీసులు లాంటి చట్టబద్ధమైన సంస్థలు ఫెంటానిల్‌ను ఒక రసాయన ఆయుధంగావాడటం ముఖ్యమని సీడబ్ల్యూసీ పేర్కొంది. అదే సమయంలో దాని వాడకంపై ఎలాంటి నిషేధాన్ని విధించకపోవడం గమనార్హం. బహుశా బాష్పవాయువు వంటి అల్లర్ల నియంత్రణ ఏజెంట్లను దృష్టిలో ఉంచుకొని అలా చేసి ఉండవచ్చు. రష్యా లోని డుబ్రోవ్కా థియేటర్‌లో ఫెంటానిల్‌ను ప్రయోగించిన కారణంగా 130 మంది మరణించారు. అయితే దానిని ప్రయోగించడం వెనుక ముఖ్యమైన ఉద్దేశం ఉగ్రవాదులను అచేతనులను చేయడం, బందీలను సురక్షితంగా విడిపించడం. ఈ కారణంగా రష్యా తొలిసారిగా చేసిన రసాయన ఆయుధ ప్రయోగం యావత్ ప్రపంచానికి ఆమోదయోగ్యమైంది. ఫెంటానిల్ సమ్మేళనాలకు గురికావడం వల్ల దాదాపు 130 మంది బందీలు మరణించినప్పటికీ, ఉగ్రవాదులను అచేతనులను చేయడమే ఉద్దేశంగా రష్యన్లు చేసిన పని అందరికీ ఆమోదయోగ్యమైంది. అయితే కొన్ని పాశ్చాత్య దేశాలు ప్రాణాంతక మోతాదులో ఫెంటానిల్ సమ్మేళనాలు లాంటి రసాయనాలను ఆయుధాలుగా వినియోగించడం వల్ల సంభవించే దుష్పరిణామాలను అంతర్గతంగా చర్చించుకున్నాయి. రసాయన ఆయుధాల కోసమని అమాయకుల ప్రాణాలు పణంగా పెడుతున్నారని ఆందోళన చెందాయి. ఆయుధాలుగా రసాయనాలను ఉపయోగించకుండా విధించిన కట్టుబాటుకు కోత పెడుతున్నారని విమర్శించాయి. సీడబ్ల్యూసీ సభ్యులు తమ స్వార్థానికి వాటిని వాడుకునే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించాయి. వాటిని యుద్ధంలో ఉపయోగించే అవకాశంఉందని సూచించాయి.

**ఖలిస్తాన్ ఉగ్రవాదులతో చైనా ఫెంటానిల్ బంధం**

పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న భౌగోళిక రాజకీయ ప్రాజెక్టుగా ఖలిస్తాన్ వేర్పాటువాదం ఉంది. పాకిస్తాన్ దీనిని అడ్డం పెట్టుకొని దశాబ్దాల కాలంగా భారత్, కెనడా, ఆస్ట్రేలియా, యూకే, అమెరికాలాంటి దేశాలకు సాయుధులైన ఖలిస్తానీ టెర్రరిస్టులను అక్రమ మార్గాల్లో పంపిస్తోంది. భారత్‌ను దెబ్బతీయడానికి జరుగుతున్న ఖలిస్తానీ కుట్రలో చైనాకు కూడా లంకె ఉంది. ఆ లంకె ఫెంటానిల్ మాదకద్రవ్యం. ఇది అమెరికాకు ప్రాణాంతకంగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ మాదక ద్రవ్యాలను తయారుచేసే లాటిన్ అమెరికాకు చెందిన ఎనిమిది సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించారు. ట్రంప్ అమెరికాలోకి ఫెంటానిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న చైనా, కెనడా దేశాలపై సుంకాలను కూడా విధించారు.

**– జాగృతి డెస్క్**



**అక్టోబర్, 2002లో మాస్కోలోని డుబ్రోవ్కా థియేటర్‌లో రసాయనిక ఆయుధ ప్రయోగం**

ఓ బుల్లి రెక్కల గుర్రం..

దాని చుట్టూ తిరుగుతూ ఎగురుతూ ఆడుకుంటూ బుజ్జి బుజ్జి తూనీగలు.. గుంపులు గుంపులు మబ్బులచాటు నుండి బయటకు వచ్చి నన్ను తొంగి చూసి భలే నవ్వాయి. ఆ వెనగ్గా.. మరేమో.. రెక్కల ఏనుగులు, రెక్కల కోతులు, రెక్కల జింకలు, పెద్దపెద్ద రెక్కల పాములు.. వాటి వెంట.. మీద.. చుట్టూ.. బుల్లి బుల్లి రెక్కల పిట్టలు.. ఆ వెనగ్గా మరేమో దేవతలు, అప్సరసలు, యక్ష కిన్నెర కింపురుషులు.. వాళ్లకూ బుజ్జి బుజ్జి రెక్కలున్నాయి. భలే భలే.. నన్ను చూసి ముచ్చటపడుతూ రెక్కలు విసనకర్రల్లా విప్పి టపటపలాడిస్తూ క్రింది కొచ్చి నా బుగ్గలు సాగలాగి ముద్దెట్టుకుని మళ్లీ కిలకిల నవ్వుతూ ఎగురుతూ పైకి వెళ్లి మళ్లీ క్రిందికి వంగి.. నన్ను చూస్తూ నవ్వుతున్నారు. అలా కిందికి పైకి.. కిందికి పైకి..మళ్లీ మళ్లీ.. నాకు భలే నవ్వొస్తోంది. నోట్లో వ్రేలు పెట్టుకుని పగలబడి నవ్వుతున్నానన్నమాట..

ఎక్కడో పై ఎత్తున రాజప్రాసాద అంతరాలయం. ఆకాశంలా అందనంత ఎత్తులో..

అక్కడ చిత్రించిన ఏవో కలగాపులగపు అద్భుత చిత్రాల మనోహర దృశ్యం అది. దూరంగా దగ్గరగా పైన క్రిందా చుట్టూ పరివేష్టించి భవనమంతా.. లోపలా బయటా వేదమంత్ర మాధుర్యం చెవులనే కాదు శరీరమంతా క్రమ్ముకుంటోంది.

రాజప్రాసాదానికి ముందున్న విశాల ప్రాంగణంలోని ఉద్యానవనమంతా హోమగుండాలే. వాటి చుట్టూ ఎందరెందరో మహామహా మునివర్యులు.. సోమయాజులు.. వేదవేదాంగ పండితులు.. శైవ మఠాధిపతులు.. వారి ఉద్వేగభరితమైన వేద పఠనంతో కలగలిసి హోమగుండాల నుండి వెలువడుతున్న పొగ ఆకాశంలో శివ నృత్త విన్యాసాలను సృష్టిస్తోంది..

కాస్త ఈవలగా ప్రాంగణ పీఠంపై బంగారు ఊయలలో నేను.. నా ప్రక్కగా క్రింద పెద్దమ్మ సమేత పెదనాన్నగారు, అమ్మ సహితంగా నాన్నగారు ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. వారి చుట్టూ మహా రుషులు, పండితులు, విప్రోత్తములు, పురోహితులు.. దాదాపు వందమంది ఏకకంఠంతో మంద్రంగా ఏవేవో పఠిస్తున్నారు. ఏదో పవిత్రకార్యం. అందరూ కళ్లు విప్పార్చి చూస్తున్న అపురూప కార్యం ఏదో జరుగుతోంది.



పెదనాన్నగారు చూపు ఆ మొత్తం కార్యాన్ని నిర్వహిస్తున్న పెద్దలు శైవ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ ధ్రువేశ్వర పండితులపై ఉన్నది. ఆయన పద్మాసన స్థితిలో పూర్తి యోగముద్రలో.. అర్ధనిమీలిత నేత్రాలతో మంద్రస్థాయిలో గొంతెత్తి మంత్రం పఠిస్తుంటే చుట్టూ పరివేష్టితులైన శివయోగులు ఆ మంత్రాన్ని తిరిగి జపిస్తున్నారు. ఆ మంత్ర లయకు తల ఊపుతున్నట్లు బంగారు ఊయల మెల్లగా ఊగుతోంది. చుట్టూ పరివేష్టించిన పరిచారికలు మృదువుగా ఊపుతున్నారు. లేచారు పెద్దమ్మ. ఊయల వద్దకు వచ్చి నా మీదికి వంగారు. నన్ను ఎత్తుకుని వొడిలోకి తీసుకున్నారు. పెదనాన్నగారికి అందించారు. ఆయన దగ్గరగా అదుముకుని ముద్దుపెట్టుకున్నారు. మీసాలు గరుగ్గా తగిలాయి. ఆ స్పర్శ ఏదో బావుంది. దగ్గరగా కనిపిస్తున్న ఆ కళ్ల తడిలో మాధుర్యం.. స్రవంతిలా ప్రసరిస్తూ ప్రవహిస్తోంది. ఆవల ఈవల ఎవరో నవ్వులు.. ఊసులు.. ముచ్చట్లు.. మురిపాలు. మొత్తంగా అచ్చోట ఏదో మధురిమ.. మాతృత్వ మహనీయత..

కనులు కదిపి చూశాను. అమ్మ, నాన్నగారు..

మరింత మురిపంగా నన్నే చూస్తున్నారు. నాకే నవ్వొచ్చి కిలకిలా నవ్వాను. నా కాళ్లూ చేతులూ ముద్దుగా కదిలాయి. నా కాళ్లకున్న బంగారు అందియలు.. చేతులకున్న బంగారు కడియాలు గరగరలాడాయి.

అందరూ పెళ్లున నవ్వేశారు. అందరిని నవ్వించి ఆనందింపజేసినందుకు నాకెంతో ఉల్లాసమయ్యింది. నా కాళ్లూ చేతులూ మరింత మరింత ఊపి కదిపి కదలి కదలి నవ్వుకున్నాను. రానురానూ నాచుట్టూ ఆత్మీయత మరింత పెరుగుతోంది. అనురాగం నన్ను చుట్టేస్తోంది.. పెనవేసుకుంటోంది.

నేను చేతులు మారుతున్నాను. ఎవరెవరో నన్ను ఎత్తుకుంటున్నారు.

వేద మంత్రోచ్చాటన.. మేళతాళాలు.. గలగలలు.. నవునవ్వులు.. ఎందరెందరో.. సతీసమేతులై మహా మహా నాయకులు, వీరాధివీరులు.. విచ్చేస్తు న్నారు. అంతా.. నా చుట్టూ.. అంటే అమ్మానాన్న, పెద్దమ్మ పెద్దనాన్నల చుట్టూ

పరివేష్టతులౌతున్నారు. మందిరమంతా నిండి పోతోంది.

అదేదో నాకు తెలియని నా సంరంభం!!

నన్ను అమ్మానాన్నలకు అందించారు పెదనాన్న. అమ్మ నన్ను అందుకుంది. ఆమె కళ్లలో చెప్పరాని, చెప్పలేని అనిర్వచనీయ భావనల ఉధృతి. కాస్త దుఃఖం కాస్త సంతోషం ఏకకాలంలో ముప్పిరిగొని కనిపిస్తున్నాయి. కారణం ఆమె తడిసిన కన్నులు నా కనులకు అత్యంత దగ్గరగా..

అప్పుడే పురోహితుడు అమ్మకు పురమాయించాడు.

"చిరంజీవిని రుద్రదేవులకు అందించండమ్మా..!"

అందించింది అమ్మ. నేను మళ్లీ పెదనాన్నగారి ఒడిలోకి చేరుకున్నాను.

అప్పుడు తెలిసింది.. నన్ను పెదనాన్నగారికి దత్తత ఇస్తున్నారు.

అందుకే అమ్మ కన్నుల్లో అన్ని భావసందడులు.. నేను ఆమెకు దూరమౌతున్నానా.. కన్నపేగును మరొకరికి రాజు అయినా చక్రవర్తి అయినా..

# గణపతిదేవుడు






ఇచ్చేస్తోంది ఓ తల్లి!

ఆమె కన్నులలో కళ్లు పెట్టి నవ్వాను. ఆమెకు అర్థమైంది.. "నేనెప్పుడూ నీ బిడ్డనేనమ్మా.."

ఆమె కళ్లనుండి రెండు బాష్పాలు. బాధతోనా! ఆనందంతోనా! ఈ ప్రపంచంలో ఏ దేవుడూ చెప్పలేడు.

దగ్గరగా మంత్రఘోష పెరుగుతోంది.

నమక చమకాలతో రుద్రుడ్ని అర్చిస్తూ..

దగ్గరగా కిర్రుకిర్రు మంటూ శబ్దాలు.. చెవులు చిల్లులు పడేలా..

నిద్ర నుంచి దిగ్గున లేచాడు గణపతిదేవుడు.

* * *

**పునాది: కారాగార బందీ**

చెరసాల గది ఇనుప తలుపులు తీశాడెవరో.

కల చెదిరింది. సుషుప్తి లాంటి మగతలో ఓ సన్నివేశం. కలా, నిజమా.. ప్చ్..

భారంగా కళ్లు మూసుకున్నాడు గణపతిదేవుడు. కల.. ఓ అనంతానంత ఆనంద మహానంద సంగమాల మధ్య తానొక ఊయలలో పట్టుబట్టల దొన్నెలలో పవ్వళించినవేళ.. అందరూ తనను ముద్దు చేస్తున్న సంరంభం! తనను పెదనాన్నగారు దత్తత తీసుకుంటున్న సంప్రదాయ చారిత్రాత్మక ఉత్సవ సంబరం!! కాకతీయ వంశ చరిత్రలో ఓ అద్వితీయ మలుపు..

కళ్లు నులుముకున్నాడు పదిహేడేళ్ల నూనూగు మీసాల కాకతీయ భవిష్యత్తు.

యాదవ రాజ్య రాజధాని దేవగిరి చెరసాలలో బందీ!!

అలవాటులేని నేల పడక ఇబ్బంది పెడుతోంది. కదలి వొత్తిగిల్లి చూశాడు. ఆకుల దొన్నెలో ఏవో తినుబండారాలు లోపలికి తోసి మళ్లీ కారాగారపు తలుపులు వేసేశారు. ఆ తలుపుల కిర్రుకిర్రు శబ్దాలు భరించలేక చెవులు మూసుకున్నాడు గణపతిదేవుడు.

ఆకలి.

ఈ కారాగార ఉద్యోగులకు బందీల ఆకలి తెలుసేమో.. సమయానికి తినడానికి ఏదో తెచ్చి పడేశారు. లేచి ఆ ఆకుల దొన్నెను దగ్గరకు లాక్కున్నాడు గణపతి. కాస్త జొన్నకూడు.. ఏవో రెండు వ్యంజనాలు. అందులోనే మరో చిన్నదొన్నెలో పెరుగు లాంటిది.

గబగబా తిన్నాడు. రుచి పచి కాస్త తెలుస్తోంది. అప్పుడే ఓ సంశయం కలిగింది. నిన్ననే ప్రక్కగదిలో ఓ బందీ అరుస్తూ అన్నమాటలు గుర్తొచ్చాయి. "ఈ కూడు కుక్కలు కూడా తినవ్.. ఇదేమి కూడు?"

"అవును మరి.. నువ్వు మహారాజు కొడుకువి కదూ.. పంచభక్ష్య పరమాన్నాలు పెడతారు నీకు.."

ఇరువైపులా మాటలు.. తర్వాత ఏవో అరుపులు.. తిట్లు.. కాసేపటికి కొరడా దెబ్బలు.. వాడు ఏడుస్తూ అరుస్తున్నాడు, "ఈ కూడు కంటే ఈ కొరడా దెబ్బలే నయం."

అంటే కూడు అంత నీచంగా ఉందన్నమాట.

మరోసారి తనచేతిలోని ఆకుల దొన్నెలోకి చూశాడు. పెట్టిన కూడు కుక్కలు కాదు మనుషులు తినేదే పెట్టారు. పైగా రెండు భక్ష్యాలు వేశారు. ప్రక్కన గడ్డ పెరుగు. అబ్బో.. నిజంగానే తనను మహారాజు కొడుకుగా గుర్తించారు కాబోలు!

నిత్యమూ ఇలాంటి భోజనమే పెడుతున్నారు. కొండొకచో వేడివేడిగా కూడా పెడుతున్నారని గుర్తించాడు. ముద్ద చేసి కాకతమ్మను తలచుకుని కళ్లకద్దుకుని తిన్నాడు.

ఆకలి తీరింది. మూలనున్న కుండ ఒంపి చేతులు, మూతి కడిగి ఉత్తరీయంతో తుడుచుకున్నాడు. మెల్లగా ద్వారం దగ్గరకు వెళ్లి బయటకు చూశాడు. సన్నని



మత్తి భానుమూర్తి

నడవా.. రాతిగోడలు తప్ప ఏమీ కనబడదు. మరి కాసేపట్లో కొరడా దెబ్బలు, హాహాకారాలు వినిపిస్తాయి. శిక్షల అమలు.. ఈ కారాగారంలో ఎక్కువ మంది పట్టుబడిన కాకతీయ సైనికులే. ఎందుకు రోజూ కొరడాదెబ్బలు కొడతారో తెలియదు. వారి బాధామయ అరుపులు వింటుంటే తననే కొట్టిన బాధ. రోజూ ఇదే సన్నివేశం.

తిరిగి నేలపై జారగిల పడ్డాడు. కళ్లు మూసుకున్నాడు.

కలలు.. ఊహు.. అవి కలలు కాదు. చిన్ననాటి సంఘటనలు.. తల్లి గర్భంలో మస్తిష్కం ఏర్పడి బయటి ప్రపంచం పొడగట్టిననాటి నుండి అన్నీ ఈ చిన్న మస్తిష్కంలో పదిలమౌతున్నట్లు.. తనకే తెలుస్తోంది. తల్లి గర్భంలో ఉన్నప్పుడు అభిమన్యుడు ఇలాగే విని చివరికి ఎవరూ తోడు రాకున్నా ఒక్కడిగా పద్మవ్యూహాన్ని ఛేదించడానికి యుద్ధంలో దూకినట్లు.. అమ్మ చెప్పింది.

అమ్మ కడుపులో నుండి బయటకొచ్చాక విన్నవి కూడా మరింత వివరంగా అన్ని గుర్తుంటాయి.. గుర్తొస్తాయ్.

కలో వాస్తవమో తెలియని సంఘటనల దృశ్యాల సంగమ సందడి..

అలాంటిదే ఈరోజు కలలోకి వచ్చిన సంఘటన. తనను పెదనాన్న గారు దత్తత తీసుకున్నారు. పొత్తిళ్లలో బిడ్డగా ఉయ్యాలలో పవళించి ఉండగా.. జరిగిన తతంగం..

అబ్బ!! ఆ సంఘటన ఎంత బావుంది!?

ఫ్చ్.. ఇలాంటి భయానక జీవితఘట్టంలో అలాంటి మధుర సన్నివేశాలు కలలుగా రావడం ఎంత బావుందో..

పెదనాన్నగారు ఎంత ముద్దు చేసేవారు.. అనురాగం నిండిన చూపులతో తడి కళ్లతో రెప్పలార్పకుండా తనన చూస్తుండేవారు. కొలువుకు వెళ్లేవారు కాదు. తన నవ్వుల కొలువే ఆయన ప్రపంచం అనేవారు.

పెద్దమ్మ నుండి లాక్కునేవారు. కళ్లెర్ర జేసేవారు పెద్దమ్మను సైతం. అమ్మ, నాన్నగారు ఆ దృశ్యాలను మనోజ్ఞంగా వీక్షించేవారు. ఆయన వేలు అందుకుని తన నోట్లో పెట్టుకోవడం.. పళ్లు లేని లేత నోటితో తను ఆయన వేలును చప్పరించడం.. ఆయన పులకింతతో పగలబడి నవ్వడం..

కిర్రుర్రు శబ్దాలు మళ్లీ. జ్ఞాపకాల మల్లెల మాలల కదలికలను ఎవరో మళ్లీ భగ్నం చేశారు.

అర్ధనిమీలిత నేత్రాలలో గతాన్ని చూసుకుంటున్న గణపతి తల తిప్పి చూశాడు.

ద్వారం నిండుగా ఓ జంట.. పెద్దమ్మ పెదనాన్నగారు కాదు కదా. అమ్మానాన్న గారేమో?! చటుక్కున లేచి నిలబడ్డాడు. కాదు. మరెవరో జంట.

ఆహార్య, ఆభరణాలను చూస్తే మహారాజులో.. మంత్రి పుంగవులో..

ఇద్దరూ వివరంగా పరీక్షగా కళ్లు విప్పార్చి నఖశిఖ పర్యంతం చూస్తున్నారు.

"పెద్దవారో చిన్నవారో మిత్రులో శత్రువులో.. నువ్వు నమస్కరించాలి అనిపిస్తే నమస్కరించు.." పెదనాన్న చెప్పిన పాఠాలు కంఠోపాఠం!!

చేతులు జోడించి నమస్కరించాడు. పని చేసింది. ఇద్దరి ముఖాలలో లిప్తకాలంలో వెయ్యోవంతులో దరహాస చంద్రికల కాంతి!! ప్రతిగా ఆమె.. మరింత ఆపేక్షగా చూస్తూ.. చేతులు జోడించింది.

మనస్కరించలేదేమో ఆయన సంశయించాడు.

ఆయన దేవగిరి మహారాజు జైత్రపాలుడు. ఆమె అతని భార్య చిల్లాదేవి..



ఆయన దాదాపు పెదనాన్నగారు రుద్రదేవుల వారి వయసు కావచ్చు. కదిలి వెనుదిరిగాడు. ఆమె చూపు తిప్పుకుని ఆయన్ను అనుస రించింది. మలుపులో మళ్లీ చూసింది.

అదృశ్యం. మళ్లీ కిర్రుర్రు శబ్దాలు. తిరిగి నేలపై వాలాడు.

అది దేవగిరిరాజ్యంలోని దేవగిరి నగరంలో చెరసాల. అందులో ఓ సాధారణ బందీల గదిలో బందీగా ఉన్నాడతను...

కాకతీయ యువరాజు గణపతిదేవుడు. పదిహేడేళ్ల నూనూగు మీసాల యువకుడు. జైతుగి అని పేరుపడిన జైత్రపాల మహారాజు పరిపాలిస్తున్న దేవగిరి రాజ్యంపై కాకతీయ మహారాజు మహాదేవుడు ఈ ఏడాది దండయాత్ర చేశాడు.

ఇది శకవర్షం 1119 (క్రీ.శ.1198). కాని కాకతీయులు పరాజయం చవిచూశారు. మహారాజు మహాదేవుడు చనిపోయాడు. అంతేకాదు, యువరాజు గణపతిదేవుని బంధించి తీసుకుపోయి చెరసాలలో ఉంచారు.

దాదాపు పక్షంరోజులు దాటుతోంది.

చుట్టూ చెరసాలలో ప్రతిక్షణమూ వినవస్తోన్న ఏడుపులు, అరుపులు.. కొరడా శబ్దాలు.. తప్ప బయట ప్రపంచం తెలియదు. తొలిసారి కారాగారవాసం తెలుస్తోంది. తనను కొట్టడంలేదు. ఏదో తిండి పెడుతున్నారు. అది నోటికి పోతోంది. కాలకృత్యాలకు తీసుకుపోతున్నారు.

చెరసాలలో బంధించాక తొలిసారి ఓ రాజోచిత వస్త్రధారణ కలిగిన పెద్దలెవరో రావడం ఇదే. ఇప్పటివరకూ వచ్చి న వారంతా కత్తులు కటారులతో వచ్చిన యుద్ధయోధులే.. సైన్య నాయకులు లేదా కారాగార అధికారులు!

మరికాసేపటికి మళ్లీ కిర్రుర్రు శబ్దాలు.. తలతిప్పి చూశాడు. ఈసారి కారాగార అధికారులనుకుంటా.. లోపలికొచ్చారు. తీక్షణంగా లేదు చూపు. కాస్త ప్రసన్నత తాకుతోంది. ముందున్న పెద్ద అధికారి సైగ చేశాడు. వెనుకనున్న సైనికులు ముందుకొచ్చి చేతులకు గొలుసు సంకెలలు వేశారు. ముందున్నాయన కదిలాడు. గణపతిని కదలమన్నట్లు సౌజ్ఞ చేసి. అందరూ కదిలారు.

గణపతి కూడా కదిలాడు. కారాగారం లోపలి దారులన్నీ ఇరుకిరుకు. పెనుచీకటి. కడుపులో దేవేటట్టు పచ్చి నెత్తురు వాసన.. ఏదో తెలియని భయానక వాతావరణం.

మార్గమంతా చిన్న చిన్న గదులు.. నిండా బందీలు..

అందరూ చూస్తోంది గణపతిదేవుని వంకే!!

కాకతీయ యువరాజుగా పట్టాభిషక్తుడైన పదిహేడేళ్ల గణపతిదేవునికి కారాగారం క్రొత్త. అందులోని బందీలు.. వారి చూపులు మరింత కొత్త. అందుచేత తను కూడా వాళ్లను నిశితంగా చూస్తూ పోతున్నాడు. పోయి పోయి రాజప్రసాదంలోకి.. అందుండి తీసుకుపోయి పోయి ఓ గదిలో ఉంచి మళ్లీ దాని ద్వారాలు మూసి వెళ్లిపోయారు. మాటలు లేవు. కాకపోతే కరుకుదనం తగ్గి వినయం ఓ పిసరు హెచ్చినట్లు గుర్తించాడు గణపతి. గది అంతా వివరంగా చూశాడు. ఇది మరో కారాగారం. కాకపోతే కాస్త వసతులు హెచ్చు. మంచి తల్పం, ఒకటో రెండో పల్యంకాలు.. ఎంతైనా రాజప్రసాదంలోని కారాగారం కదా!

తనతోపాటు వెయ్యిమందికి పైగా కాకతీయ సైనికులను బంధించి తెచ్చినట్లు కాపలా భటులు చెప్పుకుంటుంటే విన్నాడు. వాళ్లనందరినీ కూడా ఈ రాజప్రాసాదపు కారాగారాలలోకి తరలిస్తారా.. ఫ్చ్.. తరలించకపోవచ్చు.

తల్పంపై కూర్చున్నాడు. మెత్తని దూది పరుపు. దానిపై పరిచిన విలువైన వస్త్రాలు.. కుడ్యాలకు వ్రేలాడుతూ విలువైన తెరలు.. వినయంగా మౌనంగా.. రక్షణ భటుల్లా.. కొండొకచో స్నేహితుల్లా..

"తొందరపడకు. ఆలోచించు. అంతకు ముందు విను. విన్నాక కాస్త మౌనం. అందులో వేగంగా ఆలోచన. అప్పుడే ఓ అవగాహనకు రావాలి. ఇవన్నీ లిప్త కాలంలో నిర్వహించాలి. చావో రేవో.."

ఆ రోజు వ్రేలు పట్టుకుని యుద్ధ శిక్షణ శాలలో తిరుగాడుతూ పెదనాన్న చెప్పిన మాటలు..

ఎందుకు ఇక్కడికి తీసుకువచ్చినట్లు??

ఎవరో తలుపులు తీశారు. హమ్మయ్య కిర్రుర్రు శబ్దాలు లేవు. మెత్తగా

వినయంగా తెరుచుకున్నాయి. లోపలికి వచ్చారొక వ్యక్తి. సైనికయోధుని ఆహార్యం. నడుముకు వ్రేలాడుతున్న ఒర. ఆజానుబాహువు. చూపుల్లో క్రూరత్వం కలగలిసిన హుందాతనం, అధికార దర్పం. వెంట నలుగురైదుగురు భటులు.

వారిలో ఒకడు ముందుకు వచ్చి చెప్పాడు. "దేవగిరి రాజ్య సర్వసైన్యాధికారి శ్రీ జల్లన సేనానులవారు.."

మళ్లీ పెదనాన్న గుర్తొచ్చారు. లేచి నమస్కరించాడు గణపతిదేవుడు.

ఆ పెద్దాయన.. జల్లన సేనాని కూడా చేతులు జోడించాడు.

"శుభాశీస్సులు! కౌమారంలో ఉన్నావు. నేను నీ ప్రవర్తనను పరిశీలించమన్నాను. కాని ఎప్పుడూ బెదిరి కంటనీరు పెట్టుకున్నట్లు మా కారాగార ఉద్యోగులు చెప్పలేదు. శత్రువుల చేత చిక్కిన చిన్న పిల్లవాడివి. అభిషిక్తుడైన కాకతీయ యువరాజువి. నిన్ను సంహరించడం మాకు చాల చిన్నపని. కాని అది అవసరమా అని మహారాజులవారు తర్జనభర్జన పడుతున్నారు. కానీ నిన్ను ఇప్పటివరకూ పరీక్షిస్తున్నామే కానీ నీపై ఎలాంటి చర్య తీసుకోలేదు. ఎందుకో తెలుసా..?" ఆపాడు.

అప్పుడు నిజంగానే భయం వేసింది గణపతికి. చంపలేదు. కొరడాదెబ్బలు కొట్టలేదు. చర్మం వలిపించలేదు. కళ్లు పెరికించలేదు. నిజమే!! కొంపదీసి ఇప్పుడు మొదలెడతారేమో.. అదే చెబుతున్నాడీ రణపిపాసి!!

నిజమే.. తనెందుకు భయపడటం లేదు? అది పెదనాన్న గారి పెంపకం!

అదే చెప్పాడు. "మా పెదనాన్నగారు కాకతీయ మహామండలేశ్వరులు రుద్రదేవులు నాకు చెప్పిన సుభాషితాలు అనుకుంటున్నాను మహాసేనాని.."

స్పష్టంగానూ వినయంగానూ చెప్పడం గణపతిదేవుని ప్రత్యేకత.

"లెస్స.. లెస్స పలికితివి యువరాజా. మీ పెద తండ్రిగారు మహా మేధావి. యుద్ధానికి దండెత్తి వెళ్లడం.. ఓడిపోయే పరిస్థితి వస్తే వెంటనే ఆ రాజ కుటుంబంలోని అబ్బాయికో అమ్మాయికో తన కుటుంబంలోని వారిది ఓ పేరు చెప్పి ఓ కత్తికి తాళి కట్టించేసి కత్తు కలుపుకోవడం.. అదే ఆయన చాణక్యం. అది పీఠభూమి రాజ్యాల్లో సాగింది కాని తీరాంధ్రంలో, ఈ ఆగ్నేయ, ఉత్తర, ఈశాన్య రాజ్యాలతో కుదరదు. అది ఆయనకు క్షుణ్ణంగా తెలుసు కనుకే కత్తి పడేసి ప్రశాంతంగా కన్నుమూశాడు. కాని మీ తండ్రి రెచ్చిపోయి వచ్చివచ్చి మాపై కత్తి ఝుళిపించి ఏదో సాధించబోయాడు.. కాని చేతకాక మట్టి కరిచాడు."

దవడ కండరాలు బిగుసుకున్నాయి. గెలిచినవాడి వాక్యం రసాత్మక సుభాషితం! ఒప్పుకోక చస్తామా!

"రెచ్చగొడితే రెచ్చిపోతే నీకూ ఓ సాధారణ సైనికుడికి తేడా ఏముంది! కనుక రెచ్చగొట్టినప్పుడు ప్రశాంతంగా వినడంలోనూ కనురెప్పల కదలికల మధ్య శత్రువును ఎలా నరకాలో ప్రణాళిక రచించడంలోనూ విజయం ఉంది."

పెదనాన్న తన కోసం పూర్తిగా బాటలు పరిచాడు. ఎక్కడ గుట్ట ఉన్నదో.. ఎక్కడ రక్కెసపొదలు.. ఎక్కడ రాళ్లు రప్పలు.. పొదలు ముళ్లూ ఉంటాయో దృశ్యాదృశ్యంగా చిన్నప్పుడే వివరించాడు కదా..

కళ్లు మూసుకున్నాడు.

"ఓహ్. మౌనం మంచి సమాధానం! రుద్రదేవుడి శిక్షణ కాబోలు. నిన్ను తన వారసుడుగా తీర్చిదిద్దుతున్నట్లు మాకు వర్తమానం ఉందిలే."

భావరహితం ఉత్తమం!! వింటున్నట్లుగా ఉంచాడు ముఖం.. చిరునవ్వులో పావువంతు తగిలించాడు.

"నిన్ను సాధారణ కారాగారం నుండి ఈ రాజప్రాసాద చెరసాలకు ఎందుకు మార్చమన్నారో.. ప్చ్.. ఆ పిచ్చోడికి తప్ప ఎవ్వరికీ తెలియదు.."

చిరాకుగా ముఖం పెట్టి వెనుదిరిగాడు. మళ్లీ ఇటు తిరిగాడు.

"ఎందుకు మార్చారో చెప్పాడా వాడు?!"

"లేదు దేవరా. ఏదో పన్నాగంలా.."

వాడు చెబుతుంటే ఆపమన్నట్లు చెయ్యెత్తాడు జల్లన సేనాని.

(సశేషం)




# మన రోదసి కేంద్రం నమూనా ఇదే!

ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినాన్ని పురస్కరించుకొని భారతీయ అంతరిక్ష స్టేషన్–బీఐఎస్ నమూనాను ఇస్రో ఆవిష్కరించింది. 3.8 మీటర్ల ఎత్తు, 8 మీటర్ల పొడవు ఉన్న బీఐఎస్‌ను ఢిల్లీలోని భారత్ మండపం వద్ద రెండు రోజుల పాటు ప్రదర్శనకు ఉంచింది. అక్కడ ఏర్పాటు చేసిన నమూనాలు అన్నింటిలో అత్యంత ఆకర్షణీయంగా బీఐఎస్ నిలిచింది. 2023నాటికి సొంతంగా రోదసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా భారత్ కంటున్న కలలకు నమూనాగా సందర్శకులను ఆకట్టుకుంది. అంతర్జాతీయ రోదసి కేంద్రం–ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా పేరు తెచ్చుకున్న గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటుగా, కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్ తదితరులు బీఐఎస్ నమూనాతో ఫోటో దిగారు. ప్రస్తుతం అంతరిక్షంలో రెండు రోదసి కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఐదు దేశాలు కలిసి ఏర్పాటు చేసుకున్న ఐఎస్ఎస్. మరొకటి చైనాకు చెందిన తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రం. భారత్ సైతం ఐదు మాడ్యూళ్లతో బీఏఎస్‌ను నిర్మించడానికి నడుం బిగించింది. అందులో భాగంగా ఇస్రో బీఐఎస్ తొలి మాడ్యూల్‌ను 2028నాటికి అంతరిక్షంలోకి పంపడానికి పథక రచన చేసింది. బీఏఎస్ మొదటి మాడ్యూల్ దాదాపు 10 టన్నుల బరువు ఉంటుందని ఓ అంచనా. దీనిని భూమికి 450 కి.మీ.ల ఎత్తున ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెడతారు. ఇందులో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన వాతావరణ నియంత్రణ, జీవనానికి మద్దతు ఇచ్చే వ్యవస్థ–ఈసీఎల్ఎస్ఎస్, భారత్ బెర్తింగ్ మెకానిజమ్, భారత్ డాకింగ్ వ్యవస్థ, అయాచిత హ్యాచ్ వ్యవస్థ, భారరహిత స్థితిలో పరిశోధన, వ్యోమగాములకు వినోదాన్ని అందించే వ్యూపోర్ట్‌లు వంటి సదుపాయాలు ఉంటాయని ఇస్రో వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటుగా ఈసీఎల్ఎస్ఎస్‌కు ఇంధనాన్ని నింపే వ్యవస్థ, ఉష్ణ సంబంధిత రేడియో ధార్మిక శక్తి, ఉల్కకు సంబంధించిన సూక్ష్మమైన శకలాల నుంచి రక్షణ, స్పేస్ సూట్లు, ఎయిర్‌లాక్ వ్యవస్థలు, రోదసి యానంలో వినియోగించే సమీకృత ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా అందుబాటులో ఉంటాయి. బీఏఎస్ అంతరిక్షం, జీవశాస్త్రాలు, వైద్యం, ఔషధాలు, గ్రహాంతర అన్వేషణకు సంబంధించిన అనేక అంశాలపై పరిశోధనకు, అధ్యయనానికి అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుంది. ఇది మనిషి ఆరోగ్యంపై భారరహిత స్థితి ప్రభావాలను అధ్యయనం చేయడానికి, రోదసిలో మానవులు ఎక్కువ కాలం ఉండటానికి ఉపకరించే ముఖ్యమైన అంశాలను పరీక్షించడానికి పనికి వస్తుంది. భారత్ రోదసి రంగంలో వాణిజ్య కార్యకలాపాలు చేపట్టడానికి సాయపడుతుంది. అంతరిక్షాన్ని ఒక ఉపాధి అవకాశంగా ఎంచుకోవడంలో భారతీయ యువతకు స్ఫూర్తిని ఇస్తుంది. – జాగృతి డెస్క్

ఇటీవల తెలంగాణలో ఒక తుపాను కొద్దిపాటి కలవరం రేపింది. 'మార్వాడీ గో బ్యాక్' నినాదంతో బయలుదేరారు. కొందరు యువకులు, యూనివర్సిటీ విద్యార్థులు దీనిని అందుకున్నారు. తెలిసో తెలియకో కొందరు సాహితీవేత్తలు కూడా తొందరపడి దీనికి వత్తాసు పలికారు. వాస్తవానికి ఈ అంశం మీద తెలంగాణ సమాజంలో ఏకాభిప్రాయం లేనేలేదు. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవని రెండు వర్గాల ఘర్షణగా చిత్రించడానికి జరిగిన ప్రయత్నం ఒక తాటాకు మంటలా ఎగసి వెంటనే చల్లారిపోయింది. ఇక్కడే దీని బలహీనత బయటపడింది. కానీ ఒక వర్గం సామాజిక మాధ్యమాలు యథాప్రకారం తెలంగాణలో 'నానాటికీ విస్తరిస్తున్న మరో ఉద్యమం' అంటూ కథనాలు ఇచ్చేశాయి.



# అసాంఘిక శక్తుల మార్వాడీ

హైదరాబాద్‌లో మార్వాడీలకు చెందిన ఒక దుకాణం ఎదుట ఒక వ్యక్తి కారు పార్కింగ్ చేయడం దగ్గర మొదలయిన ఈ వివాదం నిజంగానే కొన్ని రోజుల పాటు కలవరం రేపింది. కొందరి అభిప్రాయం ప్రకారం మార్వాడీల దుకాణం దగ్గర జరిగిన రగడలో దెబ్బలు తిన్న వ్యక్తి దళితుడు కావడంతో వివాదం తీవ్రంగా కనిపించింది. ప్రచారం కూడా ఎక్కువగా వచ్చింది. కానీ మార్వాడీలకీ, ఎస్‌సీలకీ మధ్య ఘర్షణ చరిత్ర ఏమీ లేదు. ఇది గతంలో తెలంగాణ నుంచి ఇచ్చిన గోబ్యాక్ నినాదం వంటిది కూడా కాదు. కాలేదు కూడా. దీనిని మొదలుపెట్టిన వ్యక్తి అసలు తెలంగాణ మూలాలు ఉన్న వ్యక్తి కాదన్న దానితోనే వేడి కాస్త చల్లారింది. అలాగే ఒక ప్రాంతం నుంచి ఒక వర్గాన్ని వెళ్లిపోవలసిందని ఆదేశించడం, లేదా అందుకు దారి తీసే పరిస్థితులు కల్పించాలని చూడడం రాజ్యాంగ విరుద్ధం. అది కూడా ఈ పిలుపునకు ఊపురాక పోవడానికి కారణం కావచ్చు.

మార్వాడీలు దళితుడి మీద దాడికి దిగిన తరువాత గోబ్యాక్ నినాదం వచ్చింది. మార్వాడీలను వెళ్లి పోవలసిందేనంటూ వీధులకెక్కిన వారికి వెంటనే కొన్ని ప్రశ్నలు సిద్ధమయినాయి. తెలంగాణ నుంచి రొహింగ్యాలను మీరు ఎందుకు పొమ్మనడం లేదు? పైగా వాళ్లు విదేశీయులు. సమస్యలు సృష్టిస్తున్నవారు. అలాగే మైనారిటీల చేతిలో దళితులు హత్యకు, దాడులకు గురి కావడం గతంలో జరిగాయి. ముస్లింలు వెళ్లిపోవాలని అనే ధైర్యం మీకు ఎందుకు లోపించిందన్నది మరొక ప్రశ్న. వికారాబాద్ కేంద్రంగా జరిగిన ఉదంతాలు నిజంగానే బాధ కలిగిస్తాయి. ఒక ముస్లిం యువతిని ప్రేమించినందుకు ఆ వర్గం ఒక దళిత యువకుడిని చంపింది. ముస్లింలు వెళ్లిపోవాలని అన్న నినాదం కాదు కదా, కనీసం బాధితుడి తరపున ఒక ఖండన ఇచ్చే నాయకులు కూడా ఆ రోజు ఎందుకు కరవయ్యారన్న ప్రశ్న నిజంగా తీవ్రమైనదే. ఆలోచింప చేసేదే కూడా. వికారాబాద్‌లోనే మరొక విచిత్ర ఘటన చోటు చేసుకుంది. అక్కడి నాయీ బ్రాహ్మణులు, విదేశీ ముస్లింల మధ్య వివాదమిది. బార్బర్ దుకాణాల ఏర్పాటు దగ్గర గొడవ వచ్చింది. మా ఉపాధిని వారు దోచుకుంటున్నారని నాయీ బ్రాహ్మణుల ఆరోపణ. ఈ అంశం గురించి గట్టిగా మాట్లాడిన ఈ వర్గం నాయకునిపై ముస్లింలు దాడికి దిగారు. ఆయన తరపున కూడా ఆరోజు బీసీ నాయకులు, ఎస్‌సీ నాయకులు కూడా నోరెత్త లేదు. ఇవేం ద్వంద్వ ప్రమాణాలన్న ప్రశ్న సహజంగానే వినిపించింది. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఒక దళిత యువకుడు అంబులెన్స్ నడుపుతాడు. అతని మీద దాడి జరిగింది. ఎందుకు? అతడు పేద వర్గాలకు ఉచిత సేవలు అందించాడు. ఇదే అతడు చేసిన తప్పిదం. అందువల్ల తమ ఉపాధికి భంగం వాటిల్లిందని మైనారిటీలు అతడి మీద దాడికి దిగారు. దీనిని కూడా ఖండించేవారు లేకపోయారు.



డీకే శివకుమార్ 'నమస్తే సదా వత్సలే మాతృభూమే' ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించారు.

భారతీయ సమాజాన్ని చీల్చడానికి ఒక నిరంతరం ప్రయత్నం జరుగుతూనే ఉంది. ద్రవిడ రాజకీయ సంస్కృతికి అలవాటు పడిన వ్యక్తి ఈ నినాదం ఇచ్చాడంటేనే చాలామందికి ఆ అనుమానం వచ్చింది. ఇక అర్బన్ నక్సల్స్ ఇలాంటి వాటిలో ఆజ్యం పోయడానికి ఎప్పుడూ ముందుంటారు. ఉదాహరణకి హరగోపాల్. ఈయన ఏనాడో తన విశ్వసనీయతను కోల్పోయారు. ఈ మాట అనడానికి పెద్ద సంకోచం ఏమీ అక్కర్లేదు. అశాంతిని తగ్గించడానికి వాతావరణం మార్చేవాడు సమాజహితుడు. పెట్రోల్ పోసి మరింత మంట పెట్టేవాడు ఇవాళ్టి లెఫ్ట్ మేధావి.

మనమూ వలస పోతున్నాం, వాడూ వలస వస్తున్నాడు. కడుపు కోసం. అంతేతప్ప, వనరుల దోపిడీ కోసం కాదు, అధికారం కోసం కాదు వాడి మీద ద్వేషం పెంచడం ఏమిటి? హరగోపాల్‌కు సూటిగా ఓ ప్రశ్న. మార్వాడీల నోట్ల కోసం కక్కుర్తి పడుతున్నవాళ్లెవరు? ప్రజల వోట్లను పణంగా పెడుతున్నది ఎవరు? మార్వాడీలు ఇప్పుడే కాదు, ఏనాటి నుంచో ఈ గడ్డకు తమ కడుపు నింపుకోవడం కోసం వస్తున్నారు. ఒక నిజాన్ని అంగీకరిద్దాం. స్థానిక వ్యాపారుల పొట్టగొట్టేలా వారు విస్తరిస్తుంటే



# నిరర్థక నినాదం! గో బ్యాక్!

వ్యతిరేకిద్దాం. సర్దుబాట్లు చేద్దాం. ఆమనగల్లులో జరిగింది అదే.

కొన్నేళ్ల క్రితం ఓ ఒప్పందం కుదిరిందక్కడ. మా పొట్టగొట్టేలా మీ దుకాణాలను విస్తరించొద్దు అని వర్తకసంఘాలు అడిగాయి. వాళ్లు అంగీకరించారు. కానీ ఉల్లంఘించారు. అదీ తాజా మార్వాడీ గోబ్యాక్ నినాదం వెనుక అసలు కారణం.

ఇంకేముంది? ఎవరెవరో రంగప్రవేశం చేశారు. ఉసిగొల్పారు. అశాంతిని సృష్టించడానికి మీడియాలో, సోషల్ మీడియాలో రకరకాల ప్రయత్నాలు చేశారు. బీజేపీ నాయకుడు, కేంద్రమంత్రి బండి సంజయ్ చెబుతున్నట్టు వాళ్లు రొహింగ్యాలు కాదు. బాంగ్లా, పాకిస్తాన్‌ల నుంచి వచ్చిన అక్రమ వలసదారులు కాదు. అశాంతి, అలజడులు రేపేవాళ్లు అసలే కాదు. అది వాళ్ల నైజం కూడా కాదు.

ఈరోజు ఏ కులవృత్తి చూసినా ఆ కులేతరులు ఎక్కువగానే కనిపిస్తున్నారు. ఆమనగల్లు వర్తకసమాజం ఓ ఒప్పందం కుదుర్చుకుంది, సరైన దిశ. కానీ మార్వాడీలు ఉల్లంఘించారు, అది తప్పు, తప్పున్నర. ఎక్కడి నుంచో బతకడానికి వచ్చినవాడు మన పొట్ట కొడుతుంటే ఎవడు ఊరుకుంటాడు? ఆగ్రహం సహజం. ఇదుగో ఇక్కడే మార్వాడీ సమాజం (రాజస్థాన్, గుజరాత్ ఏ రాష్ట్రమైనా సరే) తన తప్పు తెలుసు కోవాలి. స్థానిక వ్యాపారులు, స్వర్ణకారులతో కలిసి బతకాలనే సోయి అవసరం. అసలు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలు వచ్చాక సగటు గ్రామీణ వర్తకుడే కాదు, పట్టణాల్లోని వర్తకుడే కిందా మీదా పడుతున్నాడు.

తన కడుపు నింపుకోవడానికే కష్టమవుతోంది. ఈ స్థితిలో మార్వాడీలు కూడా పొట్టగొడితే అది అన్యాయం, దుర్మార్గమే. జీఎస్టీ ఎగవేస్తారు, నాసిరకం అంటగడతారు అనే ప్రచారాల్ని పట్టించుకోకపోతే మార్వాడీలు అధికారం కోసమో, పెత్తనాల కోసమో అంగలార్చడం లేదు.

మేమిక్కడికి బతకడం కోసం వచ్చాం అనే సోయిని కలిగి ఉంటే పర్లేదు. భిన్నంగా వెళ్తే ఇదుగో ఇలాగే మంటలు పెట్టేవాళ్లు ఉంటారు. ఆమనగల్లులో ఏం జరిగింది? బంద్ నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంది.

ఈ ఆమనగల్లు బంద్ తెలంగాణ వ్యాప్తంగా అవాంఛనీయ పరిస్థితులు తెస్తుందనే భావనతో ప్రభుత్వం పోలీసులను పంపించింది. కానీ సయోధ్య కుదిరింది, బంద్ లేదు. అంతా ప్రశాంతం. మంటలు పెచ్చరిల్లాలని చూసిన అసాంఘిక శక్తులకు చుక్కెదురు.

ఇక్కడ ప్రధానంగా వైశ్య సంఘాలు (వర్తక సంఘాల్లో ఎక్కువ వాళ్లే కాబట్టి) సంయమనం పాటించాలి. అసాంఘిక శక్తులకు ఊతమిచ్చేలా వ్యవహరించ కూడదు. ఈరోజు మార్వాడీ గోబ్యాక్ అని మీరంటే, రేపొద్దున మీరు ప్రోత్సహించే శక్తులే కోమటీ గోబ్యాక్ అనే ప్రమాదమూ ఉంటుంది. బహుపరాక్. కొద్దికాలం క్రితమే 'కోమటోళ్లు దొంగలు' అంటూ పచ్చిగా వాగిన ఒక ప్రొఫెసర్ గురించి గుర్తు చేసుకోండి. ఇలాంటి విచ్ఛిన్నకర శక్తులు పొంచి ఉంటాయి. ఇది భారతీయ సమాజానికి శాశ్వత ప్రమాదమే కూడా.

ఇప్పుడు భారతదేశంలో సంక్షోభం సృష్టించడానికి అనేక మార్గాలలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. గుజరాతీ గులాములు అంటూ ఒక పార్టీ నాయకులను విమర్శించడం అందులో భాగమే. కాబట్టి ఇలాంటి ఘర్షణల వెనుక పెద్ద కుట్రలే ఉన్నాయి. ఇది పరోక్షంగా నరేంద్ర మోదీపై దాడి కూడా. రాజ్యాంగాన్ని రక్షిస్తున్నామంటూనే ఇలాంటి చర్యలు దిగుతున్న వర్గాలు ఉన్నాయి. క్రైస్తవం కూడా ఇందుకు దోహదం చేస్తున్నది. ఇవన్నీ చేదు వాస్తవాలు. తెలంగాణ సోదరులు కూడా పొరుగు రాష్ట్రాలలో జీవిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వారు కూడా అంతే. బిహారీలు ఇక్కడ విరివిగా కనిపిస్తున్నారు. ఈ వాస్తవాలు ఇలా ఉండగా ఒక ప్రాంతం వారు వేరే ప్రాంతం నుంచి వచ్చి బతుకుతున్న వారిని గోబ్యాక్ అని వెంటాడడం దేశానికి ప్రమాదం. పైగా ఇలాంటి ఉద్యమాలు ఏవీ నిలబడలేదు. నాయకులు బాగుపడ్డారు. అంతవరకే. ఇప్పుడూ అదే జరుగుతుంది. భారతీయ ఓటర్ల జాబితాల నుంచి రొహింగ్యాలను, బాంగ్లాదేశీయులను, పాకిస్తానీలను ఏరివేస్తున్న తరుణంలో ఇలాంటి ఒక అలజడి దక్షిణ భారతంలో రావడం కూడా ప్రశ్నలు రేకెత్తించేదే. మార్వాడీలు గుజరాత్, రాజస్థాన్‌లకు వెళ్లాలని ఇక్కడ స్వయం ప్రకటిత ఉద్యమకారులు నినాదం. అందులో ఉత్తర భారతం, దక్షిణ భారతం వంటి ఆత్మహత్యా సదృశమైన జాడ కూడా ఉంది. కాబట్టి దీనిని సాధారణ అంశంగా చూడవద్దు.

సమాజాన్ని చీల్చే కుట్రలు ఇవన్నీ. ఇప్పటిదాకా ఉన్న గొడవలు చాలవని, ఇంకా ఇంకా చాలామంది కొత్త సమస్యలు, పరిస్థితులు తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. బహుపరాక్..!! ఈ మార్వాడీ అంశాన్ని తెలంగాణ సొసైటీలో మరింత అశాంతి రేపడానికి ప్రయత్నించిన రాజకీయ, అసాంఘిక శక్తులకు తాత్కాలిక సెట్‌బ్యాక్. కానీ అవి ఊరుకోవు!! జాగరూకతతో ఉండాల్సింది తెలంగాణ సమాజమే..!!

**– జాగృతి డెస్క్**



# పరోక్షంగా భారత్‌కు సహకరిస్తున్న ట్రంప్!



**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ బహుమతి తిక్క ముదిరి 'పిచ్చి' స్థాయికి చేరింది. దౌత్యనీతిని పక్కనబెట్టి ఆయన పూర్తి వ్యాపార ధోరణి స్వదేశీయులకే గుదిబండగా మారింది. ఆయన వ్యవహార శైలి దేశాన్ని ఏలిన మహ్మద్‌బిన్ తుగ్లక్‌ను మరోసారి గుర్తుచేస్తోంది. రాజధానిని ఢిల్లీ నుంచి దౌల్తాబాద్‌కు మార్చాలన్న తుగ్లక్ నిర్ణయం సరైందే, కానీ ఢిల్లీలోని ప్రతి కుటుంబం తరలివెళ్లాలని ఆదేశించడం పెద్ద తప్పు. తీరా అక్కడికి వెళ్లాక తిరిగి ఢిల్లీకి మార్చడం ఇంకో తప్పు. ట్రంప్ వ్యవహారశైలి సరిగ్గా ఇలాగే ఉంది!**

రష్యా-యుక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానని ప్రతిన బూని జెలన్‌స్కీతో చర్చలు జరిపి రష్యాను ఆంక్షల పేరుతో హెచ్చరించాడు. ఆ వెంటనే రష్యా అధ్యక్షుడికి రెడ్ కార్పెట్ స్వాగతం పలికి అలస్కా సమావేశంలో ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై చర్చించి, పుతిన్ డిమాండ్లకు ఓకే అన్నాడు. ఇప్పుడు జెలన్‌స్కీని భూభాగాలు వదులుకోమంటున్నాడు. ఈ తీరుతో యుక్రెయిన్, యూరోపియన్ యూనియన్ దేశాలు తలలు పట్టుకుంటున్నాయి. రష్యా యుద్ధం ఆపడానికి భారత్‌పై ఆంక్షలు విధిస్తామని బెదిరింపు! బోడి గుండుకు మోకాలికి ముడి పెట్టడమంటే ఇదే! చివరకు రష్యా-యుక్రెయిన్ యుద్ధంతో తమకు సంబంధం లేదని మరో ప్రకటన. ఇంతటి అసంబద్ధ రాజకీయ విధానాన్ని అనుసరించిన దేశాధినేతలు దాదాపుగా ప్రపంచంలో ముఖ్యంగా అమెరికాలో ఎవరూ లేరు! ఆదాయం పేరుతో 'బెదిరింపు-కాళ్లబేరం' అనే విచిత్ర దౌత్యనీతిని ప్రవేశపెట్టిన ఘనత ట్రంప్‌కే దక్కుతుంది! పైగా ఆయన ఆంక్షల బెదిరింపును ఇతర దేశాలు బేఖాతరు చేయడమే కాదు, క్రమంగా కొత్త ప్రపంచ ఏర్పాటుకు దోహదం చేస్తుందనడంలో ఎంత మాత్రం సందేహం లేదు!!

దౌత్యనీతిలో 'నేనే గొప్ప', 'నేను చెప్పిందే వినాలి' అనే విధానం ఎప్పుడూ సత్ఫలితాలివ్వదు. 'గెలువు-గెలిపించు' విధానం అనుసరించాలి. దురదృష్ట వశాత్తు ట్రంప్‌కు ఇటువంటి అవగాహన లేదు. పుతిన్-జెలన్‌స్కీల మధ్య సమావేశం ఏర్పాటు చేయడం నూనె-వెనిగర్‌లను కలపడం వంటి సంక్లిష్ట ప్రక్రియ అని ట్రంప్ అసహనం వ్యక్తం చేయడం వెనుక కారణమిదే. ఇప్పుడు యుద్ధం ముగింపు విషయంలో వీరిద్దరూ కలిసి పనిచేస్తారా? లేదా? అనే విషయం ఆయనకే స్పష్టంగా తెలియడంలేదు. దీంతో 'వైరాగ్యం' ఆవహించి భవిష్యత్తులో వీరిద్దరి మధ్య జరిగే సమావేశానికి తాను హాజరయ్యే విషయం కూడా స్పష్టంగా చెప్పలేదనడం మరో విచిత్రం. ఇప్పటికే పది యుద్ధాలు ఆపిన తనకు రష్యా-ఉక్రెయిన్ పోరు సంతోషం కలిగించడం లేదని ట్రంప్ పేర్కొనడం అసంబద్ధం. ఈయన సంతోషంతో ఆ దేశాలకు ఏం పని? రెండు దేశాలు ఎడతెగని యుద్ధంలో ఉండడాన్ని బట్టి సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలి! నిజానికి ట్రంప్ నిర్ణయాన్ని ఖాతరు చేస్తే యుద్ధం ఎప్పుడో ఆగివుండేది. కానీ పుతిన్.. ట్రంప్‌ను ఒక "జోకర్"గా పరిగణిస్తున్నారనుకోవాలి. ఇప్పటికే 20 వేల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా ఇప్పటికీ బలీయమైన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. దీన్ని ట్రంప్ గుర్తించడంలేదు. అయితే పుతిన్-జెలన్‌స్కీల మధ్య చర్చలకు అమెరికా ఏర్పాట్లు చేస్తోందని, యుద్ధాన్ని ఆపాలంటే ఇద్దరూ కొంత భూమిని వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలనేది ఆయన చెప్పే మరోమాట! త్రైపాక్షిక చర్చలకు తాను సిద్ధమేనని జెలన్‌స్కీ స్పష్టం చేస్తున్నా రష్యా చర్చలకు సానుకూలంగా ఉంటూనే, అటు దాడులను కొనసాగిస్తోంది. ఇది పుతిన్ ఆడుతున్న రాజకీయ చదరంగపు క్రీడ! ఫలితంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో ఎటువంటి పురోగతి లేదు. రష్యా తన దాడులను ఆపగపోగా, ఉక్రెయిన్‌లో అమెరికా కర్మాగారంపై రష్యా దాడి చేసిందన్న వార్తలను ఖండించడ మే కాదు.. ఇలా చేస్తే భారీ ఆంక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించడం పెద్ద "జోక్". రెండు వారాల్లో ఒక ఒప్పందానికి రాకపోతే తానే ఒక నిర్ణయం తీసుకుంటానని మరో హెచ్చరిక!! కాగా, రష్యా క్రమంగా ఉక్రెయిన్‌ను విలీనం చేసుకునే దిశగా ముందుకెళుతోంది. దౌత్యనీతి తెలియని ట్రంప్‌కు ఇదంతా అయోమయంగా ఉంది. పుతిన్ తాను స్వాధీనం చేసుకున్న ప్రాంతాలతో పాటు మరికొన్ని కావాలని డిమాండ్ చేస్తే, అందుకు జెలన్‌స్కీ అంగీకరించరు. ఇక యుద్ధం ముగిసే దెక్కడ? ఇరుదేశాలతో చర్చలు జరిపినా ఫలితం ఉండదు! మరి ట్రంప్‌కు నోబెల్ బహుమతి ఆకాంక్ష అందని ద్రాక్ష లాంటిదే.

**ట్రంప్‌కు పట్టని దౌత్యనీతి**

డోనాల్డ్ ట్రంప్ విధానాలను సునిశితంగా పరిశీలిస్తే అవి వ్యాపార సంబంధమైనవని సుస్పష్టం. ఆయన ఆదాయం పేరుతో దౌత్యనీతిని విస్మరించడంతో ప్రపంచ రాజకీయాలు పెను కుదుపులకు లోనవుతున్నాయి. ట్రంప్-పుతిన్‌లు అలాస్కాలో జరిపిన సమావేశం ఇది నిజమని నిరూపించింది. దీనికి సంబంధించి మీడియాలో వచ్చిన కొన్ని కథనాలు ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి. రష్యాపై నిప్పులు చెరిగిన ట్రంప్, ఆ దేశాధ్యక్షుడికి రెడ్ కార్పెట్ స్వాగతం పలకడం అందరినీ ఆశ్చర్యపరచింది. ఇద్దరూ యు.ఎస్. అధ్యక్షుడి కారులో ప్రయాణించడమే కాదు రెండు గంటలపాటు స్నేహపూర్వక వాతావారణంలో చర్చలు జరపడం మరో విచిత్రం. జెలన్‌స్కీతో ట్రంప్ సమావేశానికి పుతిన్‌తో జరిగిన చర్చలకు అసలు పొంతనే కనిపించదు. అన్నింటికీ మించి ఈ సమావేశం ప్రధాన అజెండా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు జరపడం. మీడియా కథనాల ప్రకారం అసలీ యుద్ధం ప్రస్తావనకు పెద్ద ప్రాధాన్యతనివ్వలేదని స్పష్టమవుతోంది. ప్రధానంగా రష్యా- అమెరికా మధ్య వాణిజ్యంపైనే దృష్టి కేంద్రీకరించినట్లు ఆ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్‌పై టారిఫ్‌ల విధింపు, మన విదేశాంగ మంత్రి జయశంకర్ రష్యా ప్రయాణం, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మనదేశంలో ఏకంగా మూడు రోజులు పర్యటించడం, ప్రధాని నరేంద్రమోదీ ఈ నెలాఖరులో చైనా పర్యటన.. వీటన్నింటిని పరిశీలిస్తే ఒకదానికొకటి సంబంధం ఉందనుకోవాల్సి వస్తోంది.

రష్యా నుంచి ఎవరూ చమురు కొనుగోలే చేయరాదని ఒత్తిడి తెస్తున్న ట్రంప్.. భారత్‌ను లొంగదీసుకునేందుకు



పుతిన్ జెలన్‌స్కీ

టారిఫ్‌లు విధించడం ద్వారా తీవ్ర యత్నం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ చమురు కొనుగోలు ద్వారా యుద్ధానికి అవసరమైన నిధులను సమకూర్చడం వల్లనే రష్యా యుద్ధం ఆపడంలేదన్నది ట్రంప్ యంత్రాంగం ఆరోపణ. మరి మనకంటే చాలా పెద్ద మొత్తంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాను ట్రంప్ తన లక్ష్యం చేసుకోవడం లేదు? కేవలం మనదేశంపైనే టారిఫ్‌ల పేరుతో ఒత్తిడి పెంచడానికి కారణమేంటన్న ప్రశ్నలు ఉదయించడం సహజమే! ఇందుకు రెండు కారణాలున్నాయి. 1. అరుదైన లోహాలు (రేర్‌ఎర్త్ మెటల్స్) చైనానుంచి ఎగుమతి అవుతాయి. ఈ రంగంలో ప్రపంచంలో చైనాదే ఆధిపత్యం. వీటి దిగుమతులు ఆగిపోతే అమెరికా సాంకేతిక రంగం మొత్తం కుప్పకూలడం ఖాయం. 2. తనపై అమల్లో ఉన్న ఆంక్షల కారణంగా అంతర్జాతీయ విపణిలో చైనా చమురు అమ్ముకోవడం సాధ్యం కాదు! ఇక మనదేశం, అమెరికాతో జరిపే వాణిజ్యంలో మన ఎగుమతులే అధికం. రష్యా



నుంచి తక్కువ ధరకే ముడిచమురు కొనుగోలు చేసి, శుద్ధి చేసి యూరప్ దేశాలకు అమ్ముతోంది. నిజానికి మనదేశం ఈ పని చేయకపోతే ప్రపంచ దేశాల్లో చమురు ధరలు విపరీతంగా పెరిగి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయేవి. ఇలా రష్యాపై ఆంక్షలు విధించిన యూరప్ దేశాలకు రష్యా చమురునే అమ్ముతూ భారత్ లాభపడటం అమెరికాకు ఎంతమాత్రం గిట్టడం లేదు. ఈ నేపథ్యంలో యుక్రెయిన్ పేరు చెప్పి మనదేశంపై 50% టారిఫ్‌లు విధించింది. ఇది పైకి కనిపించేది మాత్రమే. కానీ అసలు వాస్తవం మరోటుందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అలాస్కా సమావేశంలో ట్రంప్ ప్రధానంగా ప్రతిపా దించిన విషయం రష్యా చమురు గురించే. 'మీరు మాకు చమురు పంపండి. మేం శుద్ధి చేసి విదేశాలకు అమ్ముకుంటాం. ఇలా మీరు, మేము లాభపడవచ్చు' ఇది ట్రంప్ ప్రతిపాదన. అలా అయితే రష్యాపై విధించిన ఆంక్షలన్నింటినీ ఎత్తేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారట! ఆంక్షల వల్ల చైనా చమురు అమ్ముకోవడం సాధ్యంకాదు! టారిఫ్‌ల భయంతో భారత్ లొంగి దారికొస్తుందనేది ట్రంప్ గట్టి విశ్వాసం. అలా రష్యా చమురును కొనుగోలు చేయకుండా భారత్‌ను కట్టడి చేసి, ఇదే చమురును తాను కొనుగోలు చేసి వ్యాపారం ద్వారా లాభపడాలన్నది ట్రంప్ యంత్రాంగం వ్యూహమని స్పష్టమవుతోంది. యుక్రెయిన్ ఆక్రమించిన భూభాగాలను వదిలేసుకోవాలని పుతిన్ డిమాండ్‌ను ముందుకు తేవడంతో..'వ్యాపార' లక్ష్యంగల ట్రంప్ దీనికి అంగీకరించినట్లు ఈ కథనాలు పేర్కొన్నాయి. యూరోపియన్ యూనియన్ నేతలను వెంటబెట్టుకొని వచ్చిన జెలన్‌స్కీతో ట్రంప్ మాట్లాడుతూ.... సంధి కుదరాలంటే కొన్ని భూభాగాలను వదులుకోక తప్పదని స్పష్టం చేయడం వెనుక ప్రధాన కారణం ఇదేనన్నది ఇప్పుడు మనకు తేలిగ్గా అర్థమవుతుంది.

టారిఫ్‌ల ద్వారా భారత్–రష్యాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బతీయడం తోపాటు, చైనాకు చమురు అమ్మొద్దని...ఈ రెండు దేశాలకు అమ్మే చమురు తామే కొనుగోలు చేస్తామని ప్రతిపాదించడం ద్వారా భారత్, రష్యా, చైనాలను విడగొట్టాలని వేసిన ట్రంప్ ఎత్తుగడ ఇది! ఈ మూడు దేశాలు ఏకమైతే తన మనుగడకే కష్టమని స్పష్టంగా తెలియడంతో, ట్రంప్ చేస్తున్న "వాణిజ్య తంత్రం" ఇది! తాము చమురును పూర్తిగా కొనుగోలు చేస్తామంటూ రష్యాను కూడా తమ గుప్పిట్లోనే పెట్టుకోవచ్చు! కానీ ఈ ప్రతిపాదనకు ప్రధాన ప్రతిబంధకం జెలన్‌స్కీ. యూరోపియన్ యూనియన్ నేతలతో అమెరికా వచ్చినప్పుడు, యుద్ధాన్ని ఆపడానికి జెలన్‌స్కీ ఎంతమాత్రం ఒప్పుకోలేదు. ఇందుకు ఆయన సమస్యలు ఆయనకున్నాయి. ఒకవేళ యుద్ధం ఆగిపోయి,ఎన్నికలు జరిగినా ఈయన కచ్చితంగా గెలవడు. వచ్చే ప్రభుత్వం కేసులు పెట్టి అరెస్ట్ చేయవచ్చు. జైలుశిక్ష లేదా మరణశిక్షను ఎదుర్కొనక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చు. అందువల్ల యుద్ధం కొనసాగించాల్సిందేనేది జెలన్‌స్కీ పట్టుదల!

**ట్రంప్ అస్థిర వ్యవహారశైలి**

ఇదిలావుండగా తాజాగా ట్రంప్ మాట్లాడుతూ, రష్యా–యుక్రెయిన్ యుద్ధంతో అమెరికాకు సంబంధం లేదని బాంబు పేల్చడంతో ప్రపంచమే దిగ్భ్రాంతికి లోనైంది. 2008లో జార్జియాలోని అబ్‌ఖాజియా, సౌత్ ఒస్సెటియా ప్రాంతాలను రష్యా ఆక్రమించుకున్న నేపథ్యంలో, యూరోపియన్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడమే కాకుండా, అప్పటి నుంచి ఏటా ఐ.రా.స. భద్రతా మండలిలో రష్యాకు వ్యతిరేకంగా ఉమ్మడి ప్రకటనలు చేయడం పరిపాటిగా వస్తోంది. వీటికి అమెరికానే నాయకత్వం వహిస్తోంది. విచిత్రంగా ఈసారి యు.ఎస్. ఈ సంయుక్త ప్రకటన జారీలో పాల్గొనలేదు. ట్రంప్ ఇచ్చిన ఈ ట్విస్ట్ నుంచి ఇప్పటికీ యూరప్ దేశాలు కోలుకోలేదు. ఇందుకు ముఖ్య కారణం పుతిన్ ఆడుతున్న చదరంగం. అలాస్కాలో ఇద్దరు నేతల మధ్య ఏదో జరిగింది. ముఖ్యంగా పుతిన్ తన చాణక్యంతో ట్రంప్‌ను బుట్టలో వేసారనుకోవాలి. శాంతి చర్చలకు ఓకే అంటున్న పుతిన్ యుక్రెయిన్‌పై యుద్ధం ఆపడంలేదు. పుతిన్‌ను ఎలా అంచనా వేయాలో ట్రంప్ అనే వ్యాపారికి సాధ్యంకాదు కూడా. ఎందుకంటే ఈయనకు దౌత్య నీతి తెలియదు.

**అత్తమీద కోపం...**

రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నదంటూ భారత్‌పై టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాల్లో అస్థిరత నెలకొన్న తరుణంలో, ఇలా వాణిజ్య సుంకాలు విధింపు తప్పన్న వారిపైనా ట్రంప్ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. అమెరికా మాజీ ఎన్.ఎస్.ఏ. జాన్ బోల్టన్ నివాసంలో ఎఫ్.బి.ఐ. తనిఖీలు నిర్వహించడం ఇందుకు తాజా ఉదాహరణ. భారత్‌పై సుంకాలు విధించే ట్రంప్ తీరును ఆయన తప్పుపట్టిన మరునాడే ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. అంతేకాదు ట్రంప్ తనకు వీర విధేయుడైన సెర్గియో గోర్‌ను భారత నూతన రాయబారిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పదవి ఖాళీ అయిన ఎనిమిది నెలల తర్వాత భర్తీ అయ్యింది. భారత్‌పై ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పడంలో ఎంతమాత్రం సందేహం లేదు. భారత్‌ను రెచ్చగొట్టే రీతిలో ట్రంప్, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌ను ఆహ్వానించడం, పాకిస్తాన్ ఎగుమతులపై కేవలం 19% టారిఫ్‌లు విధించడం, భారత అధికారులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసిందన్న మాట నిజం. భారత్ కూడా ట్రంప్ టారిఫ్ బెదిరింపులకు ఎంతమాత్రం భయపడటం లేదు. నిజానికి కొన్ని దశాబ్దాలుగా నిర్మించుకుంటూ వచ్చిన ద్వైపాక్షిక

సంబంధాలను ట్రంప్ తన మూర్ఖపు వైఖరితో దెబ్బతీసే రీతిలో వ్యవహరిస్తున్నప్పటికీ ఆయనను కట్టడి చేసే వ్యూహాలను భారత్ నిశ్శబ్దంగా అమలు చేస్తూ ముందుకెళుతోంది.

**రష్యా చైనాల అండ**

టారిఫ్‌లపై అమెరికా ప్రకటన నేపథ్యంలో, మన ఆప్తమిత్రుడు రష్యా అండగా నిలిచి, ఈ టారిఫ్‌లు ఏకపక్షమని పేర్కొంది. మనదేశ ఉత్పత్తులను తమ మార్కెట్లలో అమ్ముకోవడానికి పూర్తి స్వేచ్ఛనిస్తూ రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. చైనా అవకాశమిస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు తమ ఇద్దరి మధ్య సరిహద్దు సమస్యను పరస్పరం పరిష్కరించుకుందామని చైనా ప్రతిపాదించింది. భారత్ నుంచి చమురు కొనుగోలు చేయవద్దని యూరప్ దేశాలు నిర్ణయించిన నేపథ్యంలో,చమురు కోసం ముంబయ్ వచ్చిన యు.కె.కు చెందిన నౌక ఖాళీగానే వెళ్లిపోయింది. సరిగ్గా ఆ సమయంలో మనదేశంలోని నయారా సంస్థకు చెందిన ఓడలోని చమురును యూరప్ దేశాలు తిరస్కరించగా, దానిని చైనా కొనుగోలు చేయడం అమెరికా సహా యూరప్ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. చైనా, ఆఫ్రికా, ఆసియా దేశాలలో మార్కెట్లను విస్తరించుకునే పనిని భారత్ చాపకింద నీరులా చేపట్టింది. భారత్‌పై ఆంక్షలు విధించాలని అమెరికా యూరప్ దేశాలపై కూడా ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వైపు మొగ్గు చూపి, చర్చలకు సిద్ధమవుతోంది. దీంతో అమెరికా ఎఫ్-35, రష్యా సుఖోయ్-57 విమానాల కొను గోలును పక్కన పెట్టినట్లయింది. రష్యా సహకారంతో సూపర్ సుఖోయ్ యుద్ధ విమానాల తయారీ జరుగుతున్న నేపథ్యంలో దానితో ఇబ్బంది లేదు. 120 కిలోటన్ సామర్థ్యం గల యుద్ధ విమానాలకు సంబంధించిన ఆధునిక ఇంజిన్‌ను భారత్-ఫ్రాన్స్ మనదేశంలోనే ఉమ్మడిగా ఉత్పత్తి చేయడానికి పరస్పరం అంగీకరించడం మరో తాజా పరిణామం. నిజంగా ఆత్మనిర్భర్ భారత్ సాధనకు ఇది అత్యంత కీలక నిర్ణయం. ప్రస్తుతం అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థ జి.ఇ.తో ఎఫ్414 జెడ్ ఇంజిన్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ఒప్పందంలో 80శాతం సాంకేతిక పరిజ్ఞాన బదలాయిపు అత్యంత కీలకం. ఇప్పటికే ఈ ఇంజన్ల సరఫరాలో తీవ్ర జాప్యం జరగడం, యు.ఎస్. ఏకపక్ష టారిఫ్‌ల విధింపు ఈ ఒప్పందంపై నీలినీడలు కమ్మే అవకాశం ఉంది. తాజాగా ఫ్రాన్స్‌తో కుదుర్చుకోబోయే ఒప్పందం అమెరికాకు చెంపపెట్టు లాంటిదనే చెప్పాలి. మరోవంక, జర్మనీతో పి-75ఎ జలాంతర్గాముల కొనుగోలు ఒప్పందానికి చర్చలకు సిద్ధమవుతోంది. ఈ ఒప్పందం విలువ రూ.75వేల కోట్లు. ఇలా యూరప్ దేశాల్లోని అత్యంత శక్తిమంతమైన ఈ రెండు దేశాలతో రక్షణ పరమైన వాణిజ్య ఒప్పందాల ద్వారా మనదేశం ఈయూను కట్టడి చేసినట్టే అవుతుంది. అంతేకాదు ట్రంప్ 50% సుంకాల విధింపు ప్రకటన వెలువడిన కొద్ది రోజులకే భారత్ అగ్ని-5 పరీక్ష నిర్వహించడం ద్వారా రక్షణ రంగంలో మన ఎదుగుదలను చెప్పకనే చెప్పినట్ల యింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఇటువంటి క్షిపణులు ప్రస్తుతం ఐదు దేశాల వద్ద మాత్రమే ఉన్నాయి. ట్రంప్ మనపట్ల అనుసరిస్తున్న విధానం వల్ల ఇప్పటికే అమెరికా వాణిజ్యపరంగా ఎంతో నష్టపోయింది. అలాస్కా చర్చలు విఫలమైతే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లను విధిస్తామని అమెరికా ట్రెజరీ డిపార్ట్ మెంట్ హెచ్చరించింది. మరిప్పుడు అలాస్కా చర్చలు ఫలితమివ్వలేదు. ఏం జరుగుతుందో చూడాలి. 'భారత్ నుంచి ముడి చమురు సహా వివిధ రకాల శుద్ధి చేసిన వస్తువులు ఇబ్బంది అనుకుంటే అసలు కొనవద్దు. మా సరుకులు కొనాలని మేం మిమ్మల్నేం ఒత్తిడి చేయడంలేదు. మీరు కాకపోతే వేరే దేశాలు కొంటాయి. యూరప్, అమెరికాల మాదిరిగానే భారత్ కూడా తన సరుకులను అమ్ముతోంది. అమెరికా సంప్రదాయ విదేశాంగ విధానాలకు ట్రంప్ తిలోదకాలిచ్చారు. ఏ దేశం గురించి ఆయన ఏమను కుంటున్నారో ఎవ్వరికీ తెలియదు. ఆయన సారథ్యంలో అమెరికా విదేశాంగ విధానం అగమ్య గోచరంగా తయారైంది. ఇటువంటి విదేశాంగ విధానాన్ని బాహాటంగా అమలు చేసిన అమెరికా అధ్యక్షుడిని ప్రపంచం ఇప్పటివరకు చూడలేదు”…అని మన విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. దౌత్యవేత్తగా అపార అనుభవం సొంతం చేసుకున్న ఆయన ఇలా మాట్లాడారంటే, ట్రంప్ వ్యవహారశైలితో ఎంతగా విసిగిపోయారో అర్థమవుతుంది.




**తగ్గిన వలసలు**

అక్రమ వలసల పేరుతో పెద్దఎత్తున స్వదేశాలకు తిప్పి పంపడం, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలసదారులపై విరుచుకుపడటమే కాకుండా, అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్ను దన్నుగా నిలిచేవారిపై కఠినచర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 1960 తర్వాత వలసదారుల సంఖ్య ఇంతగా తగ్గిపోవడం ఇదే ప్రథమం.

జోబైడెన్ హయాం నుంచి, ఇప్పటివరకు అమెరికా చేసే ప్రతి దౌత్య వ్యవహారం మనకు వరంగానే మారుతూ వస్తోంది. జోబైడెన్ తనయుడు హంటర్ బైడెన్ యుక్రెయిన్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. ఈ నేపథ్యంలో ఏదోవిధంగా యుక్రెయిన్‌ను తమ అదుపులోకి తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో డీప్‌స్టేట్ ఆదేశాల మేరకు సహాయం పేరుతో నాటో దళాలను యుక్రెయిన్‌కు పంపే యత్నం చేయడంతో పుతిన్ అడ్డుకున్నారు. ఫలితంగా రష్యా-యుక్రెయిన్ యుద్ధం మొదలైంది. రష్యాపై ఆంక్షల నేపథ్యంలో, ఆ దేశం నుంచి చమురును చవక ధరకే మనం కొనడం మొదలైంది కూడా సరిగ్గా అప్పుడే! ఈ చమురును శుద్ధి చేసి యూరప్ దేశాలకు అమ్మి లాభాలు ఆర్జిస్తున్నాం. ఆవిధంగా జోబైడెన్ మనకు పరోక్షంగా సహాయం చేశారు.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

భాగం-1

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం



**కరపాత్రీ స్వామిని ఆయన భక్తులు ధర్మ సమ్రాట్టుగా భావిస్తారు. ధర్మరక్షణలో భాగంగా స్వాతంత్ర్యోద్యమ కాలంతో పాటుగా... స్వతంత్ర భారతంలో కూడా జైలుశిక్షలు అనుభవించిన ఏకైక ధార్మిక స్వామి ఆయన. అరచేతినే పాత్రగా ఉపయోగించి, భిక్ష స్వీకరించే అలవాటు కారణంగా హరిహరానంద సరస్వతీ స్వామి... 'కరపాత్రీ స్వామి'గా ప్రసిద్ధి చెందారు. ఆయన 1907లో ఉత్తర ప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లా భట్నీ గ్రామంలో జన్మించారు. 19 ఏళ్ల వయసులో ఇల్లు విడిచిపెట్టారు. 1932లో సన్యాస జీవనం లోకి ప్రవేశించారు. శంకర సంప్రదాయ పీఠమైన ద్వారకా పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి నుంచి సన్యాస దీక్ష స్వీకరించారు. అద్వైత వేదాంత సంప్రదాయంలో లోతైన జ్ఞానాన్ని సంపాదించారు. 1982 ఫిబ్రవరి 2వ తేదీన శివైక్యం చెందారు.**

1940నుంచి ఆస్తికులను ఏకం చేసే ఉద్దేశ్యంతో అనేక ఉద్యమాలు నిర్వహించారు. ధర్మవీర దళము, సనాతన దళము వంటి సంఘాలను స్థాపించారు. అఖిల భారతీయ రామరాజ్య పరిషత్, హిందూ మహాసభ, జనసంఘ్ మొదలైన సంఘాలకు కూడా అధ్యక్షత వహించారు. 1943లో జమ్మూ-కశ్మీర్‌లో గొప్ప ఉద్యమం చెలరేగింది. ఆ ఉద్యమంలో పాల్గొన్నందుకు గానూ శ్రీస్వామి కరపాత్రీజీ మహరాజ్ ఢిల్లీలో కారాగారంలో ఉంచారు. 1947లో గోవధ నిషేధానికి పోరాడి అరెస్టయ్యారు. ఆయన చేపట్టిన ఉద్యమాల వల్ల స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అనేకసార్లు జైలుశిక్షలు అనుభవించాల్సి వచ్చింది. 1966లో గోరక్షణ ఉద్యమం చేపట్టి అరెస్టయ్యారు. తీహార్‌లో జైలు జీవితాన్ని అనుభవించారు. భారతదేశంలో గోవధ నిషేధం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. ధర్మశాస్త్రాల రక్షణ కోసం, అనేక గ్రంథాలను రచించారు. ఆయన రచించిన 'మార్క్స్ వాదము – రామరాజ్యము' అనే గ్రంథం ఆ రోజుల్లో ఎన్నో సంచలనాలకు కారణమైంది. ఈ గ్రంథాన్ని గీతాప్రెస్ వారు ప్రచురించారు.

అందులోని వివరాల ప్రకారం... కరపాత్రీ స్వామి 1943లో ఢిల్లీ జైలులో ఉన్నప్పుడే వారికి కమ్యూనిస్టు సాహిత్యం లభ్యమైంది. దానిని బాగా అధ్యయనం చేసిన తరువాత ఆయన సంస్కృతంలో కమ్యూనిజంపై ఒక సుదీర్ఘమైన వ్యాసాన్ని రాయడం ఆరంభించారు. కానీ కారాగారంలో ఉండగా ఆ వ్యాసాన్ని పూర్తి చేయలేకపోయారు. ఆ తరువాత ఆ వ్యాసం సంస్కృతంలో ఉంచేకంటే... హిందీలోకి అనువదించి, మిగిలిన భాగాన్ని కూడా పూర్తి చేస్తే... అంతకంటే ఎక్కువమంది ప్రజలకు చేరువ అవుతుంది అనిపించింది.

ఫిబ్రవరి 1955లో ప్రయాగ కుంభమేళా నుండి తిరిగి వచ్చిన తర్వాత, ఆయన కాశీలోని శ్రీవిశ్వనాథ ఆలయం వద్ద సత్యాగ్రహానికి కూర్చున్నారు. అప్పుడు మళ్లీ అరెస్టు అయ్యి, జిల్లా జైలుకు వెళ్లారు. అక్కడ ఆ వ్యాసాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు మళ్లీ మొదలయ్యాయి. కమ్యూనిస్టు సాహిత్యానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు జైలుకే అందుతుండేవి. జైలు అధికారులు కూడా రాతపనికి అనేక సౌకర్యాలు కల్పించారు. రోజంతా సందర్శకుల ప్రవాహం కొనసాగుతూ ఉండేది. దాంతో వారికి జైల్లో కూడా అంతగా తీరిక దొరకకపోయినప్పటికీ రచనలో కొంత పురోగతి కనిపించింది. ఒక నెల తర్వాత, ప్రయాగ హైకోర్టు ఆయన అరెస్టును చట్టవిరుద్ధమని, ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. అయితే 'ఉత్తరప్రదేశ్ సామాజిక అసమానతల నివారణ చట్టం' ప్రకారం పెట్టిన కేసులో విచారణ కొనసాగాలని కూడా కోర్టు ఆదేశించింది. జైలు నుంచి విడుదల కాగానే మళ్లీ ప్రయాణాలు మొదలుపెట్టారు. దాంతో వ్యాసం రాసే పని మళ్లీ ఆగిపోయింది. ఆ సంవత్సరం శ్రీచరణులు శ్రీకరపాత్రీ స్వామి తమ చాతుర్మాస్య దీక్షను కాశీలోని దుర్గాకుండ్ వద్దనున్న శ్రీధర్మసంఘ శిక్షామండలంలో నిర్వహించారు. చాతుర్మాస్యంలో స్వాములు ప్రయాణాలు చేయకుండా ఒకేచోట ఉంటారు. దాంతో కొంత అవకాశం లభించింది. కాబట్టి రచన మరికొంత ముందుకు సాగింది.

అప్పట్లో 'సిద్ధాంత్' అనే పేరుతో ఒక వారపత్రిక ఉండేది. ఆ పత్రిక మూడేళ్లుగా మూతబడి ఉంది. దానిని మళ్లీ పక్షపత్రికగా పునరుద్ధరించి, స్వామివారు ఈ రచన చేస్తున్న సమయంలోనే ప్రచురణ ప్రారంభించారు. అందులో ఈ రచన ముద్రిత మవుతూ ఉండేది. దాంతో ఈ వ్యాసం విస్తృతి క్రమ క్రమంగా పెరగజొచ్చింది. మూల చర్చతో పాటుగా అనేక అంశాలు వరుసగా చర్చకు వస్తుండడంతో వాటన్నింటినీ కూడా రాయవలసి వచ్చింది. చాతుర్మాస్యం ముగిసిన కొద్దిరోజులకే శ్రీవిశ్వనాథ ఆలయ సత్యాగ్రహానికి సంబంధించిన కేసులో నెల రోజులు జైలు శిక్ష పడింది. జైలు నుంచి కూడా రచనను కొనసాగించారు. జైలులో తనను చూడడానికి వచ్చిపోయే విద్వాంసులతో ఆయన దీనికి సంబంధించిన చర్చలే చేస్తుండేవారు. రోజులు గడిచేకొద్దీ ఈ అంశాన్ని మార్క్సిస్టు భావజాలానికి, లేదా వారు చెప్పే తత్త్వశాస్త్రానికి పరిమితం చేయలేమని అర్థమైంది. మార్క్సిస్టులు మొత్తంగా పాశ్చాత్య దర్శనాలన్నింటినీ వ్యతిరేకించారు. అలా వ్యతిరేకించడం ద్వారానే తమ మతాన్ని వారు స్థాపించుకున్నారు. దానిపై వేరుగా మరో పుస్తకమే రాయాల్సి ఉంటుంది. ఈ కోణంలో ఇందులోకి అనేక విషయాలు కూడా జొరబడజొచ్చాయి.

ఈ పుస్తకంలో పాశ్చాత్య మతాల సిద్ధాంతాలతో పాటుగా స్వపక్షాన్ని బలంగా సమర్థించేలా ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. భారతీయ దర్శనకారుల గ్రంథరచనా శైలి ఎటువంటిదంటే... ముందుగా మన సిద్ధాంతాలను వ్యతిరేకించే పూర్వపక్షాలను పేర్కొని, వాటిని ఖండిస్తూ లేదా మన సిద్ధాంతానికి అన్వయిస్తూ ఉత్తరపక్షాన్ని పేర్కొంటారు. ఈ పుస్తకంలో కూడా అటువంటి శైలినే శ్రీస్వామి అనుసరించారు. ఈ పుస్తకాన్ని చదవడం వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, రెండు వైపుల సమగ్ర జ్ఞానం లభిస్తుంది. అయితే, చదవడానికి ఓపిక, జిజ్ఞాస అవసరం. కేవలం కొన్ని పేజీలను తిరగవేయడం లేదా ఒకటి రెండు అధ్యాయాలు చదవడం ద్వారా ప్రతిపాదిత విషయం గురించి పూర్తి జ్ఞానం సంపాదించలేము.

**(వచ్చేవారం సత్పురుషులకు ఒక విన్నపం)**

**మూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**



**తీరాంధ్ర ప్రాంతంలో పంచారామాలు – అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట. శివుడు త్రిపురాసురులను జయించి, వారి ఇష్టలింగాన్ని భగ్నం చేసినప్పుడు, అది ముక్కలై ఈ ఐదు చోట్ల పడగా ఆరామాలు వెలిశాయి. భూగోళశాస్త్రజ్ఞుడు టాలమీ "త్రిలింగోన్" గురించి ప్రస్తావిస్తాడు. ఇది త్రిలింగ లేక ఆంధ్రదేశమని భావిస్తారు. త్రిలింగాలలో చివరిది ద్రాక్షారామం. మరొకటి శ్రీశైలం. చివరిది కాళేశ్వరం. ద్రాక్షారామంలో లభ్యమయ్యే మొత్తం శాసనాలు 387. రాజమండ్రి మ్యూజియం స్తంభ శాసనం ఈ ప్రదేశాన్ని "భీమాపురము, డాకరేమియు, సమాడాల, గుడిపూండియు, బాలుకొలన" అని పేర్కొంటుంది. ఈ వర్ణనలో పాలకొలన అంటే పాలకొల్లు, (ప॥గో॥జిల్లా) గుడిపూడి (గునుపూడి-భీమవరం) అమాడాలు-(అమరావతి) డాకరేమి (ద్రాక్షారామము) భీమాపురము (చాళుక్య భీమవరం) సామర్లకోట.**

**భీ**మ మండలం చరిత్ర ఆ ఆలయం మీది శాసనాలలో ప్రతిబింబిస్తున్నది. ఈ ప్రాంతపు ముఖ్య పట్టణం ద్రాక్షారామం. ఈ ఆలయంలోని లింగం చాలా పెద్దది. భీమలింగం అని పిలుస్తారు. భీమేశ్వరుడు కేంద్రంగా ఉన్న ప్రాంతం గనుక భీమమండలమని పిల్చారు. శివుని మామగారైన దక్షప్రజాపతి కేంద్రంగా ఈ పట్టణాన్ని భావిస్తారు. దక్షుడి ముఖ్య పట్టణం గనుక ద్రాక్షారామం. శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో ఈ మండలపు వర్ణన ఉంది. ద్రాక్షారామం, జననాథపురం, డాకరేమి అలా వరసగా ఆ ప్రదేశానికి చెందిన మత, రాజకీయ ఆర్థిక ప్రాముఖ్యాన్ని తెలుపుతాయి. చాళుక్యరాజు మొదటి భీమునికి జననాథుడనే బిరుదు ఉన్నది. కనుక జననాథుడు స్థాపించిన ఈ జనవాసానికి జననాథ పురమనే పేరు ఉన్నది. భీమేశ్వరాలయానికి చెందిన తొలికాలపు శాసనం శా॥ 960 నాటిది. కనుక 1038 కల్లా ఆ ఆలయం వ్యవస్థీకృతమైందని తెలుస్తున్నది. నన్నయ్య మహాభారతంలోనూ, అలాగే విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది.

"తూర్పు దక్షిణాన సముద్రం పశ్చిమాన గోదావరి నది, ఉత్తరాన పిఠాపురం వద్ద నున్న ఏలేరు నది దీనికి ఎల్లలు" అని శ్రీనాథుడు చెప్పాడు. ఈ ప్రాంతాన్ని సప్తగోదావరి మండలమని కూడా పిలుస్తారు. గోదావరి ఇక్కడ ఏడుపాయలుగా విడిపోయింది. వృద్ధ గౌతమి, గౌతమి, వాశిష్ఠి, కౌశికి, ఆత్రేయి, వైనతేయి, తుల్యభాగాలు. వీటితో ఈ ప్రాంతం సారవంతమైంది. ఈ ప్రాంతాన్ని వేంగి చాళుక్యులు, చాళుక్య–చోళులు, కల్యాణీ చాళుక్యులు, వెలనాడు నాయకులు, కాకతీయులు, తూర్పు గాంగులు, ఒరిస్సా గజపతులు, రాజమండ్రి రెడ్డిరాజులు, విజయనగర రాజులు పాలించారు. ముసునూరి ప్రోలయ నాయకుడు విలస దాన శాసనం వేయించాడు. దానివలన మధ్యయుగంలో ఆంధ్రప్రాంత ఇస్లాం దాడులు, పాలకులు– దేవుడిని, బ్రాహ్మణులను, గోవులను కాపాడ ప్రయత్నించారో తెలుస్తుంది. ఈ దిశగా జరిగిన సేవ వర్ణ వ్యవస్థలో గణనీయమైన మార్పు తెచ్చి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది.

మొదటి కులోత్తుంగుడు (క్రీ.శ.1115) ద్రాక్షారామంలో వేయించిన శాసనంలో 'పసులు' అని ఉంది. కె.ఈశ్వర్‌దత్తు కొన్ని శాసనాల్లో 'మోదాలు' అన్న మాట ఉందని రాశారు. దాని అర్థం పాడియావులు. నేల విషయానికి వస్తే 'కుల్యారామ భూమి' అంటూ తోటలను ప్రస్తావించారు. అంటే కాలువ నీటిని ఉపయోగించి పెంచిన మామిడి, అరటి మొదలైన తోటలు. సాగునీటి వనరుల పరిధిలో ఉంటే భూమిని ఉదక ప్రదేశమని, ఊడ్పునేల అని పిలిచేవారు. అంటే నీటి వనరుతో సాగులో ఉండే భూమి. రాజేంద్ర చోడ చతుర్వేది మంగళం లాంటి ప్రాంతాలలో ఇలాంటి సాగు జరిగిందని, సాగులో 102 మంది కలిసి పాల్గొన్నారని ఒక శాసనం చెపుతున్నది (పేజీ–84).

పురోహితుడు, వండునది (వంట మనిషి) గుడి కొలువు (గుడి సేవకుడు) ఆలయ ఆధిపత్యంలోని సంస్థలలో పనిచేసే సభ్యులు, అక్కసాలి (వడ్రంగి) తమ సేవల ద్వారా వ్యవసాయేతర వస్తువులను ఉత్పత్తిలో 'పంచాణం వారు'అనే నికాయం చురుగ్గా పాల్గొన్నట్లు తెలుస్తుంది. పంచాణం అంటే వడ్రంగి, కంచరి, కంసాలి, కమ్మరి, వడ్డరి అను ఐదు కులాల సంఘం. ఆంధ్రదేశపు మధ్య యుగ శాసనాల్లో తరచుగా కన్పించే చేతి వృత్తుల వారి సంఘం (అమరావతి శాసనం).

భీమ మండలంలో వస్తు మార్పిడి విధానం కన్పిస్తుంది. ఆలయ సేవకుల సేవలను బియ్యం లేక తృణధాన్యాల రూపంలో కొలిచేవారు. భూములను పుట్టి, తూము, పందుము, ఏదుము, కుంచముల లెక్కలలో కొలిచేవారు. దక్షిణ భారతదేశంలోని భూమిశిస్తు పంటలో ఆరవభాగం. అది ధర్మశాస్త్రాల ప్రభావం వలన ఏర్పడినది. కాని క్రీ.శ.1324 ప్రాంతంలో ముస్లింల ఆరాచక సమయంలోనూ, తరచు స్థానిక నాయకులు దాడి చేయడం వలన భద్రతకు భగ్నం కలిగింది. కనుక సముద్ర వ్యాపారం కొనసాగలేదు.

ఆంధ్రదేశ చరిత్రలో క్రీ॥శ॥ 11–15 శతాబ్దాల నడిమ గణనీయమైన మార్పులను చూసింది శూద్రులు రాజకీయాధికారం సంపాదించడం, దాతలుగా పరిపాలనాధికారులుగా ఆలయంలో వారి పాత్ర, వృత్తి సంఘాల వికాసం, భూస్వామ్య పద్ధతి

# నాటి వ్యవస్థకు

పాలనవ్యవస్థ మొదలైన లక్షణాలు పదకొండవ శతాబ్ది అనంతరకాలాన్ని అంత ముందటి కాలం కంటే భిన్నమైనదిగా గుర్తించడానికి కచ్చితమైన ఆధారాలున్నాయని ప్రొ॥ సి.సోమసుందరరావు (శాసన పరిశోధకులు) అభిప్రాయపడ్డారు. ఈ కాలంలో అన్ని వర్గాల ప్రజల నుండి ఈ రుషి సంస్కృతి భక్తులను ఆకర్షించింది. ద్రాక్షారామంలోని సప్తర్షులు, అరుంధతీ విగ్రహాలు ఈ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయని పొ॥ కృష్ణకుమారి (చరిత్రకారులు) అభిప్రాయపడ్డారు. ఈ కాలంలోనే మహాకవి శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో పంచారామాల మూలాన్ని వివరించే ప్రయత్నం చేశారని దానిలో ద్రాక్షారామం ఒకటని ఆచార్య కొల్లూరి సూర్యనారాయణ (పురావస్తు శాస్త్రవేత్త) వివరించారు.

సంక్రాంతి, సోమగ్రహణం, వ్యతీపాతం, సూర్యగ్రహణం మొదలైన పవిత్రదినాల్లో దానం చేసేవారు. అఖండ దీపం కోసం దానం ముఖ్యమైనది. ఎన్నో శాసనాలు అఖండ దీపదానాన్ని తెల్పుతున్నాయి. సుమారుగా అన్ని వర్గాలవారు దానాల ద్వారా భగవంతునికి సేవ చేశారు. అయితే బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేసిన సందర్భాలేవి ద్రాక్షారామ శాసనాలలో కన్పించలేదు.

వైశ్యులను శాసనాల్లో పేర్కొన్నారు. కమ్మకోమట్లు, వైశ్యముఖ్యులు, వైశ్యకులాబ్ది చంద్రులు, బచ్చులు అని పేర్కొన్నారు. వీరందరూ పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నుండి వచ్చినవారుగా చెప్పుకుంటారు. వీరిని పెనుగొండ నాథులనీ, పెనుగొండ వాస్తవ్యులనీ అంటారు. కొందరు రాజులు వైశ్యులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని శాసనాలు

# కేంద్రం దేవాలయం



చెబుతున్నాయి. కులోత్తుంగ గొంకరాజు సన్నిహితుడు భట్టిప్రోలి గోపతిసెట్టి అలాంటి వారే.

శాసనాలు శూద్రుల్లో కొన్ని ఉపకులాలను పేర్కొన్నాయి. అగసాలె వారిని సౌవర్ణకారులని, బలిజ కులం వారిని పంచమూల గోత్రీకులుగా పేర్కొన్నాయి. బోయల ప్రస్తావన ద్రాక్షారామ శాసనాలలో సర్వసాధారణం. అఖండ దీప నిర్వహణ సందర్భంలో బోయల ప్రసక్తి వస్తుంది. ఒక అఖండ దీపం కోసం యాభై పాడియావులను దానం చేస్తారు. ఈ పశువులను బోయిల సంరక్షణలో ఉంచుతారు. విజయాదిత్యుని కాలంలో (క్రీ॥శ॥ 848-891) పన్నెండు బోయ కొట్టాల ప్రస్తావన ఉంది. ఇక్కడ తప్ప తక్కిన ఆరామాల్లో బోయల ప్రస్తావన దాదాపు శూన్యం.

బహు భార్యత్వం నాటి సాంప్రదాయం. అనంతవర్మ ఐదుగురు భార్యలనూ శాసనాలు పేర్కొన్నాయి. రాజ్య ప్రయోజనాల కోసం వివాహాలు సర్వసాధారణం. వేంగీ చాళుక్యులు, కాకతీయుల వంటి సార్వభౌములు కూడా రాజకీయపరమైన వివాహ సంబంధాలు చేసుకున్నారు. వేంగీ చాళుక్యులు వరసగా మూడు తరాలు చోళులతో వివాహ సంబంధాలు అందుకున్నారు. అదేవిధంగా కాకతీయ గణపతి దేవుడు తన కుమార్తెలను నిడదవోలు చాళుక్యులకూ, నతవాడి విషయానికి చెందిన కోట వంశీయులకు ఇచ్చాడు.

స్త్రీల విషయానికొస్తే 13వ శతాబ్దపు స్థానిక ప్రభువుల భార్యలు, స్త్రీలు రాణులుగా, రాకుమార్తెలుగా, దాతలుగా దేవాలయంలో దర్శనమిస్తారు. శాసనాలలో స్త్రీలను బోధించే సాధారణ పదం 'సాని'. ఈ పదానికి సంస్కృత మూలం "స్వామిని". స్వామిని అంటే రాజు భార్య లేక ఉంపుడుగత్తె. దొరసాని, ఒజ్జిసాని, పూజారిసాని, సోమిసాని వంటి ప్రయోగాలు కన్పిస్తున్నాయి. కాని సాని పదం తరువాతి శతాబ్దంలో వేశ్యను బోధిస్తుంది. అమరనాయకుని కుమార్తె సత్యసాని దండనాయక చోడప నాయకుని తల్లి కొమ్మసాని (క్రీ॥శ॥53), చోడప నాయకుని భార్య కామసాని (క్రీ॥శ॥1180), కడియం మాచినేని భార్య పోతసాని (క్రీ॥శ॥53). ద్రాక్షారామ శాసనాలు కమ్మర్లు, సెట్లు, చాకళ్లు, క్షురకులు, కుమ్మరి, వడ్రంగి మొదలగు వృత్తివర్గాల వారిని పేర్కొన్నవి. వృత్తివర్గాలతో మరొకటి, వ్రాయసగాండ్రు. వీరు స్వర్ణకార వృత్తికి చెందిన ఆచారి ఓజు, బట్టుడు వంటి ఉపనామాలతో ఉంటారు. భీమ మండలం భూస్వామ్య సమాజం కాదనీ, హిందూమత నిర్మాణ అవశిష్ట లక్షణాలు, బ్రాహ్మణేతర విభాగాల స్వాభిప్రాయ ప్రకటన కాంక్షతో కలిసి సమాజాన్ని నవ్యప్రాచీన సమాజమనడానికి తగిన సామాజిక లక్షణాలు అందిస్తున్నాయని డా॥ ఆర్.చంపకలక్ష్మి అభిప్రాయ పడ్డారు. రక్షణ, పౌర పరిపాలనకు సంబంధించిన అధికారులను గురించి శాసనాలు ప్రస్తావిస్తాయి. దండనాయక, సమస్త సేనాపతి, సాహిణి, గజ సాహిణి, చమూనాథ లాంటి పదాలు సైన్యాన్ని నియంత్రించే అధికారులను తెలియపరుస్తాయి. గ్రామస్థాయిలో కార్య నిర్వాహకాధికారులను రట్టడ్లు, కరణాలు, తలారి అంటారు. రట్టడ్లు ఆదాయానికి బాధ్యత వహించే అధికారులు. వీరే గ్రామ కరణాలు, శ్రీ కరణాలు, కర్మకరణాలు. కర్మకరణాలు గ్రామానికి సంబంధించినవారు కాగా, శ్రీ కరణాలు దేవాలయం వంటి సంస్థలకు చెందినవారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షకుడు తలారి. పాలకులకు లేక వారి సహాయకులకు కర్షకులు దాస్యం నెరపినట్లు ఎక్కడా లేదు.

ఆంధ్రప్రాంతంలో రాజ్యతంత్ర స్వభావం నవ్య ప్రామాణిక లక్షణం కలిగి ఉందని చెప్పవచ్చును. స్వయం ప్రతిపత్తి కలిగిన కేంద్రీకృత రాచరికం ఉంది. ప్రభువుకు, రాజ్యానికి స్థానిక స్థాయిలో నాయకుల విశ్వసనీయత రాజకీయ ప్రయోజనంపై ఆధారపడి ఉంటుంది. బలహీన వ్యాపారం, వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి ఉన్న ఒక ఆర్థిక దృష్టి కోణపు రాజ్యతంత్ర స్వభావాన్నిక్కడ చూడవచ్చును. శివ, విష్ణువులు ప్రధాన దేవతలయ్యారు. శంకరాచార్య, రామానుజాచార్య తదితర మత సంస్కర్తలు ప్రతిపాదించిన హిందూమతం ఒక నూతనోత్సాహాన్ని పుంజుకుంది. ప్రజల ఊహలను కూడా ఆక్రమించుకొని ఈ నవ్య హిందూ మతోత్థానానికీ, బౌద్ధ జైనాల క్షీణతకు కారణమై ప్రజల మత జీవనంలో వేళ్లూను కొంది. గుడి ఒక ప్రత్యేక అంగం కావడం వల్ల అది సామాజిక వర్తనకు కేంద్రంగా అభివృద్ధి చెందింది. వస్తు,ధనరూపమైన సంపత్తి దేవాలయంలోనికి ప్రవహింపసాగింది.

శాసనాల్లో పేర్కొన్న కొన్ని ఉత్సవాల్లో తొంట్యోత్సవం, పంది ఉన్నాయి. తొంట్యోత్సవాన్ని తాటి వనంలో నిర్వహిస్తారు. పంది ఉత్సవాన్ని "మహా ఖేటక ఉత్సవం" అన్నారు. కాని వివరాలు తెలియవు. కొందరు దాతలు జయగొండ చోడియం వారు, స్మియం దేవి, కల్యాణదేవి, లీలావతీదేవి, రాజలదేవి, పద్మలదేవి, లావణ్యవతీ దేవి మొదలైన గాంగవంశపు రాణులు, చిన్నరాజ వంశీల అంతఃపుర స్త్రీలు, ప్రెగ్గడలు, దండనాయకులు కూడా దానాలు చేశారు. దానాలు చేసిన ఇతరవర్గాలలో ముఖ్యమైనవారు రెడ్డి, కమ్మ, బలిజ, దేవాంగ, కంసాలి, కమ్మర మొదలైన వారితోపాటు బోయలు కూడా దానాలు చేసినట్లు శాసనాధారాలున్నాయి.

**మూలం:**


**1.** శాసనాల్లో శ్రీ భీమేశ్వరాలయం చరిత్ర బై జాస్తి దుర్గాప్రసాద్ (తెలుగు అనువాధకులు) కాకాని చక్రపాణి, దుర్గంపూడి చంద్రశేఖరరెడ్డి పేజీ-9,11, 19, 21. **2.** వెలుగు : మేగ్‌జైన్, **3.** భారతి XXV-1 **4.** శ్రీనాధుని : భీమేశ్వరపురాణం (పేజీ.76) అశ్వాసం. **5.** ఎమ్.కృష్ణకుమారి, పంచారామా ఇన్ మిడివల్ ఆంధ్రా (పేజీ 26,27). 4. History of Indian Agriculture (1200 AD onwards) P 110 (Madras Agricultral Journal) by G.Jogi Raju





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు



హెలెన్ కెల్లర్

ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని. అధ్యాపక, అధ్యాపకురాలు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం. అంతర్లీనంగా ఉపాధ్యాయినీ దినోత్సవం కూడా. గురుపత్నినే ఉపాధ్యాయినిగా భావించిన సంస్కృతి మనది. విద్యాబోధనకు, కుటుంబ వ్యవస్థకు అంతటి అవినాభావ సంబంధం. కాలక్రమంలో ప్రత్యేకత సంతరించుకుంది ఉపాధ్యాయినీ వృత్తీ, ప్రవృత్తీ. టీచర్ అంటే ఉపాధ్యాయిని అని ఇప్పటి విస్తృత అర్థం.

గురుకులమే ఇల్లు. గురువే దైవం. గురుపత్నే దేవత. గురుశిష్య బంధానికి ఇంతటి పవిత్రత, ప్రత్యేకత ఉన్నాయి. సోదరి నివేదిత జీవితమంతా ఉపాధ్యాయినిగానే! చదువులమ్మ. విశిష్టతను నిలబెట్టిన ఉపాధ్యాయినులు దేశంలో ఎందరెందరో. వారిని పేరు పేరునా తలచుకోవాల్సిన అవసరం, ఎప్పటికీ ఉంటుంది. టీచరు ఉద్యోగాన్నే స్త్రీ ఎందుకు చేపట్టాలంటే – బోధనలో ఓర్పు, నేర్పు, సహజంగానే ఉంటుంది కాబట్టి. కొన్ని కుటుంబాల్లో మహిళా టీచర్ల సంఖ్య ఎక్కువ. ఉపాధ్యాయినులు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ కొన్ని ఉన్నాయంటే... అదీ ప్రాధాన్యం!

బాలబాలికలకు నిత్యమూ విద్యాబుద్ధులు నేర్పే మహిళా టీచర్లకు గురుపూజోత్సవ వేళ సంయుక్త సత్కారాలూ ఏర్పాటవుతుంటాయి. ప్రత్యేకించి వనితల కోసమే పాఠశాలల చరవాణి సమూహాల్లో ఏర్పాట్లు. ఆ ఉపాధ్యాయినీ బృందాల పేర్లు ఆత్మవిశ్వాసాన్ని ప్రతిఫలిస్తుంటాయి. ఇవన్నీ ఇప్పుడు, మరి అప్పుడు?

ఇవి– ఆ రోజుల్లోనే వనితాశక్తిని చాటి చెప్పిన ఉపాధ్యాయినుల గురించిన విశేషాలు, విలక్షణతలూ. తెలుసుకున్న కొద్దీ మనకు ఆశ్చర్య ఆనందాలు! తరచి చూసినకొద్దీ ఎన్నెన్నో విశేషణాల పరంపరలు!

# జనజీవనీ! ఉపా

అంతర్జాతీయంగా హెలెన్ కెల్లర్. ఆమెకు ఉపాధ్యాయిని ఆన్ సులీవన్. అందరూ 'ఆన్' అని పిలిచేవారు. శారీరకంగా ఎన్నో సమస్యలున్నా, మానసికంగా ఆమె ధైర్యవంతురాలు. బీదరికం బాధించినా, చుట్టుపక్కలవాళ్లు చిన్నచూపు చూసినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు.

అటువంటి స్థితిగతుల్లోనే చదివి స్కూలు ఫస్ట్ వచ్చింది! హెలెన్‌కీ వ్యాధుల బాధలు ఎక్కువ. వాటిని తట్టుకునే పటిమా ఎక్కువే. శారీరక, మానసిక వేదనలు ఎన్ని ఉన్నా అన్నింటినీ భరించేది హెలెన్. ఆమెకి సహాయంగా అడుగుపెట్టింది ఆన్.

ఒకసారి తన దగ్గరికి వచ్చిన ఆన్ చేతి సంచీని తటాలున లాగేసుకుంది హెలెన్. అదంతా అప్పటి తన మనోస్థితి ప్రభావం! ఆ 'సంచీలో ఏముందా?' అని అదే పనిగా వెదికింది. అందులో కనిపించింది చేతి గడియారం! ఆన్ పాఠశాలలో ప్రథమురాలిగా వచ్చినపుడు, టీచర్ బహూకరించింది అది. ఆ వాచీనే హెలెన్‌కు ఇచ్చేసింది ఆన్.

ఆ ఇవ్వడంలోని వాత్సల్యం హెలెన్ మనసును తాకింది. కొంత కాలానికి ఆమె మారాం తగ్గింది. చదువుమీద 'చూపు' నిలిచింది. ఆన్‌కీ దృష్టి అంతగా ఆనదు. అయినా శిష్యురాలి కోసం ఎంతెంతో శ్రమను ఓర్చుకుంది. గాయాలను భరించింది. బాధలను సహించింది.

మరికొంత కాలానికి, హెలెన్ కళాశాల స్థాయికి చేరింది. అలా చేరేలా చేసింది గురువు, ఆన్. తోడూ నీడుగా నిలిచింది. గురువుగా ఆన్, శిష్యురాలిగా కెల్లర్ చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోయారు!



సోదరి నివేదిత

చూశారా! విద్యాబోధనలో ఎంతెంతో ఒత్తిడి ఉంటుంది. సహనాన్ని ఏ దశలోనూ కోల్పోకూడదన్న పట్టుదలా ఉంటుంది అందులో. శిష్యుడు/ శిష్యురాలిని చదువులో, ఇతరత్రా సైతం తీర్చి దిద్దేందుకు ఎన్నో త్యాగాలు చేయాల్సి వస్తుంది. చేయక తప్పదనేలా.

బడిలో, తరగతి గదిలో పలు మనస్తత్వాల పిల్లలుంటారు. కొందరైతే మొండిగా ప్రవర్తిస్తుంటారు. అసలేమీ పట్టించుకోని బాలలు మరికొంతమంది. వీరందరినీ దరిచేర్చుకుని అంతా నేర్పించడమే గురుబాధ్యత. అంత సహనశీలత సర్వసాధారణంగా మహిళకే ఉంటుందన్నది నిత్య సత్యం.

వర్తమానంలోకి వద్దాం. గురుధర్మం కేవలం అక్షరజ్ఞాన ప్రదానం కాదు. జీవితాన్ని చక్కని తీరున నడిపించటం. శిష్యులకు వివేకాన్ని అందించటం, విచక్షణ జ్ఞానాన్ని కలిగించడం, ఉత్తమ వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడం. ఇందులో ఉపాధ్యాయినుల పాత్ర అనంతం.

కలమైనా, స్వరమైనా, బలమైనా, వరమైనా,

అమృతజలమైనా గురువే. దీపాన్ని మరో దీపం వెలిగించినట్లు – శిష్యజీవితాన్ని వెలిగిస్తారు గురువులు. శిష్యురాళ్ల మాటలు ఇవే చెప్తుంటాయి.

తెలంగాణలోని వరంగల్ జిల్లాలో తెలుగుభాష ఉపాధ్యాయినిగా ఉన్న విజయలక్ష్మికి మహిళా టీచరు సుగుణ. ప్రేమతో పలకరింపులు, ధైర్యం నింపే మాటలు. ఎప్పుడు అవసరమైనా సూచనలు. దగ్గరికి వాత్సల్యంగా తీసుకుని మెచ్చుకున్న జ్ఞాపకాలు. ఇక ముందు రోజుల్లో అటువంటి ఉత్తమ ఉపాధ్యాయినులకు పట్టాభిషేకం జరగాలన్నదే శిష్యురాలి అభిమతం.

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలుగా ఉన్న కవితకు గురుదేవత సుశీల. ఆ చల్లని చేతి స్పర్శ, అందించిన ఓదార్పు, కనబరచిన ఆప్యాయత ఎన్నటికీ మరవరానివని శిష్యురాలి అనుభవం. బడి అంటే మమతల గుడి. అక్కడ తన ఒళ్లో కూర్చోబెట్టుకుని పలకమీద బలపంతో చేయిపట్టి రాయించిన టీచరమ్మనే ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు కవిత. ఓనమాలు నేర్పించి, పద్యాలు చదివించి, కథలు వినిపించి, అమ్మభాష తెలుగుమీద మక్కువ పెంచారనీ నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. జ్ఞానజ్యోతిగా, చైతన్యమూర్తిగా మనసారా పిలుచుకుంటున్నారు.

# ధ్యాయినీ!

ఉన్నత విద్యా రంగంలో ఆచార్య ఎస్.శమంతకమణి పేరెన్నికగన్న విదుషీమణి. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆమె వద్ద పాఠాలు నేర్చుకున్న ఎందరో... ఉదాత్త అధ్యాపకురాలిగా ప్రశంసిస్తుంటారు నేటికీ.

తెలుగునాట భాగ్యనగరంలో అధ్యాపక వృత్తిని నిర్వర్తించిన నాయని కృష్ణకుమారి సుదీర్ఘకాలం సేవలందించినవారు. అనేకమంది శిష్యురాళ్లకు అభిమాన పాత్రురాలయ్యారు. గౌరవాదరణ పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేసిన మలయవాసిని, అరుణకుమారి తమ శిష్యుల అభిమానాన్ని అపారంగా సంపాదించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో; తమ్మారెడ్డి నిర్మల, ఎస్.రాజేశ్వరి, ఆర్.రాజేశ్వరమ్మలకు మహిళా శిష్యులెందరో.

మహిళాబోధకులు అనేకమంది విద్యారంగంలో తమదైన ముద్ర వేశారు, వేస్తున్నారు. చదువులో, సంస్కారంలో తీర్చిదిద్దుతున్నారు. విజయావకాశాలను మెరుగుపరిచేందుకు ఎంత చేయాలో అంతా చేస్తున్నారు.

వృత్తి ప్రాధాన్యం, ప్రథమత్వాన్ని సూచించే కీలక అంశం మరొకటుంది. తెలంగాణలోని హన్మకొండ ప్రాంతంలో ఒకే కుటుంబం నుంచి 80మంది టీచర్లు ఉన్నారు! వారంతా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులుగా ఉంటున్నారు. అత్యధికులు వనితలే! నారాయణపేట జిల్లాలోని ఊట్కూరు గ్రామంలోనైతే 200మంది పైగా ఉపాధ్యాయులున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వీరిలో పడతుల సంఖ్య ఎక్కువ.

ఉపాధ్యాయుల విధి నిర్వహణలో లోపం జరిగితే తరానికి తరమే నష్టపోయే ప్రమాదముంది. అందువల్లనే టీచర్లది ఎంతో గురుతర బాధ్యత, నిబద్ధత, నిరంతర శ్రమ, సమర్థత వల్లనే మంచి ఫలితాలు కలుగుతాయి. విద్యార్థినీ విద్యార్థులతో ఎలా ఉండాలి, వారి మానసిక అవసరాలు తీరేందుకు ఎటువంటి విధానాలు అనుసరించాలి, నైపుణ్యం వెలికి తీసేందుకు ఏం చేయాలన్నదానిపై సంబంధిత వర్గాల నుంచి సూచనలున్నాయి.

వికాసజ్యోతి, సద్గుణ సంపత్తి. ఈ రెండింటికీ దీపమాలిక ప్రత్యక్ష సూచిక. **'అజ్ఞానము చీకటిగా /**



**విజ్ఞానము వెలుగుకాగా / వివరించిన భావజ్ఞానము సుజ్ఞేయము, సుమధురము'** అన్నారందుకే విశ్వనాథ కవి. వెలుగు అనేది నిరంతర వరప్రసాదితం. అదే సర్వజీవరాశికీ ప్రాణాధారం. ఆ కాంతినే వనితగా భావించినపుడు, వనితా ఉపాధ్యాయుల సేవలు ఎప్పుడూ నిరుపమానమే!

ప్రతిభ, శక్తి, సామర్థ్యం కలగలిసిన రీతిన ఎందులోనైనా పోటీ పడి రాణిస్తున్నారు నారీమణులు. అందునా విద్య అనేది ప్రకాశం, వికాసం. అతి ప్రధానం, విశ్వవర్ధనం విద్యే. సూచక, వాచక, బోధక మార్గాలనేకం ఉంటాయిందులో. వీటిని ఆకళింపు చేసుకుని, విద్యార్థులకు ఒంటపట్టేలా చేసి, ముమ్ముందుకు నడిపించేవారే ఉపాధ్యాయినులు. **'తల్లీ! నిన్నుదలంచి పుస్తకము చేతన్‌బూనితిన్'** అంటున్నపుడు మన నేత్రాల ముందు ప్రత్యక్షమయ్యేది విద్యాధిదేవతే! ఆ రీత్యా, ప్రతీ ఉపాధ్యాయినిదీ గురుతర పాత్ర.



ఆన్ సులీవన్

**'కీర్తి నిలుపుటయు కాదె జనులకు జన్మఫలము'** అనలేదూ నన్నయ? ఖ్యాతిని నిలబెట్టడంలోనే అంతా ఉంటుంది. జాతికి గొప్పతనంగా అదే భాసిస్తుంది. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయుల్లో ఉపాధ్యాయినీ వృత్తి ఇనుమడించడం వారిపైనే పరిపూర్తిగా ఆధారపడి ఉంది. రాష్ట్రాలు, జిల్లాలు, స్థానికంగా జరిగే ఉపాధ్యాయ దినోత్సవ నేపథ్యాన మహిళా బోధకుల పాత్ర, ప్రాధాన్యం, ప్రత్యేకత ఘనతరం. ప్రభుత్వ, తదితర వ్యవస్థలు ఈ సత్యాన్ని తెలుసుకుని మసలిననాడు, అన్ని స్థాయుల్లో ఉపాధ్యాయినుల సంక్షేమం కోరుకున్ననాడు 'దినోత్సవం' అనిపించుకుంటుంది. వారి గురుత్వాన్ని పరిపోషించి, ఉత్తమ ఫలితాలు కలిగేలా చూడటమే సామాజికంగా అందరి బాధ్యత. 'గుణాత్మకత'కు అసలైన అర్థం అదే!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

# స్టాలిన్ ఏలుబడిలో

**తమిళనాడు సీఎం స్టాలిన్ మాట ఎత్తితే చాలు మా మీద హిందీని రుద్దుతున్నారంటూ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం మీద విరుచుకుపడిపోతుంటారు. తమిళం, ఇంగ్లీషు భాషలు మాకు రెండు కళ్లు అంటూ అసెంబ్లీకి వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మాటలు కోటలు దాటిస్తుంటారు. అలాంటి స్టాలిన్‌కు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో తమిళం, ఇంగ్లీషు భాషల్లో నానాటికి కొరవడుతున్న నైపుణ్యాలకు సంబంధించి తాజాగా విడుదలైన గణాంకాలను చూస్తే దిమ్మతిరిగి బొమ్మ కనపడకమానదు. గురువింద గింజ సామెత గుర్తుకు రాక మానదు.**

తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో 7.29 లక్షల మందికిపైగా తమిళం, ఇంగ్లీషు భాషా పరీక్షల్లో ఫెయిల్ కావడం తమిళ భాషాభిమానులను దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురిచేసింది. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో పడిపోతున్న నాణ్యతాప్రమాణాలకు అద్దం పడుతోంది. తాజాగా చేసిన మదింపు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి విద్య సముపార్జనలో ప్రమాదఘంటికలను మోగిస్తున్న అంతరాలను వెలుగులోకి తీసుకొనివచ్చింది. రాష్ట్రంలోని 38 జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతులకు16.8 లక్షల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వారిలో 7.29 లక్షల మంది విద్యార్థులు అంటే మొత్తం విద్యార్థుల్లో దాదాపు 45.38 శాతం చదవడంలో, రాయడంలో కనీస పరిజ్ఞానాన్ని ప్రదర్శించడంలో విఫలమయ్యారు. అలాంటివారిలో నేర్చుకోవడంలో నైపుణ్యాలను మెరుగపరచడానికి ప్రత్యేక తరగతులను నిర్వహించడానికి డీఎంకే సర్కారు ఉపక్రమించింది అనే వార్త నేతి బీరకాయలో నెయ్యి నానుడిని గుర్తుకు తెస్తోంది. సీఎం స్టాలిన్, ఆయన మంత్రివర్గ సహచరులు ఎంతసేపూ హిందీ మీద టన్నులకొద్దీ ద్వేషాన్ని కుమ్మరించడమే తప్ప రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో మరీ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర అధికారిక భాష తమిళం బోధనా తీరు ఏ విధంగా ఉంది? విద్యార్థులు వారి మాతృభాషలో ఏమేరకు పరిజ్ఞానాన్ని సంపాందించు కుంటున్నారు? అనే విషయం మీద శ్రద్ధ పెట్టక పోవడం ప్రస్తుత దురావస్థకు దారితీసిందనేది విద్యారంగానికి చెందిన విశ్లేషకుల వాదన.

ఓ తమిళ దినపత్రిక పూనుకోకపోయి ఉంటే తమిళం, ఇంగ్లీషు భాషల పరిస్థితి రాష్ట్రంలో ఇంత దారుణంగా ఉందనే సంగతి ఎప్పటికీ వెలుగులోకి వచ్చేది కాదు. ఆలస్యంగానైనా ఇంతటి బృహత్ కార్యానికి పూనుకొని మాతృభాషపట్ల ఏలికల కళ్లకు కమ్ముకున్న మాయపొరలను తొలగించడానికి తన వంతు ప్రయత్నం చేసిన తమిళ దినపత్రిక దిన మలర్‌ను భాషాభిమానులందరూ తప్పక అభినందించి తీరాలి.

తమిళనాడులోని 38 జిల్లాల్లో 16 లక్షల మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్నారు. దినమలర్ పత్రిక వారిలో 8 లక్షల మందికిపైగా విద్యార్థులకు నైపుణ్య పరీక్షలను నిర్వహించింది. జూలై 8 నుంచి 10వ తేదీ మధ్యకాలంలో తమిళం, ఆంగ్లం, గణితశాస్త్రంలో నైపుణ్య పరీక్షలను చేపట్టారు. జూలై 28న వెల్లడైన ఫలితాల్లో ఏడు లక్షల మందికిపైగా విద్యార్థులు దారుణంగా ఫెయిల్ అయ్యారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 45.83 శాతం మందికి పైన పేర్కొన్న సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం కొరవడింది. నీలగిరీస్ జిల్లాలో 6,322 విద్యార్థులతో అత్యధికంగా 67.41 శాతం ఫెయిల్ అయ్యారు. తర్వాతి స్థానంలో 10,741 మంది విద్యార్థులతో పెరంబలూర్(65.85 శాతం), 29,806 మంది విద్యార్థులతో తిరుచ్చి (55.34 శాతం), 31,233 మంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో చెన్నయ్(54.47 శాతం) నిలిచాయి. అంతేకాకుండా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో అత్యధికులు 1 నుంచి 5 తరగతులకు ఉద్దేశించిన పాఠ్యపుస్తకాల్లో పాఠాలను చదవలేకపోయారు. చిన్నచిన్న లెక్కలను కూడా చేయలేకపోయారు. అనేక అధ్యయనాలు ఈ వాస్తవాలను పదేపదే వెలుగులోకి తెచ్చినప్పటికీ ఏమీ తెలియనట్టుగా స్టాలిన్ సర్కారు మొద్దు నిద్రను నటిస్తోందనేది సామాజిక విద్యావేత్తల అభియోగం. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థలో వాస్తవాలను ఎత్తిచూపే నివేదికలను, అధ్యయనాలను అదేపనిగా తోసిపుచ్చడం పాలకులకు ఓ అలవాటుగా మారిపోయింది. ఈ సందర్భంగా తమిళనాడులో చదువు చెబుతున్న వైనం గురించి అక్కడి గవర్నర్ ఆర్ఎన్ రవి అన్న మాటలను ఒకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గవర్నర్ ఇటీవల ఒక చోట మాట్లాడుతూ "తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న వారిలో ఎక్కువమంది పేద, అణగారిన వర్గాల కుటుంబాలకు చెందినవారు. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంలోనూ, విద్యార్థులు పాఠాలు నేర్చుకోవడంలో అనుసరించాల్సిన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి" అని అన్నారు. వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక-ఏఎస్ఈఆర్‌ను ప్రస్తావించారు. "ఉన్నతపాఠశాల విద్యార్థుల్లో 50 శాతానికి పైగా విద్యార్థులు తేలికపాటి లెక్కలు కూడా చెయ్యలేరు. ఆఖరికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉద్దేశించిన పాఠ్యపుస్తకాలను కూడా చదవలేరు.




తమిళనాడులో ప్రభుత్వ విద్యావ్యవస్థ క్రమక్రమంగా క్షీణించిపోతోంది. విద్యార్థులు అత్తెసరు మార్కులతో పాసవుతున్నారు. సర్టిఫికేట్లతో బాహ్యప్రపంచంలోకి వస్తున్నారు. ఉపాధి అవకాశాల్లేక



# తమిళం విలవిల..!

విలవిలలాడి పోతున్నారు" అని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి, 2025లో తమిళనాడు రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కే అన్నామలై స్టాలిన్ సర్కారు తీరును ఎండగడుతూ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. ఆ పోస్టులో "తమిళనాడు కళావిహీనమైపోతోంది. మాతృభాషలో (తమిళం) కనీస నైపుణ్యానికి చెందిన జాబితాలో అట్టడుగునకు పడిపోయింది. ఎంకే స్టాలిన్, ఆయన వందిమాగధులు విద్యలో నాణ్యతను దిగజార్చి నందుకు, విద్యారంగానికి రాజకీయం చేసినందుకు, తమిళనాడు పిల్లలకు సమాన అవకాశాలను, ప్రపంచ స్థాయి విద్యను దూరం చేస్తున్నందుకు సిగ్గుపడాలి" అని అన్నారు.

అన్నామలై మరో పోస్టులో "తమిళనాడులో డీఎంకె సర్కారుకు ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో విద్యా మౌలికసదుపాయలను ఉన్నతీకరించడంపై ఒక దృక్కోణం కొరవడింది. అలాంటి ఒక దృక్కోణం ప్రావీణ్యంలో అంతరాలను తొలగిస్తుంది. ఈ విషయంలో తమిళనాడు గత కొద్ది సంవత్సరాలుగా విఫలమైంది. డీఎంకే ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన మంచిపనులకు అడ్డుగోడగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందించే ప్రయోజనాలను తమిళనాడు ప్రజలకు దక్కకుండా చేస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను తమిళనాడులో విద్యా సంస్థలను ఉన్నతీకరించడానికి మీ దురహం కారం అడ్డుపడిందా? అని ప్రశ్నిస్తున్నా" అని నిలదీశారు.

**తమిళులకు స్టాలిన్ కుచ్చుటోపీ రాష్ట్ర విద్యా విధానం-ఎస్ఈపీ**

జాతీయ విద్యా విధానానికి-ఎన్ఈపీ-2020కి ఆమడదూరంలో ఉండే తమిళనాడు సీఎం స్టాలిన్ దేశంలో మరే రాష్ట్రప్రభుత్వమూ కనీసం కలలో కూడా అనుకోని ఓ వింత విధానాన్ని రాష్ట్ర ప్రజల నెత్తిన కుచ్చుటోపీలా పెట్టారు. అదే పాఠశాల విద్యకు రాష్ట్ర విద్యా విధానం-ఎస్ఈపీ. ఆగస్టు 8న దీనికి సంబంధించిన విధి,విధానాలతో కూడిన ఓ పుస్తకాన్ని చెన్నయ్‌లోని అన్నా శతాబ్ది గ్రంథాలయంలో అట్టహాసంగా విడుదల చేశారు. తాడూ బొంగరం అంటూ లేని ఈ ఎన్నికల స్టంటుకు స్టాలిన్ పుత్రరత్నం, సందు దొరికినప్పుడల్లా హిందూత్వంపైన అవాకులూ చెవాకులూ పేలే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా హాజరయ్యారు. పాఠశాల విద్యా మంత్రి అంబిల్ పొయ్యామొళి తండ్రీకొడుకులకు తోడయ్యారు. మోదీ సర్కారు ఎప్పుడో ఐదేళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఎన్ఈపీని మక్కీకి మక్కీ దించేశారు. కాకపోతే తమది ద్విభాషావిధానం అని ఢంకా బజాయించారు. ఆ రెండు భాషల్లో ఒకటి తమిళం అయితే మరొకటి ఆంగ్లం. ఎస్ఈపీ గురించి సీఎం స్టాలిన్ చెప్పిన మాటలు ఆకాశంలో చుక్కలను దాటి పోయాయి. రాష్ట్ర విద్యా విధానంతో విద్యార్థులకు పాఠాలను బట్టీపట్టే పని ఉండదట. అది విద్యార్థులను ముందుగా ఆలోచింపజేస్తుందట. ఆ తర్వాత వారిని పనికి పురిగొల్పుతుందట. తమిళ భాష ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెబుతుందట. ఉదయనిధి స్టాలిన్ అయితే మరో అడుగు ముందుకు వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా రంగాన్ని రాష్ట్ర జాబితాలోకి చేర్చే విషయంలో తమిళనాడు ప్రభుత్వం కంకణం కట్టుకొని ఉందని కోతలు కోశారు. పాఠశాల విద్యామంత్రి అంబిల్ తండ్రీకొడుకులకు వంత పాడారు.

**వేలల్లో పాఠశాలలకు తాళాలు**

మోదీ సర్కారు తీసుకొచ్చిన ఎన్ఈపీ-2020 మీద పడి ఏడుస్తున్న డీఎంకే సర్కారు రాష్ట్రంలో పాఠశాలలను ఉద్ధరించకపోగా ఉన్నవాటిలో వేలాది పాఠశాలలకు తాళాలు బిగిస్తోంది. ఈ ఏడాది జూలైలో స్టాలిన్ ప్రభుత్వం తీసుకున్న ఓ వివాదాస్పద నిర్ణయం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. పాఠశాలల మూసివేతపై మీడియాలో వచ్చిన వార్తలపై ఎలి మెంటరీ విద్య డైరెక్టరేట్ -డీఈఈ స్పందించాల్సి వచ్చింది. ఒక్క విద్యార్థి కూడా చేరని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,204 పాఠశాలలను మూసివేసినట్టు వెల్లడించింది. వాటిలో 208 ప్రభుత్వ పాఠశాలలు, 869 అన్‌ఎయిడెడ్, 114 ఎయిడెడ్, 11 పాక్షికంగా ఎయిడెడ్ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని రెండు పాఠశాలలు ఉన్నాయి. అయితే పాఠశాలల మూసివేతకు జననాల రేటు లో తగ్గుదల, గ్రామాల నుంచి పట్టణాలకు, నగరాలకు ప్రజల వలసలను అధికారులు సాకుగా చూపారు. ఆగస్టు 14న రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై అన్నాడిఎంకే ప్రధాన కార్యదర్శి, శాసనసభలో విపక్ష నేత ఎడప్పడి కే పళనిస్వామి తమిళనాడు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మూసివేత నిర్ణయం అత్యంత దారుణమని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలక ప్రత్యేకించి పాలక డీఎంకే నాయకులకు చెందిన ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూర్చడానికి అలాంటి ఒక నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.

ఉన్నతపాఠశాల విద్యార్థుల్లో లక్షలాది మందికి తమిళభాషలో ఓనమాలు కూడా రాని పరిస్థితుల్లో, దాన్ని చక్కదిద్దాల్సింది పోయి కొత్తగా ప్రాథమిక విద్యకు విద్యా విధానాన్ని తీసుకొని రావడం ఏమి టంటూ స్టాలిన్ సర్కారును విమర్శించే విద్యావేత్తలు తమిళనాడులో కోకొల్లలు.

**– జాగృతి డెస్క్**



# డీకే నోట సంఘ ప్రార్థన

కర్ణాటక శాసనసభలో ఆగస్ట్ 21న జరిగిన సంఘటన కలకలం రేపింది. ఆ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నోటి నుంచి ఆ నిండు సభలో ఆర్ఎస్ఎస్ ప్రార్థన వినిపిస్తే ఎలా ఉంటుంది? అదేమీ గొప్ప విషయం కాదు. కానీ సంచలనం మాత్రమే. ఆయన వినిపించిన కొన్ని పాదాలకు బీజేపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ సభ్యులు మాత్రం పచ్చివెలక్కాయ గొంతులో పడినట్టు ఉండిపోయారు. చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట అంశం మీద చర్చ జరిగినప్పుడు బీజేపీ సభ్యుడు, విపక్ష నేత ఆర్. అశోక్ చర్చలో పాల్గొన్నప్పుడు డీకే ఈ పాదాలు వినిపించారు. నమస్తే సదా వత్సలే అంటూ మొదలయ్యే ఆ గీతం శివకుమార్ వినిపించినప్పుడు తీసిన వీడియో ఇప్పుడు ఆ రాష్ట్రంలో స్వైర విహారం చేస్తోంది. దీనితో ఎవరికి తోచిన విధంగా వాళ్లు వ్యాఖ్యానాలు, భవిష్యవాణులు విరివిగా వినిపిస్తున్నారు.

అసలే ముఖ్యమంత్రి పదవి దక్కలేదన్న బాధ, ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంతో వచ్చిన రోత కలగలసి ఆయన వేరే విధంగా ఆలోచిస్తున్నారని చెప్పడానికి ఆర్ఎస్ఎస్ ప్రార్థనను అసెంబ్లీ వేదికగా చెప్పడమే నిదర్శనమని చెప్పారు కొందరు. డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ ప్రార్థన కొన్ని పాదాలు చెప్పారంటే అదేదో సంస్థ మీద భక్తి అని చెప్పడం తొందరపాటే అవుతుంది. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోవడం అవసరమని ఆయన ఈ విధంగా సూచించారని కొందరు భాష్యం చెప్పారు కూడా. సీఎం పదవి చెరి సగం కాలం పంచుకోవాలని మొదట ప్రతిపాదించినా సిద్ధుడు దీనిని ఏనాడూ అంగీకరించలేదు. అయితే రాజకీయ విశ్లేషకుల, యూట్యూబర్ల అత్యుత్సాహం మీద మరునాడే డీకే నీళ్లు కుమ్మరించారు. ఆయన జనతాదళ్, బీజేపీల గురించి పరిశోధన చేస్తున్నారట. ఆ క్రమంలోనే ఆర్ఎస్ఎస్ గురించి కూడా అధ్యయనం చేశారట. ఆ క్రమంలోనే తనకు ఆర్ఎస్ఎస్‌తో కాని, బీజేపీతో కాని చేతులు కలిపే యోచనే లేదని కూడా చెప్పి అధిష్ఠానానికి ఆగ్రహం రాకుండా జాగ్రత్త పడ్డారు. తన గుండె ఎప్పుడూ

# జన్మభూమి ట్రస్ట్ సభ్యుడు ప్రతాప్ కన్నుమూత



శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌లో ప్రముఖుడు, అయోధ్య రాచకుటుంబీకుడు బిమలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్రా (71) ఇకలేరు. కొద్దికాలంగా అస్వస్థులుగా ఉన్న మిశ్రా అయోధ్యలోని స్వగృహంలోనే కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలియచేశారు. మృదుభాషిగా మితభాషిగా పేర్గాంచిన మిశ్రాను స్థానికులు అయోధ్య రాజాగా, పప్పు భయ్యాగా పిలుచుకునేవారు. ఆయన రామ జన్మభూమి ట్రస్ట్ సభ్యుడైనప్పటికీ ముస్లింలు కూడా గౌరవించేవారు. తీర్పు వచ్చిన తరువాత ఆలయ నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 2020లో సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువరించిన తరువాత వివాదాస్పద స్థలాన్ని డివిజన్ కమిషనర్ ఎంపీ అగర్వాల్ (ఫైజాబాద్) అయోధ్య రాజాకే అప్పగించారు. అంటే మూడు దశాబ్దాల పాటు రాముడు ఆరు బయట తాత్కాలిక గుడారం ఉన్న స్థలం అయోధ్య రాజా వశమైంది. తరువాత ఆలయ నిర్మాణం ఆరంభమైంది. 2009 ఎన్నికలలో ఒక్కసారి మాత్రమే ఆయన ఫైజాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఒప్పించి ఆయనను బరిలో దింపారు. అయితే అప్పుడు ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నిర్మల్ ఖత్రి గెలిచారు. తరువాత మిశ్రా రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. అయోధ్యలో చాలా విద్యా సంస్థలకు ఆయన అధ్యక్షులుగా ఉన్నారు. అయోధ్య రామాయణ మేళా కమిటీలో కూడా ఆయన సభ్యులు.

# సంఘ శతాబ్ది విజయదశమి ఉత్సవ అతిథి కోవింద్

ఏటా విజయదశమికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నాగపూర్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే విశిష్ట ఉత్సవానికి ఈ సంవత్సరం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఇది సంఘ శతాబ్ది కావడం, ఈ ఉత్సవానికి మాజీ రాష్ట్రపతిని ఆహ్వానించడం ప్రత్యేకతను సంతరించుకున్నాయి. అక్టోబర్ 2, 2025, ఉదయం 7.40కి ఈ ఉత్సవం ప్రారంభమవుతుందని సంఘ్ ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో తెలియచేసింది. కోవింద్‌తో పాటు సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ కూడా కీలకోపన్యాసం చేస్తారు.



కాంగ్రెస్‌నే తలుస్తుందని కూడా చెప్పారు.

అసెంబ్లీలో డీకే ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన పాడడం ఏమో గాని, ఆ పేరు చెప్పి చాలా విషయాలు చర్చకు వచ్చాయి. ప్రార్థన చరిత్ర, ఔన్నత్యం ఇవన్నీ ప్రజలకు చేరువగా వచ్చాయి.

నమస్తే సదా వత్సలే మాతృభూమే అంటూ మొదలయ్యే సంఘ ప్రార్థనలో 13 పంక్తులు ఉంటాయి. సంస్కృతంలో రాశారు. చివరిగా భారతమాతకు జై అన్న నినాదంతో ముగుస్తుంది. 1925 ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించినప్పటికి, ప్రార్థన మాత్రం 1939 నుంచి ఆలపిస్తున్నారు. ఒక స్వయంసేవక్ పాడుతూ ఉంటే, శాఖలోని మిగిలిన స్వయంసేవకులు అనుసరిస్తారు. ఒక గంటపాటు జరిగే నిత్య శాఖ ప్రార్థనతో ముగుస్తుంది. అయితే సామాజికంగా నిర్వహించే ఉత్సవాలలో మాత్రం మొదటే ఆలపిస్తారు. ప్రార్థన కోసం సూచన రాగానే అంతా వారి వారి స్థలాల దగ్గరే లేచి నిలబడతారు. నాగపూర్‌కు చెందిన నరహరి నారాయణ్ భిడే ప్రార్థన రచించారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ ప్రథమ సర్‌సంఘచాలక్ పరమ పూజనీయ డాక్టర్ కేశవరావ్ బలీరామ్ హెడ్గేవారు మిత్రులు. ఆయన ఇంగ్లిష్ బోధించేవారు. కానీ గొప్ప సంస్కృత పండితుడు కూడా.

1939లో వార్ధాలో జరిగిన దాదాపు మేధో మథనంలో ప్రార్థనా గీతం జనించింది. ఈ ప్రార్థన దేశమంతటా శాఖలలో ఆలపించాలని డాక్టర్‌జీ ఆనాడు సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ నమ్మే సిద్ధాంతం, దాని వెనుక స్ఫూర్తి, తాత్త్వికత ఇందులో ధ్వనిస్తాయి.



## అక్కడ కర్మాగారాలు, కాలేజీల కంటే మదర్సాలే ఎక్కువ

పాకిస్తాన్ అంటే ఉగ్రవాదుల ఉత్పత్తి దేశంగా పేరు మోసింది. ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినా ఆ దేశం బాధ పడడం లేదని ఎప్పుడో రుజువైంది. పైగా అదే ఘనతగా, మతానికి ఆ దేశ పౌరులు చేస్తున్న మహోన్నత సేవగా కూడా భావించడం కనిపిస్తున్నది. మన పొరుగు ఉగ్రవాద పోషక దేశంలో 6,00,000 మసీదులు ఉన్నాయి. మత బోధన చేసే 36,000 కేంద్రాలు (మదర్సాలు) ఉన్నాయి. అయితే కర్మాగారాలు మాత్రం 23,000 మాత్రమే ఉన్నాయి. ఇది ఆ దేశం ఇచ్చిన ఆర్థిక సర్వే నివేదిక వెల్లడించిన వాస్తవం. పాకిస్తాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సాయపడదలిచింది. ఆ సాయంలో రెండో విడతగా రావలసిన 7 బిలియన్ అమెరికన్ డాలర్ల విడుదల కోసం జరుగుతున్న ప్రక్రియలో ఈ విషయం వెలుగు చూసింది. నిజానికి ఇది 2023లో తయారు చేసిన నివేదిక. ఇప్పుడు విడుదల చేశారు. జనాభా, వసతి అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. పాక్ ప్రణాళిక శాఖ మంత్రి అహసన్ ఇక్బాల్ విడుదల చేసిన ఈ నివేదికలో 23,000 కర్మాగారాలు, 6,43,000 చిన్న తరహా పరిశ్రమలు ఉన్నట్టు తేల్చారు. దేశంలో ఉద్యోగుల సంఖ్య దాదాపు రెండున్నర కోట్లు. ఇందులో 45 శాతం సేవా రంగంలోనే ఉన్నారు. సామాజిక రంగంలో 30 శాతం ఉన్నారు. ఉత్పాదక రంగంలో 22 శాతం ఉన్నారు. విద్యారంగం వివరాలు ఇవి: 2,42,000 పాఠశాలలు, 11,568 కళాశాలలు, 214 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. 1,19,789 ఆసుపత్రులు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులే ఎక్కువ.



## బాంగ్లా దేశీయులు అస్సాంలో ఉంటే ఏమైంది!

ఈ మాట సరిగ్గా ఎవరు అనాలో వాళ్లే అన్నారు. వాళ్లు మాత్రమే అలా అనగలరు. ఆమె పేరు సాయేదా హమీద్. సోనియా గాంధీకి సన్నిహితురాలు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా ఈమె ప్రణాళికా సంఘం సభ్యురాలిగా ఉండేవారు. ఇటీవల ఈమె తోటి ఉద్యమకారులతో కలసి అస్సాంలో పర్యటించారు. బాంగ్లాదేశీయులు కూడా మనుషులే. కాబట్టి వాళ్లకి అస్సాంలో నివసించే హక్కు లేకుండా చేయడం సరికాదని ఆమె వాపోయారు. ఈ భూమి చాలా పెద్దదని కూడా ఆకాశమంత సత్యం మనందరికి బోధించారు. దీనికి కేంద్రమంత్రి కిరెన్ రిజిజు ఘాటుగా సమాధానం ఇచ్చారు. మానవత్వం అనే మాటతో జనాన్ని పెడతోవ పట్టించవద్దని ఆయన హమీదాకు హితవు పలికారు. మానవత్వమే ఉంటే, పాకిస్తాన్, బాంగ్లాదేశ్‌లలో బౌద్ధులు, క్రైస్తవులు, హిందువులు, సిక్కులు ఎందుకు అని అవస్థల పాలవుతున్నారని రిజిజు ప్రశ్నించారు. ఆమె సోనియాకో లేదా రాహుల్‌కో సన్నిహితురాలు కావచ్చు. అయినంత మాత్రాన దేశంలోకి వచ్చిన చొరబాటుదారులను సమర్థించడం సరికాదని కూడా రిజిజు అన్నారు. ఈమె వెంట అస్సాం వెళ్లిన ఇంకో ఇద్దరి పేర్లు ఇక్కడ చెప్పుకోవాలి. ఒకరు ప్రశాంత భూషణ్, మరొకరు హర్షమందిర్. వీళ్లంతా ఖలిస్తాన్ సానుభూతి పరులైన రైతులను సమర్థించే అర్బన్ నక్సల్. అస్సాం అడవులలో తిష్ట వేసిన బాంగ్లాదేశీయులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బయటకు పంపుతున్న నేపథ్యంలో హమీదా ఈ రీతిలో విలపించారు. అన్యాయమైన పద్ధతులలో ముస్లింలను లక్ష్యంగా చేసుకుని వారిని బాంగ్లాదేశీయులని చెబుతున్నారని అసలు విషయం బయట పెట్టారు హమీదా. ఒకవేళ వాళ్లు బాంగ్లాదేశీయులే అనుకుందాం! అయినా వారు ఇక్కడ ఉంటే తప్పేమిటి? అని కూడా ఆమె ప్రశ్నించారు. భూమి చాలా పెద్దది. వారంతా ఇక్కడ ఉండవచ్చు అని చెప్పారామె. అస్సాం ముఖ్యమంత్రి చట్టవిరుద్ధంగా, చట్టాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ప్రశాంత భూషణ్ తేల్చి పారేశారు. ఈయన సుప్రీం కోర్టు న్యాయవాది అన్న సంగతి తెలిసిందే. అస్సాం ప్రభుత్వం పౌరులను తోలేస్తూ, ఇళ్లు కూలుస్తున్నదని అన్నారు.

# విఠల్‌భాయి పటేల్‌కు ఘన నివాళి





పటేల్ సోదరులు

సర్దార్ పటేల్ సోదరుడు విఠల్‌భాయి పటేల్ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ (బ్రిటిష్ ఇండియాలో నేటి పార్లమెంట్‌కు సమానమైనది) స్పీకర్‌గా ఎన్నికై ఈ సంవత్సరానికి (2025) వందేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగానే ఢిల్లీ శాసనసభ రెండు రోజుల అఖిల భారత సభాపతుల సమావేశాలు ఏర్పాటు చేసింది. ఆ కాలంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్‌గా (అప్పుడు అధ్యక్షుడు అనేవారు) ఎన్నికైన తొలి వ్యక్తి విఠల్‌భాయి పటేల్. వందేళ్ల క్రితం విఠల్‌భాయి ఏర్పరిచిన సభా సంప్రదాయాలనే నేటికీ దేశంలో అనుసరిస్తున్నాం. ఆయన రెండు పర్యాయాలు ఆ పదవికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన స్పీకర్ల సమావేశాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరంభించారు. విఠల్‌భాయి సెప్టెంబర్ 27,1873న జన్మించారు. ఇంగ్లండ్‌లో న్యాయశాస్త్రం చదివిన తరువాత బొంబాయి వచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆయన 1912లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు, 1918లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. 1924లో మరొక దఫా ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ లేదా సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు (బొంబాయి నగరం నుంచి) ఎన్నికయ్యారు. ఆగస్ట్ 22, 1925న సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి భారతీయ స్పీకర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. సహాయ నిరాకరణోద్యమాన్ని గాంధీజీ ఆరంభించడం, ఆయనే రద్దు చేయడం నచ్చని అనేక మందిలో విఠల్‌భాయి ఒకరు. చౌరీచౌరా ఉదంతంతో గాంధీజీ మనస్తాపం చెందిన సహాయ నిరాకరణోద్యమాన్ని రద్దు చేశారు. దీనితో సుభాశ్‌చంద్ర బోస్, మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్ వంటివారు గాంధీజీతో విభేదించారు. తరువాత 1923లో స్వరాజ్య పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. అయితే స్వరాజ్య సమరంలో జాతీయ కాంగ్రెస్‌తో కలసే పనిచేశారు.

సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఆయన ప్రదర్శించిన ఆత్మ గౌరవం విశేషమైనది. ఇందుకు సంబంధించిన ఒక ఉదాహరణను అమిత్ షా సమావేశానికి గుర్తు చేశారు. ఏటా వైస్రాయ్ కౌన్సిల్‌ను ఉద్దేశించి ప్రసంగించేవాడు. ఆ ప్రసంగం కోసం అతడు సభలోకి ప్రవేశించినప్పుడు ప్రెసిడెంట్ (స్పీకర్) తన స్థానం నుంచి లేచి గౌరవించే సంప్రదాయముండేది. దీనిని విఠల్‌భాయి వ్యతిరేకించారు. సభలో స్పీకర్ అత్యున్నత పదవి అని చాటి చెప్పారు. వైస్రాయ్ సభలోకి ప్రవేశించి కూర్చోవాలని, స్పీకర్ వేదిక మీదకు ఆహ్వానించిన తరువాత మాత్రమే ప్రసంగించాలని విఠల్‌భాయి చెప్పారు. ఆనాడు ఆంగ్ల ప్రభుత్వమే అయినా స్పీకర్ ఆదేశాన్ని పాటించిందని అమిత్ షా గుర్తు చేశారు. పార్లమెంట్ భద్రతను స్పీకర్ అధీనంలోకి ఆయన తెచ్చారని, అదే విధానం 2024 వరకు కొనసాగిందని (సీఐఎస్ఎఫ్ వచ్చేవరకు) అమిత్ షా తెలియచేశారు. ఏప్రిల్ 8, 1929న భగత్‌సింగ్, బటుకేశ్వరదత్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో పొగ బాంబులు విసిరినప్పుడు గందరగోళం జరిగింది. అదే అదనుగా కౌన్సిల్ భద్రత బాధ్యత తమ వశం చేసుకోవాలని ఆంగ్ల ప్రభుత్వం ప్రయత్నించింది. ఇందుకు విఠల్‌భాయి అంగీకరించలేదు.

స్పీకర్ కోసం ఒక ప్రత్యేక సచివాలయాన్ని కూడా విఠల్‌భాయి ఏర్పాటు చేయించారు. అందులో పని చేసే అధికారులంతా నేరుగా స్పీకర్ అధీనంలోనే పని చేసేవారు. విఠల్‌భాయి అక్టోబర్ 22, 1933న జెనీవాలో కన్నుమూశారు. అంతకు ముందే ఆయన గాంధీజీ విధానాలు నచ్చక సుభాశ్‌చంద్ర బోస్‌తో కలసి పనిచేయాలని నిశ్చయించుకున్నారు.

# 2024లో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగింది




ఓట్ల దొంగతనం అంటూ రాహుల్ గాంధీ చేస్తున్న గోల ఎంత అర్థరహితమో బీజేపీ బహిర్గతం చేసింది. ఆయనకు కళ్లు, చెవులు ఏమీ పని చేయడం లేదు. అందుకే గడచిన 35 ఏళ్లలో ఏనాడూ రానంత స్థాయిలో 2024 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓట్ల శాతం నమోదయింది. మరి ఓట్లు చోరీ చేస్తే ఇన్ని ఓట్లు ఎలా వచ్చాయి? కాస్తయిన విజ్ఞత లేకుండా ఏమిటీ వ్యాఖ్యలు అంటూ ఆగస్ట్ 25న బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాలవీయ ట్వీట్ చేశారు. ఈ సంగతి రాహుల్ గాంధీకి ఎవరైనా చెబితే మంచిదని కూడా మాలవీయ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం బీజేపీ జేబు సంస్థగా పనిచేస్తోందని, 2024 లోక్‌సభ ఎన్నికలలో ఎన్నో అవకతవకలు జరిగాయని రాహుల్ గోల చేస్తూనే ఉన్నాడు. అయితే రాహుల్ ఆరోపణను ఎన్నికల సంఘం తోసి పుచ్చడమే కాదు, ఆ ఆరోపణలు లిఖితపూర్వకంగా ఇవ్వాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని కోరింది. మాలవీయ ఇచ్చిన ఆధారాలతో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ కూడా రాహుల్‌కు కొన్ని ప్రశ్నలు సంధించారు. రాహుల్ దేశంలోని రాజ్యాంగ సంస్థల పరువు ప్రతిష్టలను మంట గలిపే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన ఓట్ల చోరీ ఆరోపణ నిజమే అయితే ఆ పార్టీ ఓటు శాతం యథాతథంగా ఉండాలని కానీ ఎందుకు పెరిగిందని కేశవన్ ప్రశ్నించారు. అసలు రాహుల్ ఓట్ల చోరీ ఆరోపణకు ఆధారమే లేదని మరొక బీజేపీ నాయకుడు ప్రదీప్ భండారీ వ్యాఖ్యానించారు. బీజేపీకి అనుకూలంగా ఓట్ల చోరీ జరిగి ఉంటే 1989లో 39 శాతం ఉన్న కాంగ్రెస్ ఓట్ల శాతం 2024లో 41 శాతానికి ఎలా చేరిందని ప్రదీప్ ప్రశ్నించారు. అసలు రాహుల్ గాంధీ ధారావాహికంగా అబద్ధాలు ఆడడంలో ఘనుడని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విమర్శించారు. రాహుల్ గాంధీ అదేపనిగా అబద్ధాలను ప్రచారం చేస్తోందని, అదేమి చిత్రమో ఇటీవల కాలంలో కొందరు మహారాష్ట్ర నేతలు కూడా రాహుల్ నిజమే చెబుతున్నారన్న అభిప్రాయానికి వచ్చారని ఆయన అన్నారు. మహారాష్ట్ర నవ నిర్మాణ సేన నాయకుడు రాజ్ ఠాక్రే రాహుల్ చెబుతున్నది వాస్తవమేనంటూ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

– జాగృతి డెస్క్

## ఎస్సీ కులాల, సంచార తెగల ఆత్మీయ సమావేశం






**సికింద్రాబాద్ :** భారత రాజ్యాంగం మేరకు తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ జాబితాలో 59 కులాలు ఉన్నాయి, ప్రతి కులానికి ఒక కుల దేవత, ఒక చరిత్ర ఉంది, 75 సంll ల రాజ్యాంగం అమలులో అభివృద్ధి ఫలాలు అన్ని ఎస్సీ కులాలకు సమంగా చేరలేదని, దీనికి అనేక కారణాలు ఉన్నాయని సామాజిక సమరసత అఖిల భారత సంయోజక్ కె.శ్యాంప్రసాద్ అన్నారు. సామాజిక సమరసత వేదిక, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణసమితి సంయుక్త నిర్వహణలో ఆగస్టు 19న సికింద్రాబాద్ గీతాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ఎస్సీలకు చెందిన అన్ని కులాలవారము అందరి ప్రగతి కోసం కలసి మెలసి పనిచేయాలని, రాజకీయాలు ప్రజలను విడదీస్తాయని, ధర్మ, సంస్కృతులు మాత్రమే సమైక్యం చేస్తాయని తెలిపారు. సామాజిక సమరసత వేదిక తెలంగాణ సంయోజక్ అప్పాల ప్రసాద్ మన అందరి మధ్య మరింతగా, సోదర భావం పెరగడానికి మనం ఏమేమి చేయ గలమో అభిప్రాయాలను తెలపాలని చర్చా కార్యక్రమం ద్వారా ఆహ్వానించారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్రఉపాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ మనం ఎస్సీలం మాత్రమేకాదు హిందువులంకూడా! అరుంధతి మాత హిందువుల అందరికీ ఆదర్శం స్త్రీ, వివాహనంతరం అన్ని కులాలకు చెందిన కొత్త దంపతులు వశిష్ట–అరుంధతి నక్షత్రాలు చూపించే సంప్రదాయం మనదని తెలిపారు.

భాగ్యరెడ్డి వర్మ మనువడు శ్రీ అజయ్ గౌతమ్ దంపతులు పాల్గొని, భాగ్యరెడ్డి వర్మ గారి సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మారేడు మోహన్ (రాష్ట్ర అధ్యక్షులు, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి), వేణుగోపాల్, సమరసత తెలంగాణ సహ కన్వీనర్, చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ సంచార తెగల సంఘం, 21 కులాలకు చెందిన 55 మంది పాల్గొన్నారు.

## గొల్లకొండ గ్రంథాలయం ప్రారంభం



**భాగ్యనగర్ :** గ్రంథాలయములోగల పుస్తకాలను వినియోగించి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ అన్నారు. ఆగష్టు 18న భాగ్యనగర్ మహాదేవపట్నం జిల్లా కార్యా లయంలో జరిగిన “గొల్లకొండ గ్రంథా లయ” ప్రారం భోత్సవంలో శ్రీధర్ పాల్గొని ప్రసం గించారు. ఈ కార్యక్రమంలో గొల్లకొండ భాగ్ సంఘ చాలక్ శ్రీకాంత్, ఇతిహాస సంకలనసమితి భాగ్యనగర అధ్యక్షులు సాయివర ప్రసాద్, స్థానం రామకృష్ణ, స్థానిక సంఘ స్వయంసేవకులు పాల్గొన్నారు

## సేవా కులదీపుడికి సత్కారం

స్వాభిమానం, స్వావలంబన, సమృద్ధి దృక్కోణంగా సమాజసేవకు అంకితమైన సేవాభారతికి సంచాలకుడిగా వ్యవహరిస్తున్న కులదీప్ రాజ్ సక్సేనాను అమేజింగ్ ఇండియన్స్–2025 పురస్కారం వరించింది. ఆయన ఆరోగ్యం, జీవనోపాధి, సాధికారతపై దృష్టి పెడుతూ నైపుణ్యాభివృద్ధి–స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటుగా జైపూర్, ఢిల్లీ, భోపాల్, ఇండోర్, గ్వాలియర్, గౌహతి లాంటి నగరాల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. అనేక అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో కలిసి పనిచేశారు. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, బ్లూమ్‌బెర్గ్, ఐరోపా కమిషన్, పాకార్డ్ ఫౌండేషన్, జపాన్ ఫౌండేషన్, ఎంపోహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ.ఈఅండ్ వై, కేపీఎంజీ, డెలాయిట్, జీవీకేయీఎంఆర్ఐ, పాపులేషన్ హెల్త్ సర్వీసెస్, ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్, జెనీవాలో పలు హోదాలలో సేవలను అందించారు. ప్రభుత్వ, కార్పొరేట్, సామాజికం, అభివృద్ధి రంగాల్లో క్షేత్రస్థాయి నుంచి అత్యున్నత నిర్వహణ




స్థాయివరకు నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన అనుభవాన్ని సంతరించుకున్నారు. ప్రజారోగ్య విధానం, నిర్వహణ, విపత్తు, అత్యవసర నిర్వహణ, జీవనోపాధి, మహిళాసమస్యలకు పరిష్కారం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, గిరిజన హక్కులు, పౌష్టికాహారం, వైకల్యం, రహదారి భద్రత, క్షతగాత్రులకు సేవ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అనిర్వచనీయమైన సేవలను అందించారు. కార్పొరేట్ వ్యూహాత్మక ప్రణాళిక రచన, ప్రజా విధాన రూపకల్పన, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత, ప్రాజెక్ట్/ప్రోగ్రామ్ నిర్వహణ, సామాజిక వనరుల సమీకరణ, న్యాయవాదం(అడ్వొకసీ), పరిశోధన, శిక్షణ, అభివృద్ధి లాంటి రంగాల్లో అపరిమితమైన జ్ఞానసముపార్జన చేశారు. విద్యాభ్యాసానికి సంబంధించి ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ నుంచి అడ్వాన్స్‌డ్ మెథడాలజీలో పీజీ, ప్రపంచబ్యాంక్ నుంచి ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంలో సర్టిఫికేట్ కోర్సు, జర్నలిజమ్, మాస్ కమ్యూనికేషన్‌లో పీజీ, సింబియాసిస్ నుంచి హెల్త్‌కేర్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ, మార్కెటింగ్, బ్రాండ్, ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ, రీప్రొడక్టివ్ హెల్త్, సోషల్ మార్కెటింగ్‌లో ఎంఫిల్, ప్రజారోగ్యం, సోషల్ మార్కెటింగ్‌లో డాక్టొరేట్ పీహెచ్‌డీ లాంటి అనేక పట్టాలను పొందారు. ఏకకాలంలో ఇటు అణగారినవర్గాలతోనూ, ప్రభుత్వ ఉన్నతాధికారులతోను ప్రత్యక్షంగా సంప్రదింపులు జరపడం ద్వారా విధానరూపకల్పనకు క్షేత్రస్థాయి వాస్తవికతలను అనుసంధానించడంలో పేరు పొందారు. ★

## కథ

ఐదేళ్ళ పసివాడి మనస్సు అల్లకల్లోలం అవుతున్న సముద్రాన్ని కసిగా చూస్తోంది. వాడి చూపుల్లో ద్వేషం. చెప్పులు లేని వాడి కాళ్లని సముద్రపు జలాలు ఉండుండి అభిషేకిస్తున్నాయి. పదేపదే క్షమించమని పసివాడిని ప్రాధేయ పడుతున్నాయి.

కొన్ని రోజుల క్రితం అంతా ముగిసిపోయింది. వాడి కలలు ఇంకా రూపు దాల్చకుండానే నేలరాలిన పువ్వుల్లా వాడిపోయాయి. అవసరాలు తీర్చే అమ్మ లేదు. ఆదుకునే నాన్న లేడు. నాన్నమ్మ, తాతయ్య ఓపిక ఉన్నంత వరకూ బుజ్జగిస్తారు. తర్వాత అలసిపోయి ఒదిలేస్తున్నారు.

అమ్మ ఆకలి తీర్చేవరకూ వెంట తిరిగేది. నాన్న ఏది కావాలన్నా క్షణాల్లో తెచ్చి ఇచ్చేవాడు.

రాత్రి పగలూ ఏడుస్తూ బెంగటిల్లిపోతున్నాడు చిన్ను. అర్ధరాత్రి అయినా తలుపులు మూయనివ్వడం లేదు. 'అమ్మానాన్న వస్తారు నాన్నమ్మా' అంటూ గోల చేస్తాడు. ఆ పసివాడిని ఓదార్చడం చేతకావడం లేదు ఎవరికీ. 'నాన్న సోఫాలో కూర్చున్నాడు' అంటూ పరుగెత్తుతాడు. నాన్నమ్మ కన్నీళ్లతో పసివాడిని గుండెకు హత్తుకుంటుంది. తాతయ్య తనలో తనే దుఃఖ పడుతున్నాడు. జరిగింది తలుచుకుని ఏడుస్తున్నాడు చిన్ను.

"చిన్నూ! బీచ్‌కి వెళదాం అని అడిగావు కదా! వెళదామా!" అడిగాడు ప్రభాకర్. కొడుకును రెడీ చేసి తనూ రెడీ అయ్యింది సుమలత.

"నాన్నా! నా బాల్" అంటూ తెచ్చుకున్నాడు చిన్ను. దారంతా చిన్నూ మాట్లాడుతూనే ఉన్నాడు. వాడి ముద్దుముద్దు మాటలకు అమ్మానాన్నలు మురిసి పోయారు. దారిలో ఐస్ క్రీం కొనమంది సుమలత. "బీచ్ దగ్గర కొనుక్కుందాం" అన్నాడు చిన్నూ.

"సరే అక్కడే తీసుకుందాం" అన్నాడు ప్రభాకర్. చిన్నూ కారు దిగగానే బాల్ తీసుకుని పరుగెత్తాడు. సుమలత కంగారుగా పిలవబోతుంటే వారించాడు ప్రభాకర్.

"చిన్నూ! ఎప్పట్నించో కేమిల్ ఎక్కాలంటున్నావుగా ఎక్కు" అన్నాడు ప్రభాకర్.

చిన్నూ సంతోషంగా తండ్రి చెయ్యి పట్టుకొని ఊపేసాడు. ఎప్పుడూ వద్దనే నాన్న ఒప్పుకున్నందుకు.. బాల్ తల్లి చేతికిచ్చి కేమిల్ ఎక్కికూర్చుని ఆనందంగా అమ్మానాన్నలకు టాటా చెప్పాడు.

తిరిగి వచ్చిన చిన్నూకి అమ్మానాన్నలు కనబడలేదు. అందరూ కంగారుగా మాట్లాడుకుంటూ సముద్రపు అలల వైపు చూస్తున్నారు. ఎవరో పోలీసులకు, తర్వాత అంబులెన్స్‌కు ఫోన్లు చేసారు.



# కలకానిది విలువైనది

జె. రమాదేవి



ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వాడి కళ్లకు దూరంగా అలలపై తేలుతున్న తన బ్లూ కలర్ బాల్ కనబడింది. రెండు గంటలతర్వాత రెండు మృతదేహాలతో అంబులెన్స్ బీచ్ దాటి పరుగెత్తింది.

పసి మనసు దుఃఖం ద్వేషంలోకి మళ్లింది. ఇప్పుడు వాడికి సముద్రపు అలలతో ఆడుకోవాలని లేదు. "నేను నిన్ను ఎప్పటికీ క్షమించను. ఎన్నిసార్లు నా కాళ్లు పట్టుకుని క్షమించమని అడిగినా క్షమించను..."

బంధువులు ఈటెల్లాంటి మాటలతో గుచ్చుతున్నారు. "అప్పు చేసి పప్పు కూడు తినాలనుకుంటే ఇలాగే ఉంటుంది మరి. ఉన్నదంతా పెట్టి రిచ్ ఏరియా అంటూ ఇంత పెద్దిల్లు కొన్నారు. కారు.. అబ్బో రిచ్ పార్టీలు, పంక్షన్‌లు... అవ్వ పిల్లాడి బర్తడేకి యాభైవేలు ఖర్చుపెట్టారంట. ఆఫీసులో డబ్బు కోసం కక్కుర్తి పడ్డాడని ఉన్న జాబు ఊడిందట కదా!"

తాతయ్యా నానమ్మ వినలేక చెవులు మూసుకుంటున్నారు. పాతికేళ్ల నాటి గతం అతనికి నిన్నో మొన్నో జరిగినట్లు కళ్లముందు కనబడుతూ హెచ్చరిస్తూనే ఉంటుంది.

"హలో హీరో! బ్యాంకుకే కదా వెళ్లేది! నన్ను కొంచెం చౌరస్తా దగ్గర డ్రాప్ చేస్తావా?" అడిగింది మాలతి.

పునీత్ ఆమె వైపు ఒక్కక్షణం చూసి "రండి డ్రాప్ చేస్తాను. ట్వంటీ రూపీస్ మీకు ఒకే కదా" అనడంతో ఆ అమ్మాయి మొహం ఎప్పటిలాగే చిన్నబుచ్చుకుంది.

ఓ అందమైన అమ్మాయి లిఫ్ట్ అడిగితే చాలు చొంగలు కార్చుకుంటూ ఎగబడతారు. అలాంటిది ఈ పునీత్ ఎప్పుడూ డబ్బు గురించి తప్ప మరోమాట మాట్లాడడు. ఏంటసలు ఇతగాడు? డ్రాప్ చెయ్యడానికి ట్వంటీ రూపీస్ ఇవ్వమని నిర్మొహమాటంగా అడుగుతున్నాడు. మొన్నటికి మొన్న కేంటీన్లో కాఫీ తాగుదామా అంటే, 'ఎవరి బిల్ వాళ్లదే అయితే సరే 'అన్నాడు.

ఓసారి అతన్ని భోజనానికి రమ్మని పిలిచింది.

"వద్దు మాలతీ! ఇప్పుడు నువ్వు భోజనానికి పిలుస్తావు. తర్వాత నేను పిలుస్తానని ఆశిస్తావు. ఇలా ఇచ్చి పుచ్చుకుంటూ పోతుంటే అంతుండదు. అలాగే మనీ ఖర్చు కూడానూ" అంత విపులంగా అతను చెప్పాక ఆమె మౌనం వహించక తప్పలేదు.

మొదటిసారి పునీత్ బ్యాంకులో అడుగుపెట్టగానే నచ్చేసాడామెకి. ఆమెకు అతను కొలీగ్. ఆరడుగుల అందగాడు బ్యాంకు జాబు. ఎలాంటి బేడ్ హేబిట్స్ లేవని మనసు పడింది కానీ, ఇలా ప్రతి దానికి బడ్జెట్ బ్రహ్మానందంలా మాట్లాడతాడని అనుకోలేదు. ఆమెతో ఇష్టంగా, సరదాగానే కాలక్షేపం చేస్తాడతను.

"అసలు డబ్బులు అంటే ఎందుకు నీకంత పిచ్చి? డబ్బు అందరికీ అవసరమే కానీ, ప్రతిదానికీ డబ్బుతో ముడిపెడితే నీకంటూ ఎవరూ మిగలరు పునీత్! చివరికి ఆ డబ్బు కూడా నిన్ను వ్యతిరేకిస్తుంది" అంటూ క్లాస్ పీకిందామె.

"డబ్బంటే నాకు వ్యామోహం లేదు మాలా! భయం. నాకు అమ్మానాన్నలను లేకుండా చేసింది ఆ డబ్బే. మా అమ్మానాన్నలు డబ్బును సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. అది ఆడించినట్లు ఆడేరు. చివరికి దానికోసం బలయిపోయారు. నాకు అందుకే డబ్బంటే భయం. దానితో వచ్చే ఏ సంతోషాలు నాకు అవసరం లేదు. అందుకే దాన్ని నా చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నాను. అర్థం అయితే అందరూ పాటిస్తారు. లేదంటే మానేస్తారు. నో ప్రోబ్లం" అంటూ భుజాలెగరేసేడు.

ట్వంటీ రూపీస్ అతని చేతిలో పెట్టి అతని వెనక బైక్ మీద కూర్చుందామె. దారంతా అతన్ని కిందికి తోసెయ్యాలన్నంత కోపాన్ని పంటి బిగువున దాచుకుని కూర్చుంది.

పునీత్‌తో పరిచయం అయిన కొత్తలో ఇద్దరిది ఒకే ఏరియా కాబట్టి, అతని బైక్ మీద లిఫ్ట్ అడిగి బ్యాంకుకు వచ్చెయ్యొచ్చు ఎంచక్కా అనుకుంది. డబ్బులు పోతాయని కాదు. పరిచయం పెరిగితే తన లైఫ్ సెటిల్ అయిపోతుందని. తనకంటూ ఉన్నది తల్లి మాత్రమే. తనకు పెళ్లి చేసే స్థోమత గానీ, సంబంధాలు వెతికే వోపిక గానీ ఆవిడకు లేవు.

తన చిన్నప్పుడే తండ్రి చనిపోతే, నాలుగు చోట్ల ఎవరేం పని చెబితే అది చేసి, అవమానాలు పొంది తనకోసం బతికింది. గాడి పొయ్యిల దగ్గర వంటలు చేసింది. విందు భోజనాల్లో విస్తర్లు ఎత్తింది. పని దొరకని రోజున తనకు కడుపు నింపి ఆవిడ పస్తు పడుకుంది. తను చిన్నతనం నుంచి ఆవిడ కష్టాలు చూసింది. రూపాయి కోసం దినదిన గండంగా ఉండేది. మంచి బట్టలు వేసుకోవాలన్నా... మంచి తిండి తినాలన్నా... ఫ్రెండ్స్‌తో ఎటైనా వెళ్లాలన్నా డబ్బు లేదు. తన చదువుకోసం, తన పొట్ట నింపడం కోసం అమ్మ పడిన కష్టాలు తనకు తెలుసు.

అమ్మకు కష్టమనేది లేకుండా చూసుకోవాలనే ఆశతో శ్రద్ధగా చదువుకుంది. బ్యాంకు టెస్టులకు కోచింగ్ లేకుండానే, వాళ్లనీ వీళ్లనీ ప్రాధేయపడి బుక్స్,

నోట్స్ సంపాదించుకుని ప్రిపేరయింది. జాబుకు సెలక్ట్ అయ్యాక అమ్మను తనతో తెచ్చుకుంది. అమ్మ చాలా అలసిపోయింది. ఓపిక లేకపోయినా తనకు పెళ్లి చేయలేకపోతున్నందుకు ఎప్పుడూ దిగులుపడుతూ ఉంటుంది. ఆమె దిగులు పోగొట్టడం కోసమైనా తనే వరుణ్ణి వెతుక్కోడం మొదలుపెట్టింది. ఆ క్రమంలోనే ఆమెకి పునీత్ చాలా నచ్చేసాడు. ఇంక తనకి పెళ్లయిపోయినట్టే అనుకుంది. దానిక్కారణం అతను తనంటే ఇష్టంగానే ఉంటున్నాడని.

కానీ అతనిలా ప్రతీదాన్నీ డబ్బుతో ముడిపెట్టడం నచ్చడంలేదు. ఐదు పదుల జీతం వస్తుంది. ఒంటరివాడు. ఏ బాధ్యతలూ లేనివాడు. హాయిగా బిందాస్‌గా ఎంజాయ్ చేయకుండా, డబ్బు డబ్బు అంటూ మూటగట్టడం ఆమెకి నచ్చడం లేదు. పెళ్లి చేసుకుంటే రేపు కాపురం చేసే ప్రతిరోజుకూ డబ్బుతో ముడేస్తాడేమో? అతనితో జీవితం షేర్ ఆటోలెక్క అవుతుందేమోననే భయం పట్టుకోడంతో, ఆమె ఆ సాహసం చేయలేక దూరంగా ఉండిపోతోంది.

ఆరోజు ఆదివారం. పునీత్ ఉదయమే హడావిడిగా బయలుదేరాడు. ఆమె కూడా కుతూహలంగా వెంబడించింది. అతని బైక్ ఓ అనాథాశ్రమం ముందు ఆగింది. 'ఓ ఇతనికి ఇంత మంచి బుద్ధి కూడా ఉందా? నాలుగు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిచ్చి ఓ సెల్ఫీ దిగి గొప్పగా చెప్పుకుంటాడు కాబోలు' అనుకుంది. అతను అక్కడ చాలాసేపు టైం స్పెండ్ చేసాడు. ఆమె ఇంటికి వచ్చేద్దాం అనుకుంటూండగా లోపలికి రమ్మంటూ కబురొచ్చింది. అతను గమనించేశాడని తెలిసి సిగ్గేసింది.

"రండి మాలా! ఎందుకు గేటుదగ్గరే ఆగిపోయారు? "నవ్వుతూ అడిగాడు పునీత్.

"చెప్పండి మేడమ్! మీరుకూడా ఎవరినైనా ఎడాప్ట్ చేసుకుంటారా? అలా చేసుకుంటే కొంతమంది పిల్లలకైనా లైఫ్ ఇచ్చినవాళ్లు అవుతారు. పునీత్ సార్ రెండేళ్ల క్రితం ఇదిగో ఈ ఇద్దరు పాపల్ని ఎడాప్ట్ చేసుకుని చదివిస్తున్నారు. తండ్రి స్థానంలో ఉండి వాళ్ల అవసరాలు తీరుస్తున్నారు. ప్రతి ఆదివారం ఇక్కడికి వచ్చి వాళ్లతో గడుపుతారు. వాళ్లు చూడండి మేడమ్ ఎంత సంతోషంగా ఉన్నారో" సీట్లో కూర్చున్న పెద్దావిడ గుక్క తిప్పుకోకుండా చెబుతోంది.

ఎందుకో అదంతా ఆమెకు నమ్మాలనిపించలేదు. చిన్న పంచదార పలుకు కింద పడితే ఎక్కడ దాన్ని చీమ పట్టుకు పోద్దోనని తీసి డబ్బాలో వేసుకునే రకం అతను. ఇద్దరు అనాథ పిల్లల్ని ఎడాప్ట్ చేసుకుని, వాళ్ల ఖర్చులు భరిస్తున్నాడంటే తను చచ్చినా నమ్మదు. ఊరికే వచ్చేస్తే అతని ముందు షేమ్‌గా ఉంటుందని, హేండ్ బేగ్‌లోంచి ఐదువేలు తీసి డొనేట్ చేసి ఇంటికొచ్చింది. తర్వాత అతను ఆ విషయాలేమీ కదిలించలేదు. ఆమె కూడా పట్టించుకోడం మానేసింది.

ఆరోజు పబ్లిక్ హాలిడే. సెలవు కావడంతో ఉదయమే గబగబా పనులు పూర్తి చేసుకుంది. ఊళ్లో ఉంటున్న ఫ్రెండ్స్‌ని కలవాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా కలవలేకపోతోంది. అందుకే అన్ని పనులూ పూర్తి చేసి, తల్లికి కావల్సిన మెడిసిన్ అవీ సర్దిపెట్టి, ఒకటికి రెండుసార్లు జాగ్రత్తలు చెప్పి ఆటోలో బయలుదేరింది. ఏదైనా అవసరం అయితే ఫోన్ చెయ్యమంది.

చీకటి పడేవరకూ వాళ్లు వదల్లేదు. ఎంజాయ్‌మెంటుతో అలసిపోయి ఇంటికొచ్చింది. ఇంటికి తాళం వేసుంది. ఆమె కంగారుగా చుట్టూ ఉన్నవాళ్లని అడిగింది. ఎవరికీ ఏమీ తెలీదంటున్నారు. అమ్మ తనని వదిలి ఎటెళ్లిపోయింది? ఆమె ఆరోగ్యం సరిగ్గా ఉండటం లేదు. తను లేకుండా ఎటూ వెళ్లలేని మనిషి ఏమైపోయినట్టు?.. గుక్క పట్టి ఏడవాలనుంది. తాళం తీసిలోపలికి వెళ్లాలనే ధ్యాసే లేకుండా మెట్లమీద కూర్చుని ఉండిపోయింది.

ఎవరో వచ్చి లైటు వేసేవరకూ ఆమెకు చీకటిలో కూర్చున్నాననే ధ్యాసే లేదు.

"ఏంటి మాలా! ఇక్కడ కూర్చున్నావు లోపలికి వెళదాం రా!" అంటూ రెండు చేతులు ఆమెను పైకి లేపాయి. అమ్మా! అమ్మా! అంటూ చుట్టుకుపోయి ఏడ్చింది మొదటిసారి. చిన్నప్పుడు గాడి పొయ్యిలదగ్గర అమ్మ వంట చేస్తున్నప్పుడు తనూ చేస్తానంటే కోప్పడేది. "నువ్వు చదువుకుని మహారాణిలాగా బతకాలి మాలా! నా ఆయుష్షు కూడా పోసుకుని నిండునూరేళ్లూ చల్లగా బతకాలి" అని కౌగిట్లోకి తీసుకుంటే తను గింజుకునేది. అమ్మ దగ్గర చెమట వాసన వస్తోందని తను అన్నా ఆవిడ ఎప్పుడూ తనని దూరం చేసుకోలేదు. ఇప్పుడు కూడా ఆమె దగ్గర చెమట వాసన వస్తోంది. అయినా పెన్నిధి దొరికినట్లు వదలాలని లేదు.

"ఏంటి మాలగారూ! అనారోగ్యంతో ఉన్నావిడను వదిలి వెళ్లేప్పుడు ఆవిడ బాధ్యత ఎవరికైనా అప్పజెప్పాలి కదా! సమయానికి నేను వచ్చి చూశాను. కళ్లుతిరిగి పడిపోయున్నారు. ఆ టైం లో మీకు ఫోన్ చెయ్యాలన్న ఆలోచన కూడా రాలేదు. వెంటనే హాస్పిటల్ కి తీసుకెళ్లాను. బాగా వీక్గా ఉన్నారంట. సెలైన్ పెట్టడం వల్ల ప్రోబ్లం అవుతుందని ఇంజెక్షన్ చేసారు. ఇప్పుడు ఓ కె "ఫ్రూట్స్ బేగ్ అందిస్తూ అన్నాడు పునీత్.

అతన్ని గురించి తనేమనుకుంది! పంచదార పలుకు కిందపడితే చీమ ఎత్తుకు పోద్దని ఎత్తి డబ్బాలో వేసుకుంటాడు అనుకుంది కదా! సిగ్గుతో ఆమె కళ్లు పాతాళంలోకి దిగబడ్డాయి.

"థేంక్యూ పునీత్ గారూ! నా లైఫ్‌లో మా అమ్మ చాలాచాలా ఇంపార్టెంట్ " అంటూ చేతులు జోడించింది మనస్ఫూర్తిగా. పునీత్ ఆమె థేంక్స్‌ని యాక్సెప్ట్ చేసి వెళ్లిపోయాడు.

"మాలా! నువ్వు పునీత్‌ని పెళ్లి చేసుకోమ్మా!" అనడుగుతున్న తల్లికి ఏం చెప్పాలో అర్థం కాలేదామెకి ఆ రాత్రి.

* * *

"ఎప్పటిలాగే ఇద్దరం మనీ షేరింగ్ చేసుకుందాం" అందామె అతని వెనక బైక్ మీద కూర్చుని. ఆమె మెడలో పచ్చని పసుపుతాడు నవ్వుకుంది.

"నిజమే షేరింగ్‌లోనే ఆనందం ఉంటుంది మిసెస్ మాలతీదేవి గారూ!" నవ్వేడతను.

వెళుతున్న ఇద్దరివైపూ ఆనందంగా చూసింది ఆమె తల్లి. ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలకు తల్లి.




వచ్చేవారం కథ..



**వెన్నెలకి ఆవల**

– భమిడిపాటి గౌరీశంకర్

క్రీడలు కూటికా! గుడ్డకా? అనుకొనే రోజులు పోయాయి. ఆటలు ఏవైనా కోట్లకు బాటగా మారిపోయాయి. క్రీడలే వృత్తిగా చేసుకొంటే, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా రాణించగలిగితే కోట్లకు పడగలెత్త వచ్చునని పలువురు భారత క్రీడాకారులు చాటి చెప్పారు.



# ఆటలు భారీ ఆర్జనకు బాటలు

కాలం మారుతుంది. కాలంతో పాటే అర్థాలు, పరమార్థాలు మారిపోతూ ఉంటాయి. ఒకప్పుడు దండుగ, సమయం వృథా అనుకొన్నవే ఇప్పుడు జీవితంగా, భారీ సంపాదనకు బాటలుగా మారి పోయాయి. దానికి నిలువెత్తు నిదర్శనమే నేటి క్రీడారంగం.

1970 దశకంలో పిల్లలు చదువు కంటే ఆటలకు ప్రాధాన్యమివ్వటాన్ని తల్లిదండ్రులు, గురువులు ఏ మాత్రం సహించలేకపోయేవారు. ఆటలు అన్నం పెడతాయా? క్రీడలు కూటికా? గుడ్డకా? అంటూ నిరుత్సాహ పరచడం మనందరికీ తెలిసిందే. అయితే... ప్రపంచీకరణ పుణ్యమా అంటూ ఈ భూఖండమే ఓ గ్రామంగా మారిపోడంతో క్రీడా రంగం లక్షల కోట్ల రూపాయల వ్యాపారంగా మారి, క్రీడాకారులు అభినవ కుబేరులుగా పరిణామం చెందారు.

**క్రీడలు ఏవైనా కోట్లే కోట్లు...!**

ఐదు దశాబ్దాల క్రితం అమెచ్యూర్ దశలో ఉన్న క్రీడారంగం ప్రస్తుతం ప్రొఫెషనలిజానికి చిరునామాగా నిలిచింది. ఫుట్ బాల్, క్రికెట్, బాస్కెట్ బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్, గోల్ఫ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, చదరంగం, ఫార్ములావన్ కార్ రేసింగ్ నుంచి భారత దేశవాళీ క్రీడ కబడ్డీ వరకూ ప్రతిభావంతులైన క్రీడాకారుల పాలిట కల్పవృక్షంగా మారాయి. క్రీడలే వృత్తిగా, జీవితంగా మార్చుకొన్న ప్రతిభా వంతులైన ఎందరో క్రీడాకారులు వందల కోట్ల రూపాయల సంపాదనపరులుగా ఎదిగారు. ప్రపంచ వ్యాప్తంగా గోల్ఫ్, బాక్సింగ్, ఫుట్ బాల్, ఫార్ములావన్, చెస్ క్రీడలు కోట్ల రూపాయలపంటను పండిస్తుంటే... అత్యధిక జనాభా కలిగిన మనదేశంలో మాత్రం క్రికెటర్లు సంపాదనలో తమకుతామే సాటిగా నిలుస్తున్నారు.

**సచిన్ నుంచి స్మృతి మందన వరకూ...**

ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన భారత్‌లో క్రికెట్టే అనధికారిక జాతీయ క్రీడగా, అత్యధిక అభిమానులున్న క్రీడగా కొనసాగుతోంది. ముంబైలోని ఓ మధ్యతరగతి కుటుంబం నుంచి క్రికెట్‌లోకి దూసుకొచ్చిన సచిన్ టెండుల్కర్ రెండు దశాబ్దాల పాటు తన అసాధారణ ఆటతీరు, అరుదైన ప్రపంచ రికార్డులతో 'భారత క్రికెట్ దేవుడిగా' నీరాజనాలు అందుకొన్నాడు. మ్యాచ్ ఫీజులు, ఎండార్స్‌మెంట్లు, బీసీసీఐ నజరానాలతో రూ.వెయ్యి కోట్లకు పైగా సంపాదించాడు. ఆ తరువాత వచ్చిన మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీలు సైతం అంతే స్థాయిలో ఆర్జించినవారే. 2008లో ప్రారంభమైన ఐపీఎల్‌తో ప్రతిభా వంతులైన జాతీయ, అంతర్జాతీయ, దేశవాళీ క్రికెటర్ల దశ ఒక్కసారిగా తిరిగిపోయింది. ఐపీఎల్ వేలం ద్వారా కోటీశ్వ రులుగా మారిన క్రికెటర్లు డజన్ల కొద్దీ ఉన్నారు. మహిళా క్రికెటర్లు మిథాలీరాజ్, స్మృతి మందన, హర్మన్ ప్రీత్ కౌర్ సైతం మ్యాచ్ ఫీజులు, ఐపీఎల్ కాంట్రాక్టులతో కోట్ల రూపాయలు కళ్ల జూశారు. 13 సంవత్సరాల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ వేలంతో బాల కోటీశ్వరుడిగా మారినవాడే. దేశవాళీ రంజీ క్రికెట్ మ్యాచ్ ఆటగాళ్లు సైతం రోజుకు రూ.50 వేలు సంపాదించే స్థాయికి ఎదిగారు.

**టెన్నిస్‌లో విజయ్ , పేస్, మహేశ్, సానియా...**

రాయల్ గేమ్ టెన్నిస్‌ను వృత్తిగా చేసుకొన్న 1970 నాటి సూపర్‌స్టార్ విజయ్ అమృత్ రాజ్, రమేశ్ కృష్ణన్, లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా 50 నుంచి 100 కోట్ల రూపాయలకు పైగా సంపాదించినవారే. గ్రాండ్ స్లామ్ (వింబుల్డన్, ఫ్రెంచ్, ఆస్ట్రేలియన్, అమెరికన్) ఓపెన్ టెన్నిస్ టోర్నీలలో విజేతగా నిలిచిన క్రీడాకారులకు రూ. 20 కోట్ల నుంచి 40 కోట్ల వరకూ ప్రైజ్ మనీ ఇస్తారంటే ఆశ్చర్యం కలగక మానదు.

**సైనా, సింధు తక్కువేం కాదు....**

భారత బ్యాడ్మింటన్‌కు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన సైనా నెహ్వాల్, పీవీ సింధు వివిధ రూపాలలో రూ. వంద కోట్లకు పైగా సంపాదించిన వారే. చదరంగంలో భారత తొలి సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ నుంచి నేటితరం సూపర్ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ వరకూ చెస్ క్రీడనే నమ్ముకొని భారీగా ఆర్జించగలిగారు.

భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ సూపర్ స్టార్, బల్లెం విసురుడులో బాహుబలి నీరజ్ చోప్రా ప్రపంచ, ఒలింపిక్, డైమండ్ లీగ్ టైటిల్స్ విజయాలతో రూ.కోట్లు ప్రైజ్ మనీ, ప్రోత్సాహక నగదు బహుమతుల రూపంలో అందుకోగలిగాడు. కుస్తీ, హాకీ, ఫుట్ బాల్, బిలియర్డ్స్ అండ్ స్నూకర్, బాక్సింగ్, గోల్ఫ్ క్రీడలు సైతం భారత క్రీడాకారులకు కాసుల వర్షం కురిపిస్తూ ఆర్థిక భద్రతను కల్పిస్తున్నాయి.

క్రీడల్ని వృత్తిగా చేసుకొనేలా తమ పిల్లల్ని ప్రోత్సహిస్తున్న, తీర్చిదిద్దుతున్న తల్లిదండ్రుల సంఖ్య రానురాను పెరుగుతుండడం అభినందించవలసిన విషయమే.

తమకు నచ్చిన క్రీడను ఎంచుకొని, అంకిత భావంతో సాధన చేసి ప్రపంచ స్థాయిలో రాణించ గలిగితే రికార్డులు, నజరానాలు, భారీ కాసులు కురిపించే ఎండార్స్‌మెంట్లు... వీటన్నింటినీ మించి అంతర్జాతీయ గుర్తింపు దక్కుతాయనటానికి సచిన్, ధోనీ, విరాట్, సానియా, గుకేశ్‌లను మించిన నిదర్శనం మరొకటి లేదు.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

**సమీప గతం వరకు కూడా దక్షిణాసియాలో చాలా భాగం భారతదేశంగానే ప్రవర్ధిల్లిందా? చరిత్ర పుస్తకాలలో చెప్పకపోతేనేం! ఐదుసార్లు దక్షిణాసియాకు సరిహద్దులు ఏర్పడ్డాయని సామ్ డాల్రింపుల్ తన కొత్త పుస్తకం 'ష్యాటర్డ్ ల్యాండ్స్: ఫైవ్ పార్టిషన్స్'లో చక్కగా వివరించారు. ఒక విభజన చరిత్ర గురించి తెలుసుకోవాలని భావిస్తే ఇతర విభజనల చరిత్ర కూడా ఎక్కడో ఒకచోట మనకు తారసపడుతుంది. దేశ విభజన అంటే ఏ కాలంలో అయినా బాధాకరమైన పరిణామమే. నిజానికి భారత్ వందేళ్ల వ్యవధిలోనే ఏడు పర్యాయాలు ముక్కలయింది. ఐదు విభజనలు అని ఈ పుస్తకంలో సామ్ చెప్పినా, మిగిలిన విభజనల గురించి కూడా 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకునే అవకాశం ఆయన కల్పించారు. ప్రపంచంలో జర్మనీ, వియత్నాం, కొరియా, పోలండ్ వంటి దేశాలు చీలిపోయాయి. కొన్ని మళ్లీ కలిశాయి. కానీ ప్రతి దేశానికి విభజన ప్రక్రియ గాయాలనే మిగిల్చిందన్నది వాస్తవం.**




# భారత్‌ను ఎన్ని

భారత్ విభజనల సంగతి ప్రజలు మరచిపోయారు. నిజానికి పాకిస్తాన్ 1947లో విడిపోతే, అంతకు సరిగ్గా పదేళ్ల ముందు 1937లో బర్మా భారత్ నుంచి విడిపోయింది. తరం తరువాత తరం వారి దృష్టి నుంచి ఈ వాస్తవాలు క్రమంగా కనుమరుగైపోతాయి. విభజన త్రిపుర మీద ఎలాంటి ప్రభావం చూపింది అన్న అంశం ఈ పుస్తక రచయిత పరిశోధనకు స్వీకరించారు. మొత్తం ఐదు విభజనల చరిత్ర పరిశోధనకు దారి తీసింది. త్రిపుర వెళ్లిన సామ్, ఒక వృద్ధుడి దగ్గరకు వెళ్లి, ఒక ప్రశ్న వేశాడు. 'విభజన త్రిపురను ఏ విధంగా ప్రభావితం చేసింది?' కానీ సామ్ ఊహించలేదు పాపం. 'మీరు మాట్లాడుతున్నది ఏ విభజన గురించి?' అన్నాడా వృద్ధుడు. అక్కడితో ఆగలేదు. మీరు అడుగుతున్నది 1937 నాటి బర్మా విభజన? 1947 నాటిదా? 1971లో జరిగిన విభజన? అని కూడా అడిగాడాయన. సామ్‌కు జ్ఞానోదయం అయిందనే చెప్పాలి. 1947 నాటి దేశ విభజన, త్రిపుర మీద ప్రభావం అన్న అంశం కాస్తా, ఐదు విభజనల పరిశోధనకు విస్తరించింది. అంటే బర్మా (నేటి మైన్మార్) ఫూల్స్ డే విభజన (అంటే ఏప్రిల్ 1న జరిగిన విభజన) నుంచి 1971 నాటి బాంగ్లాదేశ్ విభజన వరకు. అవన్నీ కలిపి 12 దేశాలకు జన్మనిచ్చాయి. కొద్దిమందికి మాత్రమే ఈ విభజనల పరంపర గురించి తెలుసు.

బర్మా అంటే పూర్వపు భారతదేశంలో అత్యంత సంపద్వంతమైన భూభాగం. దీని అసలు పేరు బ్రహ్మదేశం. ఆనందవర్తనుడు అనే రాజు పాలించాడు. కాలక్రమంలో ఒక శతాబ్దం పాటు ఆ భూభాగం భారతావనిలోనే ఉంది. కానీ 1920–30 ప్రాంతంలో అక్కడ ఉపాధి ఉద్యోగాల విషయంలో ఉద్రిక్తతలు తలెత్తి బ్రిటిష్ ప్రభుత్వం వదిలివేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్ 1, 1937న బర్మా భారతదేశం నుంచి వేరు పడింది. ఇక్కడ ఒక విషయం గుర్తు చేసుకోవాలి. బర్మా విభజన కేంబ్రిడ్జ్‌లో చదువుతున్న రహమత్ అలీ చౌధురిలో పాకిస్తాన్ అనే ఆలోచనకు బీజం వేసింది. బర్మా భారత్ నుంచి విడివడినప్పుడు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలు ఎందుకు విడిపోకూడదు అన్న ప్రశ్న వేసుకున్నాడు. దానిని మహమ్మదలీ జిన్నా ముందు పెట్టినా అప్పుడు ఆయన అంగీకరించలేదు. కానీ తరువాత కాంగ్రెస్ జిన్నాను పాకిస్తాన్ ఏర్పాటు వైపు నెట్టింది.

సామ్ ఏ ఆధారాలతో చెబుతున్నారో కానీ, 1950 వరకు భారత్–పాకిస్తాన్ మధ్య మంచి సంబంధాలే ఉన్నాయంటున్నారు. అది కూడా కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరగకుండా సహకరించుకోవడంలోనంటారాయన. అందుకు నిఘా సమాచారాన్ని కూడా పంచుకున్నారని కూడా పేర్కొన్నారు. కానీ 1961లో గోవా విమోచనతో నాటి మిలటరీ పాలకుడు ఆయూబ్‌ఖాన్ ఆలోచనా విధానం మారిపోయింది. భారత్‌లో రాజ్య విస్తరణ ధోరణి పెరిగిపోయిందని, గోవా తరువాత పాకిస్తాన్ వంతేనని నమ్మాడని సామ్ చెబుతున్నారు. ఇది జరిగిన కొన్ని మాసాలలోనే ఈశాన్య భారతదేశంలో వేర్పాటువాద ఉద్యమాలకు పాకిస్తాన్ నిధులు ఇవ్వడం ప్రారంభించింది. ఇందుకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని పష్తూన్, బెంగాలీ ప్రాంతాలలో తిరుగుబాట్లకు భారత్ కూడా మద్దతు ఇవ్వడం మొదలుపెట్టిందని ఆయన కథనం. ఇవన్నీ ఇటీవల అవినాశ్ పాలివాల్ అనే పరిశోధకుడు బయటకు తెచ్చిన చారిత్రక ఆధారాల మేరకు సామ్ తన పుస్తకంలో పొందుపరిచారు.

జవహర్‌లాల్ నెహ్రూ, భారత ఆఖరి వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ సతీమణి ఎడ్వినాల బంధం గురించి ఇప్పటికే అనేక మంది రచయితలు, చరిత్రకారులు చర్చించారు. వీళ్లిద్దరి మధ్య ఉన్నట్టు చెప్పే ఆ గాఢ బంధాన్ని బట్టే మౌంట్‌బాటన్‌ను జిన్నా

# సార్లు ఖండించారు?

నమ్మలేకపోయాడన్నది సామ్ కథనం. దానితోనే పాకిస్తాన్‌కు కూడా గవర్నర్ జనరల్‌గా మౌంట్‌బాటన్ కొనసాగడానికి జిన్నా నిరాకరించాడని సామ్ చెబుతున్నారు. అయితే భారత్‌కు కొద్దిరోజులు మౌంట్‌బాటన్ గవర్నర్ జనరల్‌గా ఉన్నారు. జవాహర్, ఎడ్వినాల దగ్గరి బంధం గురించి కావలసినంత సమాచారమే చరిత్రలో దొరుకుతున్నది. ఆఖరి వైస్రాయ్ లేదా గవర్నర్ జనరల్‌గా మౌంట్‌బాటన్ భారతదేశంలో అడుగు పెట్టినప్పటి నుంచి కూడా జవాహర్, ఎడ్వినాల అన్యోన్యత పలువురు బ్రిటిష్ అధికారుల వ్యక్తిగత డైరీలలో కూడా నమోదైంది. ఇందుకు సంబంధించిన కథనాలు ఎక్కువగా రాజకీయ ప్రత్యర్థుల నుంచి వచ్చినప్పటికీ, విభజన నాటి తొలి రోజులలో తలెత్తిన అనేక సంక్షోభాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాల మీద ఆ ఇద్దరి అన్యోన్యత తనదైన ప్రభావం చూపించిందన్నది మాత్రం వాస్తవం అని తేల్చారు సామ్.

సామ్ రాసిన ఈ పుస్తకంలో విశేషంగా ఆకర్షించే అంశం మరొకటి ఉంది. అది స్వతంత్ర భారత తొలి హోంమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టవలసిన సర్దార్ వల్లభ్ భాయి పటేల్, 1946 సమయానికే నాటి బ్రిటిష్ ఇండియా నిఘా వ్యవస్థల మీద గట్టి పట్టు కలిగి ఉండేవారు. ఆఖరికి మౌంట్‌బాటన్ వరకు ఏ సమాచారం వెళ్లాలో శాసించే స్థాయిలో పటేల్ ఉండేవారు. కొన్ని విషయాలు పటేల్ తన దాకా రానివ్వడంలేదేమోనని మౌంట్‌బాటన్‌కూ అనుమానం ఉండేదని సామ్ చెప్పారు. రికార్డులలో కనిపిస్తున్నదాని కంటే ఆనాడు పటేల్‌కు తెర వెనుక ఉన్న పలుకుబడి చాలా ఎక్కువ అని కూడా సామ్ వ్యాఖ్యానించారు.

కశ్మీర్ విలీనం వివాదం గురించి కూడా సామ్ కొన్ని విషయాలు ప్రస్తావించారు. సంస్థానాధీశుడు మహారాజు హరిసింగ్ విలీన ఒప్పందం మీద సంతకం చేయక ముందే భారత సేనలు కశ్మీర్‌లో ప్రవేశించాయా? అన్నది కూడా చర్చనీయాంశమేనని అంటారాయన. ఇందులో, అంటే పాకిస్తాన్ సేనలు గిరిజనుల రూపంలో కశ్మీర్ లోయలోకి ప్రవేశించడం వెనుక ఉన్న అసలు విషయం కూడా చాలామంది తెలియదని చెబుతున్నారు సామ్. నిజానికి కశ్మీర్‌లోకి పాకిస్తాన్ సేనలు జిన్నా అనుమతి తీసుకోకుండానే ప్రవేశించాయని అంటున్నారు సామ్. రెండు దేశాలు స్వాతంత్ర్యం పొందిన కొన్ని వారాలలోనే, అంటే సెప్టెంబర్ 1947 ప్రాంతంలో కొందరు పాకిస్తాన్ అధికారులు కశ్మీర్‌లో అశాంతిని సృష్టించే కుట్ర పన్నారని, ఆ విషయం జిన్నాకు తెలియకుండా మూడు నెలలు ఉంచారని కూడా సామ్ బయటపెట్టారు. ఇందులో ఆంగ్ల సైనికాధికారులు కూడా తమ వంతు పాత్ర నిర్వహించారట. గిల్గిత్‌లో మహారాజా వద్ద పనిచేసే అధికారిని అరెస్టు చేయడం ఒక ఆంగ్ల సైనికాధికారి మద్యం మత్తులో ఉండగా జరిగింది. రెండు సీసాల జిన్ తాగేసి అతడు ఈ పనికి పూనుకున్నాడు. నిజానికి స్వతంత్రం వచ్చిన తొలి రోజులలో ఆంగ్లేయులే మనకూ, పాకిస్తాన్‌కూ మిలటరీ అధికారులుగా వ్యవహరించారు. వీళ్ల ఆగడాలను అరికట్టిన వారు కూడా సర్దార్ పటేలే.

1971 నాటి బాంగ్లాదేశ్ విమోచనకు సంబంధించి కూడా సామ్ ఆసక్తికరమైన చారిత్రక అంశాలు వెల్లడించారు. క్యూబన్ క్షిపణి సంక్షోభం పేరుతో ఆడిన నాటకం అందులో ఉందని ఆయన అంటారు. అది కూడా ప్రచ్ఛన్నయుద్ధంలో భాగమేనని కూడా చెప్పారాయన. అమెరికా పాకిస్తాన్‌కు అనుకూలంగా బంగాళాఖాతంలోకి అణ్వాయుధాల నౌకలను పంపగా, రష్యా వెంటనే భారత్‌కు అనుకూలంగా అణు జలాంతర్గాములను మోహరించింది.

యెమెన్ నుంచి మైన్మార్ వరకు చోటు చేసుకున్న భౌగోళిక పరిణామాలు, అందుకు సంబంధించిన కథనాలు చాలా వరకు ప్రజల మనో ఫలకాల నుంచి అదృశ్యమైపోయాయి. బ్రిటిష్ రాజ్ పరిధిలోని భారత భూభాగం ఎంతో మనమే మరిచిపోయామని సామ్ అన్నారు.

విదేశీ పాలకులు భారత భూభాగాన్ని ఖండ ఖండాలుగా నరికారు. బ్రిటిష్ జాతి పాలనాకాలం చూస్తే 61 సంవత్సరాలలో ఏడుసార్లు భారత్ విడిపోయింది. బర్మా మాత్రమే కాదు, శ్రీలంక కూడా మన దేశం నుంచి విడివడిన భూభాగమే. మొదట భారతదేశం నుంచి అఫ్ఘానిస్తాన్ 1876లో విడిపోయింది. నేపాల్ 1904లో వేరు పడింది. భూటాన్ 1906లోను, టిబెట్ 1907లోను, శ్రీలంక 1935లోను విడిపోయాయి.

ఆ ప్రకారం చూస్తే అఖండ భారతదేశం హిమాలయాల నుంచి హిందూ సాగరం వరకు, ఇరాన్ నుంచి ఇండోనేషియా వరకు ఉండేది. 1857లో భారత భూభాగం 83 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఉండేది. మరి ఇప్పుడు 33 లక్షల చదరపు కిలోమీటర్లు. ఒకనాడు సింహళం, సింహళ ద్వీపం పేరుతో ఉనికిలో ఉన్న శ్రీలంకను 1935లోనే బ్రిటిష్ పాలకులు భారత్ నుంచి వేరు చేశారు. సింహళం తరువాత సిలోన్ అయింది. ఆపై శ్రీలంక పేరుతో పిలుచుకుంటున్నారు. అశోకుని కాలంలో శ్రీలంక పేరు తామ్రపర్ణి. అశోకుని కుమారుడు మహేంద్ర కూతురు సంఘమిత్ర బౌద్ధ మత వ్యాప్తికి శ్రీలంక వెళ్లారు. అఫ్ఘానిస్తాన్ పూర్వ కాలం పేరు అపగనస్తాన్. అలాగే అక్కడి కాందహార్ అసలు పేరు గాంధార. అపగనస్తాన్ శైవారాధనను పోషించిన ప్రదేశం.

గాంధార అంటే మహా భారతంలోని గాంధారి పుట్టిన దేశం. అంటే శకుని రాజ్యం. మొగల్ పాలకుడు షాజహాన్ కాలం వరకు కూడా కాందహార్‌ను గాంధారగానే పిలిచారు. 1876లో బ్రిటన్, రష్యాల మధ్య జరిగిన గండమాక్ ఒప్పందం మేరకు అఫ్ఘానిస్తాన్ ప్రత్యేక దేశంగా ఉండడానికి ఆమోదించింది. నేపాల్‌నే మన పురాణాలలో దేవధర్ అని ప్రస్తావించారు. సీతా మహాసాధ్వి జన్మించిన జనక్‌పురి, బుద్ధుడు జన్మించిన లుంబిని ఇక్కడే? ఉన్నాయి. ఇది హిందూదేశంగానే చిరకాలం ఉంది. ఇక్కడ రాజరికం ఉండేది. రాజును నేపాల్ నరేశ్ అని పిలిచేవారు. అశోకుడు, సముద్రగుప్తుల కాలంలో ఇది భారత్ భూభాగం. 1951లో నేపాల్ రాజు త్రిభువన్ సింగ్ తమ దేశాన్ని భారత్‌లో విలీనం చేసుకోవలసిందని ప్రథమ ప్రధాని నెహ్రూను కోరారు. కానీ నెహ్రూ తిరస్కరించారు. టిబెట్‌కు చరిత్రలో ఉన్న పేరు త్రివిష్టం. 1907లో బ్రిటన్‌కు, చైనాకు మధ్య జరిగిన ఒప్పందం మేరకు ఇది రెండు ముక్కలయింది. ఒక భాగం చైనాకు వెళ్లింది. రెండోది లామాకు వెళ్లింది. 1954లో చైనాకు వెళ్లిన టిబెట్ భాగం వారిదేనని నెహ్రూ ప్రకటించారు. నెహ్రూ తీసుకున్న నిర్ణయాలలో ఇది కూడా వివాదాస్పదమే. భూటాన్ అసలు పేరు భూ ఉత్థాన్. అంటే ఎగువ ప్రాంతం. 1906లో దీనిని భారత్ నుంచి విభజించారు.

థాయ్‌లాండ్ (1939 వరకు పేరు సయాం), కంబోడియా (సంస్కృత నామం కాంభోజ), వియత్నాం (పూర్వ నామం చంపాదేశ్), మలేసియా (మాలే దేశం అంటూ సంస్కృతంలో కొండల రాజ్యం), ఇండోనేసియా (దీపాంతర భారత్) భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, సంస్కృతం పరిఢవిల్లిన ప్రాంతాలే.

సామ్ డాల్రింపుల్ అభిప్రాయాలను పరిశీలించిన తరువాత మనకు ఒక విషయం అర్థమై ఉంటుంది. సామ్ వివరణ అంతా గతం. కానీ ఈ దేశాన్ని మరొకసారి, వీలైతే వీలైనన్నిసార్లు విభజించాలన్న కుట్రలు దేశంలోను, అంతర్జాతీయంగాను ప్రయత్నాలు ఇప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. వాటిని ఎలా ఎదుర్కొనాలి? హిందువులు కూడా నివసించడానికి ఒక దేశమంటూ ఉండక్కరలేదా? ఆలోచించాలి మరి!

– జాగృతి డెస్క్




భక్తాగ్రేసరులు



# సమర్థ రామదాసు

మహారాష్ట్రలోని గోదావరి తీర గ్రామం జామ్‌లో సమర్థ రామదాసు (తొలి పేరు నారాయణ) రామాలయ అర్చకులు సూర్యాదీపంత్, రాణూబాయి దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. తండ్రిలానే పరమ రామభక్తుడు. కుటుంబ బంధాలు త్యజించి, అరణ్యంలో పన్నెండేళ్ల పాటు తపస్సు చేసి రామదాసుగా పేరు మార్చుకున్నారు. కౌపీనధారిగా భిక్షాటనతో జీవించారు. రామాయణం, భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలకు గొప్ప వ్యాఖ్యలు రాశారు. అప్పటి దాకా ఆయనను హేళన చేసినవారు ఆయన ఉన్నతిని గ్రహించి 'సమర్థ' (శ్రేష్ఠుడు) రామదాసు అని పిలవసాగారు. వీరశివాజీ తండ్రి షాజీ.. స్వామీజీతో 'హైందవీ స్వరాజ్య' సంకల్పాన్ని చెప్పుకున్నారు. శివాజీ ఆయనకు శిష్యరికం చేస్తూ, వసతి కల్పించి తరచూ దర్శించుకొనేవారు. 'సుగుణాలను అలవరచుకొని ఇతరులకు బోధించాలి. గొప్పవ్యక్తి ఇంకొందరు గొప్పవారిని సృష్టించగలగాలి. ధర్మాన్ని ఆచరించేవాడు ఆదర్శపురుషుడు' అని బోధించిన ఆయన శివాజీని అలా తీర్చిదిద్దారు.

## కథ | రాజుగారి కల

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించే శ్రీకృష్ణ దేవరాయలకు ఒక రోజు కల వచ్చింది. రత్నాలూ, వజ్రాలు పొదగిన సింహాసనంపై తాను కుర్చుని ఉన్నట్లు కనిపించింది. ఆ సింహాసనం ఎంత గొప్పదంటే... దానిమీద కూర్చోగానే కోరుకున్న చోటుకి క్షణంలో తీసుకెళ్లగలదు. గాలిలో తేలే ఆ సింహాసనానికి పొదిగిన ప్రతి రత్నంలో, ప్రతి వజ్రంలోనూ రాజుగారి ప్రతిబింబమే కనిపిస్తూ ఉంటుంది.

ఉదయాన్నే మెలకువ వచ్చిన రాయల వారికి ఎటు చూసినా ఆ సింహాసనమే కనిపించసాగింది. తన కలను సభకు వివరించిన ఆయన, ఆ కల నిజమయ్యేలా సింహాసనం తయారు చేయాలని కోరారు.

అది విన్నవారంతా గాలిలో తేలే సింహాసనాన్ని తయారు చేయడం సాధ్యం కాదంటూ నచ్చ జెప్పేందుకు ప్రయత్నించారు. రాయలు కోపగించుకొని 'ఇదంతా నాకు అనవసరం. మీరేం చేస్తారో నాకు తెలియదు. కానీ, నా కల నిజమవ్వాలి. అలాంటి సింహాసనాన్ని చేయించిన వారికి లక్ష వరహాలు బహుమతిగా ఇస్తాను' అని ప్రకటించారు.

ఎన్ని రోజులు గడుస్తున్నా రాయలు తన కలను గుర్తు చేయడం మాత్రం మానలేదు.

ఈ నేపథ్యం ఒక రోజు ఒక వృద్ధుడు రాజుగారి సభకు వచ్చాడు. నెరిసిపోయిన జుట్టు, గడ్డం, మీసాలతో కర్ర సహాయంతో అతి కష్టంమీద నడుస్తూ,



## పద్యం

**కమలములు నీటి బాసిన**
**కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్**
**తమతమ నెలవులు దప్పిన**
**తమమిత్రులె శత్రులౌట తథ్యము సుమతీ**

భావం : కమలాలు తమ నివాసమైన నీటిలో ఉన్నంతవరకే తమ బాంధవుడు సూర్యుని వల్ల వికసిస్తాయి. నీటి నుంచి బయటపడితే అదే కమల బాంధవుడి వేడికి కమిలిపోతాయి. తమ తమ స్థానాలు తప్పితే మిత్రులే శత్రువులయ్యే అవకాశం ఉందని భావం.

## శ్లోకం

**కర్తవ్యమేవ కర్తవ్యం**
**ప్రాణైః కంఠ గతైరపి**
**అకర్తవ్యం నకర్తవ్యం**
**ప్రాణైః కంఠ గతైరపి**

భావం : కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు చేయవలసిన పనిని ఆచరించి తీరాల్సిందే. అదే సమయంలో ప్రాణం మీదికి వచ్చినప్పటికీ చేయరాని పనులు చేయకూడదు. చేయదగిన, చేయకూడని పనుల విషయంలో విచక్షణ కలిగి ఉండాలని భావం.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| భారతదేశం | డైట్ |
| చైనా | కాంగ్రెస్ |
| జపాన్ | పార్లమెంట్ |
| కొలంబియా | నేషనల్ అసెంబ్లీ |
| ఫ్రాన్స్ | నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ |

సమాధానాలు : భారతదేశం-పార్లమెంట్, చైనా-నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, జపాన్-డైట్, కొలంబియా-కాంగ్రెస్, ఫ్రాన్స్-నేషనల్ అసెంబ్లీ.

నిర్వహణ : నయనశ్రీ

## శాస్త్రవేత్తలు



### తిరువెంకట రాజేంద్ర శేషాద్రి

ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, విద్యావేత్త. 1900 ఫిబ్రవరి 8న తమిళనాడులోని కురిటలైలో జన్మించారు. భారతీయ ఔషధ, ఇతర మొక్కలపై పరిశోధనలకు ప్రసిద్ధి చెందారు. దేశంలో ఆర్గానిక్ కెమిస్ట్రీని అభివృద్ధి చేశారు. సైన్స్ రంగంలో ఆయన చేసిన కృషికి భారత ప్రభుత్వం ఆయనకు 1963లో పద్మభూషణ్ ప్రదానం చేసింది. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (1942), ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ (1960), ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (1967-1968) అధ్యక్షుడిగానూ ఈయన సేవలందించారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో అతి పొడవైన హిమానీనదం?
2. పింక్ సిటీగా ప్రసిద్ధి పొందిన నగరం ఏది?
3. భారత లోక్‌సభ మొట్టమొదటి స్పీకర్?

జవాబులు : 1. సియాచిన్ గ్లేసియర్ (కారా–కోరం శ్రేణి), 2. జైపూర్, 3. జి.వి. మావలంకర్.

రాయలవారిని సమీపించాడు. 'నాకు అన్యాయం జరిగింది, న్యాయం చేయండి ప్రభూ' అని ప్రార్థించాడు.

'నీకు జరిగిన అన్యాయం ఏమిటి నిర్భయంగా చెప్పు. నీకు న్యాయం చేస్తాను' అని రాయలు హామీ ఇచ్చారు.

'నా దగ్గర నూరు బంగారు నాణేలుండేవి ప్రభూ. అవి ఒకరు దొంగిలించారు. వారెవరో నాకు తెలుసు. వారి నుంచి వాటిని నాకు ఇప్పించండి చాలు' అని వృద్ధుడు వేడుకున్నాడు.

అదంతా శ్రద్ధగా విన్న రాయలు 'ఈ దొంగతనం ఎవరు చేశారు? ఎక్కడ జరిగింది?' అని ప్రశ్నించారు. వృద్ధుడు తటపటాయించడం చూసి, 'నీకేం భయంలేదు, చెప్పు' అంటూ ప్రోత్సహించారు.

'అది మీరే ప్రభూ! నిన్నరాత్రి నా కలలోకి వచ్చి మీరే వాటిని తీసుకెళ్లి పోయారు' అంటూ తన కలను వివరించాడు వృద్ధుడు.

రాయలకు చాలా కోపం వచ్చింది. 'ఏమిటీ ప్రేలాపన! కలలో జరిగింది నిజమనుకుంటే ఎలా?' అంటూ అసహనంగా వృద్ధుడి వైపు చూశారు.

ఈ మాట విన్న వృద్ధుడు తన గెడ్డం, మీసం తొలగించాడు. చూస్తే...! అతను తెనాలి రామకృష్ణుడు.

'క్షమించండి రాజా! మీ కలను నిజం చేయడం ఎంత కష్టమో నిరూపించడానికే ఇలా చేశాను' అన్నాడు.

తెనాలి రామకృష్ణుడు చేసిన పనికి రాయలకు చాలా నవ్వొచ్చింది. ఇంత చక్కగా తనకు అర్థమయ్యేలా వివరించిన రామలింగడిని ఎంతగానో అభినందించాడు. ★

## మెదడుకు మేత

ఎంత దానం చేసినా తరగనిది.. అంతకంతకు పెరిగేది?

జవాబు : జ్ఞానం

## మంచిమాట

ఇతరుల గురించి నీకు చెప్పేవారు.. నీ గురించీ ఇతరులకు చెబుతారని గ్రహించాలి




# వారఫలాలు 01-07 సెప్టెంబర్ 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. అందరిలోనూ పేరుప్రతిష్టలు పొందుతారు. మీ ఆశయాలు నెరవేరే సమయం. నిరుద్యోగులు అనుకున్న అవకాశాలు సాధిస్తారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వీలుంది. వ్యాపారులు సమస్యల నుండి గట్టెక్కుతారు. ఉద్యోగులకు పైస్థాయివారి సహాయం. కళాకారులు, శాస్త్రవేత్తల కృషిఫలించి కొన్ని అవకాశాలు దక్కించుకుంటారు. 2,3 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. మానసిక ఆందోళన. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సమాజసేవలో మీ పాత్ర పోషిస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. భూములు, వాహనాలు సమకూరతాయి. కుటుంబంలో సమస్యలు తీరి ఊరట చెందుతారు. అందరిలోనూ మీ అనుభవాన్ని చాటుకుంటారు. వ్యాపారులు మరింత విస్తృతికి చేసే యత్నాలు. ఉద్యోగులకు హోదాలు. రచయితలు, వ్యవసాయదారులకు సంతోషదాయకంగా గడుస్తుంది. 4,5 తేదీల్లో దూరప్రయాణాలు. ఖర్చులు పెరుగుతాయి. శివస్తుతి మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆప్తులు మీకు చేదోడుగా నిలుస్తారు. నిరుద్యోగుల యత్నాలలో మరింత పురోగతి. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరతాయి. చిన్ననాటి విషయాలు కొన్ని గుర్తుకు తెచ్చుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. వ్యాపారులు లాభాల బాట పడతారు. ఉద్యోగులకు ఒక సమాచారం వరంగామారనుంది. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు విదేశీపర్యటనలు. 6,7 తేదీల్లో వృథాఖర్చులు. మానసిక అశాంతి. కాలభైరవాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొన్ని అరుదైన ఆహ్వానాలు అందుతాయి. విద్యార్థుల చిరకాల స్వప్నం నెరవేరతుంది. ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. పరిచయాలు మరింత పెరుగుతాయి. సొంత ఆలోచనలతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు దక్కవచ్చు. ఉద్యోగుల విధుల్లో చిక్కులు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రచయితలు, క్రీడాకారులకు కీర్తి పెరుగుతుంది. 1,2 తేదీల్లో బంధు విరోధాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

బంధువులనుంచి ధనలాభం. వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం ఇబ్బంది పెట్టినా ఉప శమనం లభిస్తుంది. నిరుద్యోగులకు శుభవార్తలు. వ్యాపారస్తులు లావాదేవీలను విస్తృతం చేస్తారు. ఉద్యోగులు విధుల్లో ఆటంకాలు తొలగి ఊరట చెందుతారు. క్రీడాకారులు, వ్యవసాయదారుల శ్రమ ఫలించే సమయం. 3,4 తేదీల్లో మిత్రులతో వివాదాలు. ఒప్పందాలు వాయిదా. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

బంధువులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. భూములు, వాహనాల కొనుగోలుకు సమాయత్తమవుతారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే వీలుంది. వ్యాపారస్తులు ఉత్సాహంగా సాగుతారు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు ఉండ వచ్చు. క్రీడాకారులు, రచయితలు కొన్ని శుభవార్తలు వింటారు. 5,6 తేదీల్లో అనారోగ్యం. కొన్ని క్లిష్ట సమస్యలు. సుబ్రహ్మణ్యేశ్వరుని ధ్యానించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కుటుంబ బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి అవుతారు. దూరప్రయాణాలు. సోదరులతో అకారణంగా విభేదాలు. వ్యాపారులకు లావాదేవీలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు మరింత పనిభారం మీద పడవచ్చు. నిరుద్యోగులకు శ్రమ తప్ప ఫలితం ఉండదు. రాజకీయవేత్తలు, కళాకారులకు సామాన్య స్థితి. 3,4 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. కొత్త పరిచయాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

మీపై వచ్చిన అపవాదులు తొలగి ఊరట చెందుతారు. వ్యాపారస్తులు తగినంతగా లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగుల ఆశలు నెరవేరే సమయం. రచయితలు, క్రీడాకారులకు ఊహించని అవకాశాలు దక్కుతాయి. 6,7 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. స్నేహితులే శత్రువులుగా మారతారు. సూర్యారాధన మంచిది.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆలోచనలు పరిపరి విధాలుగా ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. సన్నిహితుల సాయంతో కొన్ని వ్యవహారాలలో విజయం వ్యాపారస్తులు సొంత ఆలోచనలతో లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులు అనుకూలస్థితి మధ్య విధులు నిర్వర్తిస్తారు. వైద్యులు, శాస్త్రవేత్తలకు ఉత్సాహకరంగా ఉంటుంది. 2,3 తేదీల్లో వృథా ఖర్చులు. అనుకోని ప్రయాణాలు. శివాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కొన్ని వ్యవహారాలు విజయవంతంగా సాగుతాయి. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. కొన్ని సమస్యల నుంచి అనూహ్యంగా బయటపడతారు. గతంలోని సంఘటనలు కొన్ని గుర్తుకువస్తాయి. శత్రువులు సైతం మిత్రులు మారతారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. నిరుద్యోగుల యత్నాలు కార్యరూపం దాలుస్తాయి. వ్యవసాయదారులకు తగిన ప్రోత్సాహం. 5,6 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో చికాకులు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆప్తులు మరింత దగ్గరకువస్తారు. విద్యార్థుల ప్రతిభ వెలుగులోకివచ్చే అవకాశాలు విస్తృతమవుతాయి. ఇంటి నిర్మాణయత్నాలు, పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులు నైపుణ్యతను చాటుకుంటారు. ఉద్యోగులు బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తారు. క్రీడాకారులు, శాస్త్రవేత్తలు అంచనాలు నిజంచేసుకుంటారు. 6,7 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆప్తులు, బంధువుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్థిరాస్తి వివాదాలు తీరి కొంత లబ్ధి చేకూరుతుంది. ఒక కోర్టు కేసు విషయంలో రాజీపడతారు. వ్యాపారస్తులు కొంతకాలంగా పడుతున్న ఇబ్బందులు తీరతాయి. ఉద్యోగులకు ఆశ్చర్యకరమైన మార్పులు ఉండవచ్చు. పారిశ్రామికవేత్తలు, వ్యవసాయదారులు కొంత ప్రయోజనం పొందుతారు. 2,3 తేదీల్లో సన్నిహితులతో విభేదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

# పదరసం-529

## ఆధారాలు

**అడ్డం**

1. ఏడు రోజులు (2)
2. 'వాయులీన' వెంకటస్వామినాయుడి ఇంటిపేరు (2)
3. అర్జునుడు శివుడిని మెప్పించి సాధించిన అస్త్రం (4)
6. హృదయం (2)
8. ఆభరణం (2)
10. నిలువు నాలుగు వద్ద మృతసంజీవని నేర్చినవాడు (3)
12. సన్యాసి (2)
13. ఖండం, తునక (2)
16. ధనాగారం (2)
17. సంపద (3)
20. పుణ్యాలకు వ్యతిరేకం (3)
21. అజ్ఞాతవాసంలో పార్థుడి పేరు (4)
23. అరణ్యం (2)
24. పాలించు (2)
26. చూచు.. ప్రసవం (2)
28. దుఃఖం...దిగులు (2)
29. దేవమాత..అటు నుంచి (3)
30. రామయ్యను నది దాటించినవాడు (3)

**నిలువు**

1. శ్రీమహావిష్ణువు అయిదవ అవతారం (3)
2. వామనుడు అవతరించిన తిథి (3)
4. రాక్షస గురువు (3)
5. ఇదో వాద్యం.. వీణ లాంటిదే (3)
7. స్వర్గము (3)
9. పూర్వీకుల శ్రాద్ధకర్మలకు ప్రసిద్ధ క్షేత్రం (2)
11. నక్షత్రం... బిందువు (2)
14. నిలువు ఒకటి వల్ల పాతాళానికి చేరిన దాత (2)
15. ఆంగ్ల అయిదవ నెల (1)
16. ఆలయమే (3)
17. తామరలు (4)
18. వంక, కారణం (2)
19. నకులుడి తమ్ముడి పేరు తొలి అక్షరాలు (2)
20. పాదం బహువచనం (3)
21. దేవగురువు (4)
22. పూజ్యం...కింద నుంచి (2)
24. మకరి బాధిత జంతువు (3)
25. ప్రతిమ..విగ్రహం (2)
27. రాజు...చంద్రుడు (2)
28. తొలి...మొదటి (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | ■ | 2 | | ■ | 3 | 4 | | 5 |
| | ■ | 6 | | ■ | 7 | ■ | | ■ | |
| 8 | 9 | ■ | | ■ | 10 | 11 | | ■ | |
| ■ | 12 | | ■ | ■ | 13 | | ■ | 14 | ■ |
| 15 | ■ | ■ | 16 | | ■ | ■ | 17 | | 18 |
| ■ | 19 | ■ | | ■ | 20 | | | ■ | |
| 21 | | 22 | | ■ | | ■ | 23 | | ■ |
| | ■ | | ■ | 24 | | ■ | | ■ | 25 |
| | ■ | ■ | 26 | | ■ | 27 | ■ | 28 | |
| 27 | | | ■ | 30 | | | ■ | | ■ |

## పదరసం - 528 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వా | తా | 2 పి | ■ | 3 శ్య | ■ | ■ | 4 అం | 5 బ | ■ |
| మ | ■ | నా | ■ | 6 మం | గ | ళం | ■ | ద | ■ |
| ■ | ■ | 7 క | ల | త | ■ | ■ | 8 గి | రి | 9 జ |
| 10 స | 11 ర్వ | ము | ■ | క | ■ | 12 మూ | ■ | ■ | య |
| ■ | శూ | ■ | ■ | మ | ■ | షి | ■ | 13 21 | ■ |
| 14 కు | ■ | ■ | 15 కా | ణి | పా | క | ము | ■ | 16 వం |
| 17 మా | రే | డు | ■ | ■ | ■ | ము | ■ | 18 హ | స్త |
| ర | ■ | ■ | 19 గ | ■ | 20 అ | ■ | ■ | స్తి | ■ |
| స్వా | ■ | 21 క | రి | ■ | శ్వ | ■ | 22 శి | ■ | 23 శ |
| 24 మి | శ | ■ | 25 క | పి | త్థం | ■ | 26 వా | ని | శి |

తెలుగులోనే కాదు... పరభాషల్లోనూ ఈ మధ్య కాలంలో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు అంతగా స్పందన రావడం లేదు. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్‌కు ఓటీటీలో కాస్తంత ఆదరణ లభిస్తున్నా, థియేటర్లకు మాత్రం ఈ తరహా సినిమాలు జనాలను తీసుకు రాలేకపోతున్నాయి. తాజాగా విడుదలైన అనుపమా పరమేశ్వర్ 'పరదా' చిత్రానిదీ ఇదే పరిస్థితి.










# మహిళా చిత్రాలకు కాలం చెల్లిందా!?

గత కొంతకాలంగా స్టార్ హీరోయిన్లుగా గుర్తింపు తెచ్చుకున్న అనుష్క, ప్రియమణి, సమంత, కీర్తిసురేశ్, హన్సిక వంటి వారు అడపాదడపా లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తున్నారు. అనుష్క నటించిన 'అరుంధతి, రుద్రమదేవి, భాగమతి' తరహాలో మిగిలిన సినిమాలు బాక్సాఫీస్‌పై ఏమంత ప్రభావం చూపలేకపోయాయి. ప్రియమణి పలు ఆ తరహా చిత్రాలలో నటించింది కానీ ఓటీటీలో వచ్చిన ఒకటి రెండు సినిమాలే ఫర్వాలేదనిపించాయి. ఇక సమంత నటించిన సినిమాలు బాక్సాఫీస్‌లో సక్సెస్ సాధించడం కంటే సోషల్ మీడియాలోనే కాస్తంత బజ్‌ను క్రియేట్ చేశాయి. అలా వచ్చిన వాటిల్లో 'ఓ బేబి' బెటర్ మూవీ. కీర్తిసురేశ్‌కు 'మహానటి' ఉత్తమ నటిగా జాతీయ అవార్డును తెచ్చిపెట్టింది కానీ ఆ తర్వాత ఆమె నటించిన ఉమెన్ సెంట్రిక్ మూవీస్ వరుసగా ఫెయిల్ అయ్యాయి.

ఒకప్పుడు తెలుగునాట మహిళా ప్రాధాన్యతగల చిత్రాలు విశేషంగా అలరించాయి. వాటి ద్వారా ప్రేక్షకుల మదిలో చెరిగిపోని ముద్ర వేసిన నటీమణులూ ఉన్నారు. ఒకప్పుడు తెలుగునాట కథానాయికలకు ఎంతో ప్రాధాన్యమిస్తూ తీసిన సినిమాలు ఘనవిజయం సాధించాయి. అలాంటి చిత్రాలతోనే విజయశాంతి 'లేడీ సూపర్ స్టార్' అనిపించుకున్నారు. అయితే కొన్నాళ్లుగా స్త్రీ ప్రధాన గాథలతో రూపొందిన చిత్రాలు మెప్పించలేకపోతున్నాయి. అనుపమ పరమేశ్వరన్ నటించిన 'పరదా' అందుకు తాజా ఉదాహరణ. ఓ గ్రామంలోని మూఢాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమా రూపొందింది. బాధితురాలు తన ప్రమేయం లేకుండానే ఆ చిక్కు ముడిని తొలగించడానికి చేసే ప్రయత్నమే ఈ సినిమా. ఇందులో మరికొన్ని స్త్రీ పాత్రలూ ఆమెకు బాసటగా నిలుస్తాయి. కానీ ఎంచుకున్న అంశంలో బలంలేనందున ఈ సినిమా బాక్సాఫీస్‌లో సత్తా చాటలేకపోయింది. ఈ సినిమా ప్రమోషన్ సమయంలో అనుపమా పరమేశ్వరన్ 'లేడీ ఓరియంటెండ్ మూవీస్ పట్ల ఇటు పరిశ్రమ, అటు ప్రేక్షకులు కూడా చిన్న చూపుతో ఉన్నారు' అంటూ కన్నీటి పర్యంతమైంది. దీనికి ముందు వచ్చిన '8 వసంతాలు' కూడా మహిళల నేపథ్యంలోనే రూపొందిన సినిమా. అది కూడా అన్ని వర్గాలను అలరించడంలో విఫలమైంది. కథానాయికగా నటించిన అనంతిక సనీల్ కుమార్ కు మంచి పేరు వచ్చింది. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి తాను అనుకున్న కథను హృద్యంగా తీశాడనే పేరు సంపాదించుకున్నాడు. కానీ ఈ సినిమాకు మిశ్రమ స్పందన లభించింది. అయితే ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన తర్వాత... చాలామంది 'ఇంత మంచి కాన్సెప్ట్ ఒరియంటెడ్ మూవీ థియేటర్లలో ఎందుకు ఆడలేదో!?' అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. నిజానికి కథలో వైవిధ్యం ఉంటే ఆదరించడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అయితే సాధారణ ప్రేక్షకుడి పల్స్‌ను పట్టుకుని కథను చెప్పడంలో దర్శకులు ఫెయిల్ అవుతున్నారని అనుకోవచ్చు.

ఈ ఏడాది విడుదలైన సినిమాలనే తీసుకుంటే... జనవరిలో వచ్చిన 'గాంధీతాత చెట్టు' సినిమాలో ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్ర పోషించింది. ఇది విమర్శకుల ప్రశంసలు పొంది, జాతీయ స్థాయిలో సుకృతికి ఉత్తమ బాలనటిగా అవార్డు సంపాదించిపెట్టింది. కానీ కమర్షియల్ గా ఆడలేదు. అదే నెలలో వచ్చిన మరో చిత్రం 'తల్లి మనసు'. కన్నడ నటి రచిత మహాలక్ష్మి టైటిల్ పాత్ర పోషించిన ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య నిర్మించారు. ఈ సినిమా కూడా విజయాన్ని అందుకోలేకపోయింది. జనవరిలో విడుదలైన అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన 'రాచరికం' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఆనంది, వరలక్ష్మి శరత్ కుమార్ కీలక పాత్రధారులుగా మార్చిలో వచ్చిన 'శివంగి' సినిమా కూడా కమర్షియల్‌గా విజయం సాధించలేదు. ఆమని కీలక పాత్ర పోషించిన 'నారి' సినిమాది కూడా అదే పరిస్థితి. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ నిర్మించిన 'శారీ', మరో దర్శకుడు సంపత్ నంది... తమన్నా కీలక పాత్రధారిణిగా రూపొందించిన 'ఓదెల –2', సుమయ రెడ్డి నటించి, నిర్మించిన 'డియర్ ఉమ' వంటి సినిమాలకూ కమర్షియల్ గా ఎదురు దెబ్బలే తగిలాయి. ఈ మధ్య వచ్చిన 'ఉప్పుకప్పురంబు'లో కీర్తి సురేశ్ ప్రధాన పాత్ర పోషించింది. ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ చిత్రం అంతగా మెప్పించలేకపోయింది.

మహిళా ప్రధాన చిత్రాలకు అంతా ఆదరణ దక్కకపోయినా... వాటిని రూపొందించడంలో దర్శక నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారు. అలా అనుష్క నటించిన 'ఘాటి' సినిమా సెప్టెంబర్ 5న రాబోతోంది. చింతకింద శ్రీనివాసరావు కథను అందించిన ఈ సినిమాను క్రిష్ డైరెక్ట్ చేశారు. అనుష్కలోని మరో కోణాన్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుందని చెబుతున్నారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రాబోతున్న 'గర్ల్ ఫ్రెండ్'లో రశ్మిక మందన్న టైటిల్ పాత్ర చేసింది. జానపద కళాకారిణి 'గరివిడి లక్ష్మి' జీవిత చరిత్రను అదే పేరుతో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. లక్ష్మి పాత్రను ఆనంది పోషిస్తోంది. యాక్షన్ బేస్డ్ లేడీ ఓరియంటెడ్ మూవీ 'కిల్లర్'ను జ్యోతి పూర్వాజ్ తో పూర్వజ్ తెరకెక్కిస్తున్నారు. వరలక్ష్మి శరత్ కూడా స్త్రీ పాత్రల ప్రధానమైన రెండు మూడు సినిమాలు చేస్తోంది. అలానే గతంలో 'ఓ బేబీ' వంటి హిట్ సినిమాకు వర్క్ చేసిన హీరోయిన్ సమంత, దర్శకురాలు నందినీ రెడ్డి తిరిగి మరో లేడీ ఓరియెంటెడ్ మూవీ చేయబోతున్నారు. మరి ఇవేమైనా సక్సెస్ సాధించి, తిరిగి మహిళా ప్రధాన చిత్రాలకు ఊపిరి పోస్తాయేమో చూడాలి.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



# దూరాభారం మాయం..!

మూడు గంటలు పట్టే 100 కి.మీ.ల ప్రయాణం సగానికి సగం తగ్గిపోతే.. అంతకన్నా కావలసింది ఏముంటుంది సగటు వాహనదారులకు. అలాగని వారికి మార్గం సుగమం చేసేది మామూలు రహదారి అనుకుంటే పొరపాటుపడినట్టే. రూ.1,871 కోట్ల అంచనావ్యయంతో గంగానదిపై 8.15 కి.మీ.ల పొడవుతో ఆరు లేన్ల ఔంతా-సిమారియా గంగా వంతెన బిహార్ ప్రజల ప్రయాణ కష్టాలను తీర్చడానికి సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 22న పాట్నా జిల్లాలో మోకామతో బెగుసరాయ్‌ను అనుసంధానించే అతి కీలకమైన వంతెనను జాతికి అంకితం చేశారు. దాదాపు ఏడు దశాబ్దాల క్రితం నిర్మితమై ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న రెండు లేన్ల రైల్ కమ్ రోడ్డు వంతెన రాజేంద్ర సేతు స్థానాన్ని కొత్త వంతెన భర్తీ చేస్తుంది. పాతబడిపోయిన రాజేంద్ర సేతు వంతెన భారీ వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేది కాదు. తరచు మరమ్మతులకు గురవుతుండేది. దీంతో భారీ వాహనదారులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి చుట్టూ తిరిగి పోవాల్సి వచ్చేది. పాట్నా, ముజఫర్‌నగర్ జిల్లాల్లో తరచుగా వాహనాల రాకపోకలు నిలిచిపోతుండేవి. ఈ కొత్త వంతెన మోకామ, బెగుసరాయ్ ప్రాంతాల ప్రజలకు ఒక వంతెన మాత్రమే కాదు. వారి ఆకాంక్షలకు, జీవనోపాధికి, విపణికి ఒక వారధి కూడా. ఇది ఉత్తర బిహార్, దక్షిణ బిహార్ మధ్య ప్రయాణ దూరాన్ని 100 కి.మీ.ల వరకు తగ్గిస్తుంది. అయితే ఈ వంతెన నిర్మాణం అంత సులభంగా జరగలేదు. అక్కడ వరదలు సర్వసాధారణంగా వస్తుంటాయి. ఏడాదిలో 7 నుంచి 8 నెలలు మాత్రమే వంతెన నిర్మాణం జరిగేది. అయినప్పటికీ అక్టోబరు, 2017లో ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఈ ఇంజినీరింగ్ అద్భుతం ఇంత తొందరగా అందుబాటులోకి రావడం బిహార్ ప్రజలకు ఓ వరం.



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 45


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-



వెల : ₹.200/-



వెల : ₹.150/-



వెల : ₹.499/-



వెల : ₹.50/-



వెల : ₹.200/-



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.499/-



వెల:₹.499/-



వెల :₹.450/-



వెల : ₹.499/-



వెల : ₹.125/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722.


Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01